సంపుటి : 78 సంచిక : 34 పుటలు : 52

జాగృతి

కలి 5128 - శ్రీ పరాభవ అధిక జ్యేష్ఠ బహుళ అష్టమి
08-14 జూన్ 2026
వెల : ₹20/-

గోపురం

భారతీయ ఆలయ సంస్కృతికి యశఃపతాకం..

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు



వెల : ₹.150/-

వెల : ₹.60/-

వెల : ₹.270/-

వెల : ₹.80/-



వెల : ₹.54/-

వెల : ₹.800/900 : 999/1200



వెల : ₹.250/-



వెల : ₹.150/-

వెల : ₹.200/-



వెల:₹.999/- సెట్



వెల:₹.450/-



వెల :₹.699/-



వెల : ₹.400/-



వెల : ₹.145/-

పై పుస్తకములకు మరియు కొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి..

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

సాహిత్య నికేతన్ : కేశవనిలయం, బర్కత్‌పురా. 040-27563236, 9290127329, 8179163138

సాహిత్య నికేతన్ : వై.ఎం.ఐ.ఎస్. బిల్డింగ్, సిబిఐ ఆఫీస్ రోడ్, కోఠీ, హైదరాబాద్. 9440589722,

సాహిత్య నికేతన్ : ఏలూరు రోడ్, రామమందిరంవీధి, గవర్నరు పేట, విజయవాడ - 2. 8333812687

మహానదీ తీరం భక్తజన శోభితం..

మహానదీ తీరమంతటా భక్తిభావన వెల్లివిరిసే కాలమిది. జగన్నాథుడు వినువీధుల నుంచి మహారథంపై పురి పట్టణంలోకి చేరుకునే రోజులివి. పురి జగన్నాథుడి రథోత్సవానికి ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. ఏటా జగన్నాథుడి రథాల తయారీకి అవసరమైన చెట్లను ఎంపిక చేసి వాటిని సరిగ్గా 1072 భాగాలు చేస్తారు. ప్రధాన అర్చకుడు సహా మొత్తం తొమ్మిది మంది శిల్పులు, 125 మంది సహాయకులు రథాల తయారీలో పాల్గొంటారు. 1072 భాగాలను రథం తయారు చేయడానికి అనువుగా 2188 ముక్కలు చేస్తారు. అటుపై వీటిలో 832 భాగాలతో జగన్నాథుడి రథం తయారు చేస్తారు.

ఈ రథం ఎత్తు 45 అడుగులు ఉంటుంది. మొత్తం 16 చక్రాలు ఉంటాయి. 763 భాగాలతో బలరాముడి రథం తయారు చేస్తారు. ఈ రథం ఎత్తు 44 అడుగులు. మొత్తం 14 రథ చక్రాలు ఉంటాయి. 593 భాగాలతో సుభద్ర రథాన్ని తయారు చేస్తారు. ఇది 43 అడుగుల ఎత్తు ఉంటుంది. మొత్తం 12 రథ చక్రాలు ఉంటాయి. జగన్నాథుడి రథయాత్ర నేత్రోత్సవంతో ప్రారంభమై రసగుల్ల ఉత్సవంతో ముగుస్తుంది. ఈ ఏడాది నేత్రోత్సవం జులై 16న రసగుల్ల ఉత్సవంతో ప్రారంభమై జులై 25న ముగుస్తుంది.

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
Managing Editor : Kurra Durga Reddy.

సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు,
వ్యాపార ప్రకటనల వివరాల కోసం
(ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.

ఎం. శ్రీనివాస్ : సర్క్యులేషన్ ఇన్‌చార్జ్
040-27561453 / 9959997013

సంపాదక మండలితో సంప్రదింపుల కోసం
9959991304
(ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)

డిజైనర్ : చిగుళ్ల కుమార్

చందాదారులకి గమనిక

చందాలను ఎవ్వరికి వ్యక్తిగతంగా చెల్లించవద్దు. మీ దగ్గరకు వచ్చే బల్క్ మెంబర్లకు (కార్యకర్తలకు) మాత్రమే చెల్లించి రసీదు తీసుకోగలరు. లేదా కింద ఇచ్చిన అకౌంట్ ద్వారా చెల్లించగలరు.

ఫోన్ పే, గూగుల్ పే నుండి చెల్లించడానికి జాగృతి అకౌంట్ "To Bank / UPID" ఆప్షన్ వాడండి.

Link / QR Code ద్వారా మీ చందా చెల్లించినప్పుడు Remarks దగ్గర కట్టించిన కార్యకర్త పేరు ఫోన్ నెం. తప్పకుండా రాయించండి.

విడి ప్రతి రూ.20

5 సం॥ల చందా రూ.4000 సంవత్సర చందా రూ.850

బ్యాంకు ఖాతా వివరాలు

A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch. IFSC : UTIB0002157, PAN : AAATJ3829L

– సర్క్యులేషన్ ఇన్‌చార్జ్, జాగృతి

ఎన్నికల కమిషన్ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'ఓటర్ల జాబితా సమగ్ర సవరణ-సర్' ప్రక్రియపై దేశ సర్వోన్నత న్యాయస్థానం మే 27న సంచలన తీర్పు వెలువరించింది. ఎన్నికల కమిషన్ చట్ట బద్ధతపై, 'సర్' ప్రక్రియ నిర్వహణపై దాఖలైన పిటిషన్లను విచారించిన సుప్రీం కోర్టు ఓటర్ల జాబితా సవరణపై ఈసీకి సర్వాధికారాలు ఉన్నాయని చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాలా బాగ్చీ ధర్మాసనం స్పష్టం చేసింది.

'సర్'ను సవాలు చేస్తూ దాఖలైన అన్ని పిటిషన్లనూ కొట్టివేసిన సుప్రీం కోర్టు స్వేచ్ఛాయుత, పారదర్శక, నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణే ధ్యేయంగా ఎన్నికల కమిషన్ తీసుకునే నిర్ణయాలు చట్టబద్ధమేనని తీర్పులో పేర్కొంది. పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం మమతా బెనర్జీ చివరకు ఓట్ల లెక్కింపు సిబ్బంది నియామకాన్ని సైతం సుప్రీం కోర్టులో సవాలు చేసింది. కేంద్ర ప్రభుత్వ సిబ్బందిని ఎలా నియమిస్తారంటూ వాదించింది. సుప్రీం కోర్టు మమతా బెనర్జీ వాదనలను తోసిపుచ్చింది. సిబ్బంది నియామకం పూర్తిగా ఎన్నికల కమిషన్ విచక్షణే అని తీర్పులో స్పష్టం చేసింది.

సర్ ప్రక్రియలో భాగంగా పశ్చిమ బెంగాల్‌లో సుమారు 90 లక్షల అక్రమ ఓటర్లను ఈసీ తొలగించింది. బిహార్‌లో రమారమి 69లక్షలమంది ఓటర్లను, కేరళలో 53 లక్షల ఓటర్లను తొలగించింది. దీంతో దేశంలోని విపక్షాల పార్టీలతో పాటు వామపక్ష మేధావులు 'సర్' ప్రక్రియపై అనుమానాలు లేవనెత్తారు. ఓటర్ల జాబితా సమగ్ర సవరణ చట్టబద్ధతను సవాలు చేస్తూ... నాలుగు పిటిషన్లు దాఖలయ్యాయి.

1960ల నాటి ప్రాతినిధ్య చట్టాన్ని ఈసీ ఉల్లంఘిస్తోందంటూ పిటిషనర్లు వాదించారు. అయితే సర్వోన్నత న్యాయస్థానం ఈ వాదనలను తోసిపుచ్చింది. బిహార్, బెంగాల్లో విపక్షా పార్టీలకు ఓటు బ్యాంకుగా ఉన్న ముస్లిం ఓటర్ల ఏరివేతే లక్ష్యంగా ఇది సాగిందన్నది ప్రధానమైన విమర్శ. గడచిన దశాబ్ద కాలంగా ఎన్నికల కమిషన్ పై, ఎన్నికల నిర్వహణ, విశ్వసనీయత, పారదర్శకతపై అనేక విమర్శలు వస్తున్న నేపథ్యంలో సుప్రీం కోర్టు తీర్పునకు ప్రాధాన్యత ఏర్పడింది.

శాలివాహన 1948 శ్రీ పరాభవ అధిక జ్యేష్ఠ బహుళ అష్టమి

లోపలి పేజీలలో...



6లో

ముఖపత్ర కథనం

భారతీయ ఆలయ సంస్కృతికి యశఃపతాకం.. గోపురం

ధారావాహిక నవల

39 **గణపతిదేవుడు**

– మత్తి భానుమూర్తి

20లో

ముఖాముఖి

మనసే రణరంగం.. అక్కడి నుంచే యుద్ధాలు మొదలు

11లో

జాగృతి

సంపాదకీయం

'సర్"పై సుప్రీం తీర్పు చారిత్రకం

ఏటా జరిగే ఓటర్ జాబితా సవరణకంటే సర్ భిన్నంగా ఉన్నంత మాత్రాన దానిని వద్దనలేమని, మొదట్లో ఎక్కువమంది ఓటర్లను తొలగించినట్టుగా సర్ కనిపిస్తుంది కానీ, తగిన రక్షణచర్యలతో దీనిని రాజ్యాంగబద్ధంగా నిర్వహించవచ్చని కోర్టు వ్యాఖ్యానించింది. ఆధార్, ఓటరు కార్డు తిరస్కరణ సహా అర్హత పత్రాల నిర్ణయంలో ఈసీ అధికారాలను కోర్టు పూర్తిగా సమర్థించడం విశేషం.

'సర్' రాజ్యాంగబద్ధం, దానిని నిర్వహించే హక్కు, అధికారం ఈసీకి ఉన్నాయి, అది ఏ చట్టాలనూ అతిక్రమించలేదు, రాష్ట్రాల్లో 'సర్' నిర్వహణ ఆవశ్యకత ఉందన్న ఈసీ వాదన సమర్థనీయం, నిష్పక్షపాతంగా, స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా ఎన్నికలు జరగాలన్న రాజ్యాంగ ఆదేశాలను, ఆకాంక్షలను సర్ నెరవేరుస్తుంది అంటూ చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాలా బాగ్చీ ధర్మాసనం తమ నూటపాతిక పేజీల తీర్పులో నిర్ధారించింది.

ఎన్నికల కమిషన్‌పై ఇటీవలి కాలంలో అనేక వివాదాలు తలెత్తాయి. ఎన్నికల కమిషనర్, కమిషనర్ల నియామక ప్రక్రియపై సైతం సుప్రీం కోర్టులో అనేక పిటిషన్లు దాఖలయ్యాయి. బిహార్, పశ్చిమ బెంగాల్, కేరళ రాష్ట్రాల్లో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ ఇప్పటికే పూర్తయిన నేపథ్యంలో దాఖలైన పిటిషన్లను విచారించిన జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం తీర్పు వెలువరించింది.

పదహారు రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో మూడోవిడత 'సర్"కు ఉపక్రమిస్తున్న తరుణంలో, జాబితాల ప్రక్షాళన విషయంలో ఎన్నికల సంఘానికి ఈ తీర్పు సర్వాధికారాలనూ దఖలుపరిచింది. బిహార్లో చేపట్టిన 'సర్" సరిగ్గానే ఉందని కోర్టు నిర్ధారించిన నేపథ్యంలో ఇక దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా సమగ్ర సవరణ ప్రక్రియ అమలు చేయడంలో ఈసీకి ఏ అడ్డంకులూ ఉండబోవు.

ఓటరు జాబితాలో పేరు లేనంతమాత్రాన పౌరసత్వం కోల్పోయినట్టు కాదని కూడా సుప్రీం తన తీర్పులో భరోసా ఇచ్చింది. దేశ పౌరులు కాదన్న అనుమానంతో రెండు దశాబ్దాల నాటి ఆ జాబితాల నుంచి తొలగించిన వ్యక్తులపేర్లను నాలుగు వారాల్లోగా పౌరసత్వాన్ని నిర్ధారించే యంత్రాంగానికి పంపించాలని ఎన్నికల సంఘాన్ని కోర్టు ఆదేశించింది. ఓటరు జాబితాలో తీసివేతలు, చేరికలను నిర్ణయించే పరిధి మాత్రమే ఎన్నికల సంఘానిది కానీ, పౌరసత్వాన్ని మాత్రం అది నిర్ధారించలేదన్నది దీని సారాంశం.

ఇదే ధర్మాసనం గతేడాది ఆగస్టులో ఆధార్ సాధికారతపై సైతం తీర్పు వెలువరించింది. ఎన్నికల కమిషన్ ఆధార్ కార్డును పౌరసత్వ రుజువుగా అంగీకరించకపోవడం సరైనదేనని కోర్టు సమర్థించింది. ఆధార్ కార్డు వివిధ ప్రభుత్వ, ప్రైవేటు సేవలు పొందేందుకు గుర్తింపు డాక్యుమెంట్‌గా ఉపయోగపడుతుంది.. కానీ ఇది ఒక వ్యక్తి జాతీయతను నిర్ధారించే సాక్ష్యం కాదని కోర్టు స్పష్టం చేసింది. మొత్తంగా ఇటీవలి కాలంలో రాజ్యాంగబద్ధ సంస్థలపై, వాటి సాధికారత, నిష్పాక్షికత, పారదర్శకత, విశ్వసనీయతపై రాజకీయ పార్టీలు, సంస్థలు అనేక ప్రశ్నలు సంధిస్తున్న నేపథ్యంలో దేశ సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు సర్ ప్రక్రియ నిర్వహణపై అనుమానాలను నివృత్తి చేస్తూ..స్పష్టమైన తీర్పు వెలువరించడం ముదావహం. ★

40లో

కథ

మూలపేట

- భారతి రాసజ్ఞా



'భోజ్‌శాల' తీర్పు- ఏడు శతాబ్దాల నిరీక్షణ (తీర్పు) - 14
దక్షిణ కోస్తా రైల్వేజోన్ కల సాకారం (ఆంధ్రప్రదేశ్) - 16
యుద్ధంతో ఆర్థిక సంక్షోభంలో ప్రపంచం! (అంతర్జాతీయం) - 24
ఆదర్శగృహిణికి ఆరు రూపాలు (వ్యక్తిత్వం) - 26
మహిళల 'బంగారు' భవిష్యత్ ! (పసిడి) - 28
సాహిత్యం చదివితే కలిగే ప్రయోజనాలు ఏమి? (గళమెత్తిన గతం) - 30
చొరబాటుదారులకు కళ్లెం (జాతీయం) - 32
జీవనయానంలో ప్రేమే పునాది (సమాజం) - 35
రైల్వేలో కీలకం కాజీపేట కూడలి (తెలంగాణ) - 38
సూర్యవంశీ 'వైభం'... బెంగళూరు విజయం! (క్రీడ) - 43
బాలజాగృతి - 46
యాక్షన్ మోడ్‌లో 'బ్లూస్ జోన్'! (సినిమా) - 50



భారతీయ సంస్కృతిలో ఆలయం అనేది కేవలం పూజాస్థలం కాదు. అది గ్రామానికి హృదయం, పట్టణానికి ప్రాణం, రాజధానికి ధర్మపీఠం, సమాజానికి సంస్కార కేంద్రం. వేదం, ఆగమం, శిల్పం, సంగీతం, నాట్యం, సాహిత్యం, దానం, ధర్మం, ఉత్సవం, సమూహజీవనం – ఇవన్నీ ఆలయాన్ని ఆశ్రయించి వికసించాయి. ఒకప్పుడు భారతదేశంలోని ప్రతి గ్రామంలోనూ, ప్రతి జనపదంలోనూ, ప్రతి పురంలోనూ ఆలయం జీవనకేంద్రంగా ఉండేది. ఉదయం ఘంటానాదంతో గ్రామం మేల్కొనేది; సాయంత్రం దీపారాధనతో ప్రజల మనస్సులు పవిత్రతను పొందేవి. అటువంటి ఆలయ సంస్కృతి పునరుద్ధరణ జరగాలంటే, దేశంలోని ప్రతి ప్రాంతంలో ఆలయాలు తిరిగి భక్తి, ధర్మం, సంస్కారం, సమైక్యతల కేంద్రాలుగా వెలగాలి. ఆ ఆలయాలకు గోపురాలు ఉండాలి. ఆ గోపురాలు కేవలం నిర్మాణాలు కాక, పురాల సంస్కార యశఃపతాకలు కావాలి.

గోపురం అనేది ఆలయానికి ముఖద్వారం మాత్రమే కాదు; అది ఆ ప్రాంతపు ధార్మిక జాగృతి. దూరం నుంచే కనిపించే గోపురం “ఇక్కడ ధర్మం ఉంది, ఇక్కడ దైవసాన్నిధ్యం ఉంది, ఇక్కడ సంస్కృతి సజీవంగా ఉంది” అని ప్రకటిస్తుంది. ఒక పల్లె గోపురం ఆ పల్లె భక్తిని తెలియజేస్తుంది. ఒక పట్టణ గోపురం ఆ పట్టణ సాంస్కృతిక వైభవాన్ని తెలియజేస్తుంది. ఒక మహాక్షేత్ర గోపురం దేశానికి ఆధ్యాత్మిక శక్తిస్తంభంలా నిలుస్తుంది. అందుకే గోపురం ఒక ధర్మధ్వజం, ఒక సంస్కార పతాకం, ఒక జనజీవన మార్గదర్శక చిహ్నం.

ఆలయ నిర్మాణంలో గోపుర స్థానం

భారతీయ ఆలయ నిర్మాణం

భారతీయ ఆలయ సంస్కృతికి యశఃపతాకం..

గోపురం

వాస్తు, ఆగమ, శిల్ప, తత్వశాస్త్రాల సమన్వయంతో ఏర్పడిన మహోన్నత విద్య. ఆలయం సాధారణ భవనం కాదు; అది దేవతా చైతన్యాన్ని స్థాపించే యంత్రరూపం, మంత్రరూపం, తంత్రరూపం. గర్భగుడి దేవతా హృదయం; విమానం ఆ దైవత్వపు శిఖరం; మండపాలు భక్తుల సాధనామార్గం; ధ్వజస్తంభం సమర్పణ-ఉత్సవ-ఆహ్వాన చిహ్నం; బలిపీఠం సమస్త భూతజాతులకు క్షేమసంకల్పం; ప్రాకారాలు రక్షణ, నియమం, ఆవరణం; గోపురం ఆ పవిత్ర ఆవరణంలోకి ప్రవేశించే మహాద్వారం.

గోపురం భక్తుని బాహ్య ప్రపంచం నుంచి అంతర్ముఖ ప్రపంచానికి తీసుకువెళ్తుంది. బయట మార్కెట్, వీధి, వ్యాపారం, కుటుంబచింత, ప్రపంచక్లేశం. గోపురం దాటిన తరువాత ప్రాకారం, ఘంటానాదం, ధూపగంధం, మంత్రోచ్చారణ, దైవదర్శనాభిలాష. ఈ మార్పును కలిగించే తొలి స్థానం గోపురద్వారం. అందువల్ల గోపురం భక్తుని మనస్సులో సంస్కారం మొదలుపెట్టే ఆధ్యాత్మిక ప్రవేశస్థలం.

ఆగమ సంప్రదాయాల్లో ఆలయాన్ని ఒక పురుషరూపంగా దర్శిస్తారు. ఆ ఆలయపురుషునిలో గోపురం బాహ్యజీవితం నుంచి అంతఃచైతన్యానికి తీసుకువెళ్లే ముఖద్వారంలా ఉంటుంది. గోపురం పైకి ఎదిగే తలాలు జీవుని ఆధ్యాత్మిక ప్రగతిని సూచిస్తాయి. అడుగు భాగం భౌతిక జీవితం; మధ్య భాగం నియమం, సాధన, శుద్ధి; శిఖరం జ్ఞానం; కలశం పూర్ణత్వం. కాబట్టి గోపురం ఒక నిర్మాణం మాత్రమే కాదు - అది మోక్షమార్గానికి సంకేత రూపమైన శిల్పోపదేశం.

వర్గీకరణ

ఆలయ గోపురాలు పరిమాణం, స్థానం, తలాల సంఖ్య, ఆగమ సంప్రదాయం, ఆలయ స్థాయి ఆధారంగా విభిన్నంగా ఉంటాయి. చిన్న గ్రామాలయాల్లో ఒక సాదాసీదా ముఖద్వార గోపురం ఉండవచ్చు. మధ్యస్థ ఆలయాల్లో త్రితల లేదా పంచతల గోపురం ఉండవచ్చు. మహాక్షేత్రాల్లో సప్తతల, నవతల, ఏకాదశతల, ఇంకా మహత్తర రూపాల్లో గోపురాలు ఉండవచ్చు.

స్థానపరంగా..

ముఖగోపురం-ఆలయ ప్రధాన ప్రవేశద్వారంపై ఉండే గోపురం.

రాజగోపురం - ఆలయ వైభవాన్ని ప్రకటించే మహాగోపురం. ఇది సాధారణంగా ప్రధాన ప్రాకార ద్వారం వద్ద ఉంటుంది.

ప్రాకార గోపురాలు - ఆలయ ప్రాకారాల తూర్పు, దక్షిణ, పశ్చిమ, ఉత్తర ద్వారాల వద్ద ఉండే గోపురాలు.

ఉపగోపురాలు - పరివార దేవతల, ఉపాలయాల, అంతర్గత ప్రాకారాల ద్వారాలపై ఉండే చిన్న గోపురాలు.

దిశలను బట్టి వైశిష్ట్యం

దిశాపరంగా తూర్పు గోపురం సూర్యోదయ, జ్ఞాన, ఆరంభ, మంగళ భావాలను సూచిస్తుంది. దక్షిణ గోపురం నియమం, ధర్మం, కాలతత్వం, పితృస్మరణ భావాలను వ్యాఖ్యానిస్తుంది. పశ్చిమ గోపురం అంతర్ముఖత, ఉపాసన, నిగూఢత, శాంతి భావాన్ని సూచిస్తుంది. ఉత్తర గోపురం ఐశ్వర్యం, జ్ఞానం, అభివృద్ధి, శుభవృద్ధిని సూచిస్తుంది. పెద్ద ఆలయాల్లో నాలుగు దిక్కుల గోపురాలు ఉంటే, అది దేవసాన్నిధ్యం సమస్త దిశలకు విస్తరించిందనే భావాన్ని తెలియజేస్తుంది. అయితే ప్రతి ఆలయానికి తప్పనిసరిగా నాలుగు గోపురాలే ఉండాలి అనేది సాధారణ నియమం కాదు. ఆ ఆలయ దేవతా స్వరూపం, ఆగమ పద్ధతి, స్థలవిస్తీర్ణం, గ్రామ నిర్మాణం, ఉత్సవమార్గం, భక్తుల రాకపోకలు, స్థపతి నిర్ణయం ఆధారంగా ఒక గోపురం, రెండు గోపురాలు, నాలుగు గోపురాలు లేదా అనేక గోపురాలు నిర్మితమవుతాయి.

తలాల సంకేతాలు

గోపురంలోని అంతస్తుల్లాంటి నిర్మాణ స్థాయిలను తలాలు అంటారు. ఇవి కేవలం భౌతిక అంతస్తులు కాదు; అవి శిల్పప్రమాణాలతో, తత్వసంకేతాలతో ఏర్పడిన ఆగమ స్థాయిలు. గోపుర తలాలు పైకి పోతూ క్రమంగా సన్నబడుతూ, ఆలయ నిర్మాణానికి స్థిరత్వం, సమతుల్యత, ఆధ్యాత్మిక ఊర్ధ్వగతి కలిగిస్తాయి.

ఏకతల గోపురం సరళమైన భక్తి, గ్రామ దేవతా సాన్నిధ్యం, ఆరంభస్థితిని సూచిస్తుంది. చిన్న ఆలయాలకు ఇది అనుకూలమైనది. ద్వితల గోపురం జీవ-ఈశ్వర, లోక-పరలోక, ప్రకృతి-పురుష సమన్వయాన్ని సూచిస్తుంది. త్రితల గోపురం భూః, భువః, స్వః అనే త్రిలోకాలను; శైవ దృష్టిలో త్రినేత్ర, త్రిగుణ, త్రికాల తత్వాలను; వైష్ణవ దృష్టిలో త్రివిక్రముని మూడు అడుగుల విశ్వరూపాన్ని; శాక్తేయ దృష్టిలో ఇచ్ఛా, జ్ఞాన, క్రియా శక్తులను సూచించగలదు. పంచతల గోపురం పంచ భూతాలను - భూమి, నీరు, అగ్ని, గాలి, ఆకాశం సూచిస్తుంది. శైవంలో పంచబ్రహ్మ తత్వాలు, వైష్ణవంలో పంచరూప భగవత్ సాన్నిధ్యం, శాక్తేయంలో పంచప్రాణ-పంచతత్వ శక్తి భావాలు దీనితో అనుసంధానమవుతాయి. సప్తతల గోపురం సప్తలోకాలు, సప్తర్షులు, సప్తస్వరాలు, సప్తమాతృకలు, సప్తధాతువులు వంటి విశ్వసంపూర్ణతను సూచిస్తుంది. నవతల గోపురం నవగ్రహాలు, నవరసాలు, నవవిధ భక్తులు, నవరంధ్ర పురం, నవశక్తులు వంటి విస్తృత భావసంపదను కలిగిస్తుంది. ఏకాదశతల గోపురం ఏకాదశ రుద్రులకు, ఉగ్రశక్తి నుంచి శాంతశివత్వానికి మార్గాన్ని సూచిస్తుంది. ద్వాదశతల గోపురం ద్వాదశ ఆదిత్యులు, ద్వాదశ మాసాలు, కాలచక్రం, సూర్య నారాయణ తేజస్సు వంటి భావాలను తెలియజేస్తుంది. షోడశల గోపురం షోడశ కళలు, సంపూర్ణ చంద్రత్వం, పూర్ణశక్తి, పరిపూర్ణ సౌందర్యం, దివ్య వైభవం సూచిస్తుంది. ఇలా తలాల సంఖ్యలు శిల్పసౌందర్యం మాత్రమే కాక, ఆధ్యాత్మిక యాత్రకు మెట్లుగా భక్తులు భావిస్తారు. భక్తుడు గోపురాన్ని దర్శించినప్పుడు, జీవితం కూడా భౌతిక స్థితి నుంచి పరమాత్మసాక్షాత్కారానికి ఎదగాలి అనే నిశ్శబ్ద ఉపదేశం అందుతుంది.

ఆచార్య రాణి సదాశివమూర్తి

ఉపకులపతి,

శ్రీవేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం, తిరుపతి

శిఖరం- కలశాలు- దైవచైతన్యం

గోపురం పైభాగం శిఖరం. ద్రావిడ సంప్రదాయంలో గోపుర శిఖరం చాలాసార్లు శాలా ఆకారంలో ఉంటుంది. శిఖరంపై కలశాలను అమరుస్తారు. కలశం అనేది భారతీయ ధార్మిక చిహ్నాల్లో అత్యంత మంగళమైనది. నీటితో నిండిన కుంభం పూర్ణత్వం, జీవసంపద, శాంతి, శ్రీ, ఆయురారోగ్యం, దైవానుగ్రహం సూచిస్తుంది. కుంభాభిషేక సమయంలో మంత్రసంస్కృత జలం ద్వారా కలశాలకు దైవచైతన్యాన్ని వేద పండితులు, అర్చకులు ఆవాహన చేస్తారు.

ఐదు కలశాలు పంచభూతాలకు, పంచబ్రహ్మ తత్వాలకు సంకేతం. ఏడు కలశాలు సప్తలోకాలు, సప్తర్షులు, సప్తమాతృకలు, సప్తస్వరాలు, సప్తసముద్రాలు వంటి విశ్వవ్యాప్తిని సూచిస్తాయి. తొమ్మిది కలశాలు నవగ్రహాలు, నవశక్తులు, నవవిధ భక్తి, నవరసాలకు సూచనగా భావించవచ్చు. పదకొండు కలశాలు ఏకాదశ రుద్ర తత్వాన్ని, పదహారు కలశాలు షోడశ కళా పూర్ణత్వాన్ని సూచించగలవు.

కలశం శిల్పానికి ముగింపు కాదు; అది ఆలయ చైతన్యానికి శిఖరబిందువు. గోపురం భూమి నుంచి ఆకాశానికి ఎదిగితే, కలశం భౌతిక నిర్మాణం దైవత్వాన్ని తాకే బిందువుగా నిలుస్తుంది.

శైవ ఆగమ దృష్టిలో..

శైవ ఆలయాల్లో గోపురం శివతత్వ ప్రవేశద్వారం. శివాలయంలో భక్తుడు గోపురం దాటి ప్రవేశించడం అంటే పశుభావం నుంచి పతితత్వాన్ని విడిచి పాశవిమోచన మార్గంలో అడుగుపెట్టడం. శైవ సిద్ధాంతంలో పతి, పశు, పాశ అనే మూడు తత్వాలు ప్రాధాన్యం పొందాయి. జీవుడు పాశ బంధనాల నుంచి విముక్తి పొంది పతియైన పరమశివుని సాక్షాత్కరించాలి. ఈ అంతర్ముఖ యాత్రకు గోపురం తొలి దశ.

శైవ గోపురాల్లో ద్వారపాలకులు, గణపతి, సుబ్రహ్మణ్య, నంది, భైరవ, దిక్పాలకులు, గణమూర్తులు, శివలీలలు, నాట్యశివ, అర్ధనారీశ్వర, దక్షిణామూర్తి, లింగోద్భవ, త్రిపురాంతక, కాలాంతక, గజసంహార వంటి శిల్పాలు కనిపిస్తాయి. వీటిలో శివుని అనుగ్రహం, ఉగ్రం, జ్ఞానం, లయం, కరుణ, తపస్సు, నాట్యం, సమత్వం అన్నీ ప్రతిఫలిస్తాయి.

పంచతల గోపురం శైవంలో పంచబ్రహ్మ తత్వానికి అనుకూలంగా భావించవచ్చు – సద్యోజాత సృష్టి, వామదేవ స్థితి, అఘోర సంహార, తత్పురుష తిరోభావ, ఈశాన అనుగ్రహం. ఈ అయిదు తత్వాలు శివుని పంచకృత్యాలను సూచిస్తాయి. గోపురం మీద ఐదు కలశాలు ఉంటే అది శివుని పంచబ్రహ్మ స్వరూపాన్ని మరింత స్పష్టంగా సూచిస్తుంది. శైవ ఆలయ గోపురం భక్తునికి "శరీరం నశ్వరము; అహంకారం తాత్కాలికము; కాలం శివాధీనము; శరణాగతి మాత్రమే శాంతిమార్గము" అని ఉపదేశిస్తుంది. అందుకే శివాలయ గోపురం దర్శనం భక్తునిలో భయం తొలగించి, వైరాగ్యం, శాంతి, జ్ఞానాభిలాషలను పెంపొందిస్తుంది.

వైష్ణవ ఆగమ దృష్టిలో..

వైష్ణవ ఆలయాల్లో గోపురం భగవద్భక్తి వైభవానికి మహాద్వారం. వైష్ణవ సంప్రదాయంలో ఆలయం భగవంతుని దివ్యనిలయం, భక్తుల శరణాగతి కేంద్రం. గోపురం దాటడం అంటే భక్తుడు సంసారక్షోభ నుంచి శ్రీమన్నారాయణుని శరణాగతి లోకి ప్రవేశించడం. పాంచరాత్ర, వైఖానస సంప్రదాయాల్లో దేవాలయ ఆరాధన అత్యంత నియమబద్ధంగా, మంత్రబద్ధంగా, ఆగమబద్ధంగా జరుగుతుంది. ఆ దివ్య నియమలోకానికి గోపురం ముఖద్వారం.

వైష్ణవ గోపురాల్లో దశావతారాలు, గరుడ, విష్వక్సేన, ఆళ్వారులు, ఆచార్యులు, శంఖ-చక్ర చిహ్నాలు, శ్రీదేవి-భూదేవి సమేత నారాయణ రూపాలు, రామాయణ-మహాభారత-భాగవత కథాంశాలు శిల్పరూపంలో దర్శనమిస్తాయి. ఇవి భక్తునికి ధర్మరక్షణ, శరణాగతి, దయ, స్థితి, పరిపాలన, అవతార తత్వాలను తెలియజేస్తాయి.

త్రితల గోపురం వైష్ణవ భావంలో త్రివిక్రముని మూడు అడుగులను జ్ఞాపకం చేస్తుంది. పంచతల గోపురం పంచరూప భగవత్సాన్నిధ్యాన్ని – పర, వ్యూహ, విభవ, అంతర్యామి, అర్చా – అనే భావాలతో అనుసంధానించవచ్చు. నవతల గోపురం శ్రవణం, కీర్తనం, స్మరణం, పాదసేవనం, అర్చనం, వందనం, దాస్యం, సఖ్యం, ఆత్మనివేదనం అనే నవవిధ భక్తిని సూచించగలదు. వైష్ణవ గోపురం భక్తునికి "భగవంతుని శరణే రక్షణ. ధర్మం పరిరక్షణకు నోచుకుంటుంది.భక్తి జీవితం పవిత్రమవుతుంది. శ్రీమన్నారాయణుని స్మరణే సంసారసాగరానికి నావ" అని చెబుతుంది. ఈ భావంతో గోపురం ఒక మహా శరణాగతి ద్వారంగా నిలుస్తుంది.

శాక్తేయ ఆగమ దృష్టిలో..

శాక్తేయ ఆలయాల్లో గోపురం ఆదిపరాశక్తి

వైభవానికి మహాశక్తి ద్వారం. శక్తి సంప్రదాయంలో జగత్తంతా దేవీమయం. సృష్టి, స్థితి, లయ మాత్రమే కాదు; జ్ఞానం, కరుణ, ఉగ్రం, రక్షణ, ఐశ్వర్యం, విద్య, మోక్షం అన్నీ దేవీ స్వరూపాలే. కాబట్టి శాక్తేయ ఆలయ గోపురం భక్తుని శక్తిచైతన్యంలోకి ప్రవేశింపజేసే దివ్య ద్వారం.

శాక్తేయ గోపురాల్లో దుర్గ, లక్ష్మి, సరస్వతి, లలితా త్రిపురసుందరి, రాజరాజేశ్వరి, కాళి, చాముండి, భద్రకాళి, మహిషాసురమర్దిని, సప్తమాతృకలు, యోగినీలు, భైరవి రూపాలు, శ్రీవిద్య సంకేతాలు, సింహవాహన రూపాలు కనిపిస్తాయి. వీటిలో శక్తి సౌమ్య, ఉగ్ర, విద్యామయ, ఐశ్వర్యమయ, రక్షణాత్మక రూపాలు ప్రతిఫలిస్తాయి. శాక్తేయ దృష్టిలో త్రితల గోపురం ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తులను సూచించవచ్చు. పంచతల గోపురం పంచప్రాణాలు, పంచభూతాలు, పంచకోశాలు, పంచతంత్ర శక్తులను సూచించగలదు. సప్తతల గోపురం సప్తమాతృకలను, సప్తచక్రాలను, సప్తశక్తి ప్రవాహాలను సూచించగలదు. నవతల గోపురం నవదుర్గలు, నవావరణాలు, నవశక్తి భావనలతో అనుసంధానమవుతుంది. షోడశతల గోపురం లలితా త్రిపురసుందరి సంబంధమైన షోడశ కళలు, షోడశ నిత్యాదేవతలు, పూర్ణశ్రీ తత్వాన్ని సూచించగలదు. శాక్తేయ గోపురం భక్తునికి "జగత్తు దేవీమయం; భయం శక్తిలో లయమవుతుంది; అజ్ఞానం విద్యగా మారుతుంది; దౌర్బల్యం ధైర్యంగా మారుతుంది; భక్తి పరాశక్తి కృపతో పరిపూర్ణమవుతుంది" అని ఉపదేశిస్తుంది.

సంస్కృతికేంద్రం, విద్యామార్గం, సమైక్యతా చిహ్నం

గోపురం శిల్పం మాత్రమే కాదు; అది సమాజాన్ని సంస్కరించే సాధనం. ఒక గ్రామంలో గోపురం ఉంటే ఆ గ్రామ ప్రజలకు అది ప్రతిరోజూ ధర్మస్మరణ చేస్తుంది. పిల్లలు దాని నీడలో పెరుగుతారు. వృద్ధులు దానిని చూసి తమ పూర్వికులను స్మరించుకుంటారు. యాత్రికులు దానిని చూసి ఆ గ్రామాన్ని పవిత్రక్షేత్రంగా భావిస్తారు. కళాకారులకు అది శిల్ప ప్రేరణ. కవులకు అది కవితా ప్రేరణ. భక్తులకు అది కన్నీటి ప్రార్థన. సమాజానికి అది ఐక్యతా కేంద్రము.

గోపురాలపై ఉండే పురాణ శిల్పాలు ప్రజలకు దృశ్యవిద్యను అందిస్తాయి. రామాయణం, మహాభారతం, భాగవతం, శివపురాణం, దేవీభాగవతం, స్కందపురాణం వంటి ఇతిహాస-పురాణ తత్వాలు శిల్పరూపంలో నిలుస్తాయి. ఒక గోపురం ముందర నిల్చున్న భక్తుడు కేవలం కళను చూడడు; అతడు తన సాంస్కృతిక వంశపారంపర్యాన్ని దర్శిస్తాడు.

అలాగే గోపురం సమాజ సమైక్యతకు చిహ్నం. ఆలయ నిర్మాణంలో శిల్పి, స్థపతి, వేదపండితుడు, ఆగమపండితుడు, అర్చకుడు, దాత, కూలీ, సంగీతకారుడు, చిత్రకారుడు, గ్రామస్థుడు - అందరూ భాగస్వాములు. గోపురం అందరి కృషికి శాశ్వత సాక్ష్యం. అందుకే అది ఒక సమాజ పుణ్యసంకల్పానికి రాతి రూపం.

పునరుద్ధరణ అవసరం

భారతీయ ఆలయ సంస్కృతి పునరుద్ధరణ జరగాలంటే ఆలయాలను కేవలం పూజాస్థలాలుగా మాత్రమే చూడకూడదు. అవి విద్యాకేంద్రాలు, అన్నదాన కేంద్రాలు, కళాకేంద్రాలు, వేద-ఆగమ అధ్యయన కేంద్రాలు, సమాజసేవా కేంద్రాలు, ఉత్సవసంస్కృతి కేంద్రాలుగా మళ్లీ జీవించాలి. ఈ పునరుద్ధరణలో గోపురాలకు విశేష పాత్ర ఉంది.

ప్రతి గ్రామంలో గోపురం ఉంటే ఆ గ్రామానికి ఆధ్యాత్మిక గుర్తింపు ఉంటుంది. ప్రతి జనపదంలో గోపురం ఉంటే ప్రజలకు సంస్కృతి పట్ల గర్వం కలుగుతుంది. ప్రతి పురంలో గోపురం ఉంటే అది ధర్మపురంగా మారుతుంది. గోపురం ఎత్తు భౌతికంగా ఎంత ఉన్నా, దాని భావం ప్రజల మనస్సులను పైకి లేపడమే. అందువల్ల గోపురనిర్మాణం, గోపుర పునరుద్ధరణ, గోపురసంరక్షణ అనేవి ధర్మసేవలో భాగాలుగా పరిగణించాలి.

పాత గోపురాలను పునరుద్ధరించేటప్పుడు శాస్త్రబద్ధత అవసరం. శైవ ఆలయమైతే శైవాగమం, వైష్ణవ ఆలయమైతే పాంచరాత్ర లేదా వైఖానస సంప్రదాయం, శాక్తేయ ఆలయమైతే తంత్ర-ఆగమ వద్ధతులు, స్థానిక దేవతా సంప్రదాయం,

స్థలపురాణం, పూర్వ నిర్మాణశైలిని గౌరవించాలి. స్థపతి శిల్పప్రమాణం, అర్చక ఆచారవద్ధతి, ఆగమపండితుల మార్గదర్శకత్వం, గ్రామభక్తుల సహకారం అన్నీ కలిసినప్పుడే గోపుర పునరుద్ధరణ సంపూర్ణమవుతుంది.

కొత్తగా నిర్మించే ఆలయాల్లో కూడా గోపురం కేవలం సిమెంట్ నిర్మాణంగా కాక, తత్వబోధకమైన, శిల్పప్రామాణికమైన, ఆగమానుగుణమైన, భక్తిజనహృదయాలను ఆకర్షించే రూపంగా ఉండాలి. గోపురంపై దేవతామూర్తులు యాదృచ్ఛికంగా కాక, ఆ ఆలయ దేవతా తత్వానికి అనుగుణంగా ఉండాలి. కలశాల సంఖ్య, శిఖర రూపం, ద్వారపాలకుల స్థానం, దేవకోష్ఠాలు, రంగులు, ప్రతీకలు అన్నీ ధార్మిక పరిమళాన్ని కలిగించాలి.

పురాల సంస్కార యశఃపతాకం

"గోపురాలు పురాల సంస్కార యశఃపతాకలు కావాలి" అనే భావం ఎంతో గంభీరమైనది. ఒక పురానికి ఎత్తైన భవనాలు ఉండవచ్చు; కానీ గోపురం లేకపోతే ఆ పురానికి ఆధ్యాత్మిక ముఖచిత్రం ఉండదు. ఒక పట్టణానికి రహదారులు, మార్కెట్లు, కార్యాలయాలు ఉండవచ్చు; కానీ దేవాలయ గోపురం దాని జీవనానికి ధర్మదిశ చూపుతుంది. గోపురం మనిషికి "నీ జీవితం కేవలం భోగం కోసం కాదు; అది భక్తి, ధర్మం, జ్ఞానం, సేవ కోసం" అని గుర్తు చేస్తుంది.

గోపురం ఒక పతాకం లాంటిది. యుద్ధరంగంలో పతాకం సైన్యానికి ధైర్యం ఇచ్చినట్లే, సంస్కృతి రంగంలో గోపురం సమాజానికి ఆత్మగౌరవం ఇస్తుంది. రాజభవనాల కంటే దేవాలయ గోపురాలు ఎక్కువకాలం నిలుస్తాయి. ఎందుకంటే రాజ్యాలు మారినా ధర్మం నిలుస్తుంది. పాలకులు మారినా భక్తి నిలుస్తుంది. కాలం మారినా గోపురం నిలిచి తరతరాలకు "దైవం ఉన్నది; ధర్మం నిలవాలి; సంస్కృతి కొనసాగాలి" అనే సందేశం ఇస్తుంది.

ఆధునిక సమాజానికి సందేశం

ఈ రోజుల్లో మనిషి భౌతికంగా ఎదిగినా, అంతరంగంగా అస్థిరతను అనుభవిస్తున్నాడు. సాంకేతిక విజ్ఞానం పెరిగినా, సంస్కారం తగ్గకూడదు. నగరాలు పెరిగినా, ధర్మచైతన్యం క్షీణించకూడదు. ఈ సందర్భంలో ఆలయాలు, గోపురాలు మళ్లీ సమాజానికి అవసరం. అవి మనిషిని మూలాలతో కలుపుతాయి. పూర్వికుల జ్ఞానాన్ని గుర్తుచేస్తాయి. పిల్లలకు దైవభక్తి, కళాసౌందర్యం, సంస్కృతి గౌరవం నేర్పుతాయి. యువతకు సేవాస్ఫూర్తి, సామూహిక బాధ్యత, ఆధ్యాత్మిక దిశ ఇస్తాయి. గోపురం ఎదుట నిల్చున్నప్పుడు మనిషి తన చిన్నదనాన్ని గ్రహిస్తాడు; అదే సమయంలో తనలోని దైవసంభావనను గుర్తిస్తాడు. గోపురం పైకి ఎదిగినట్లు మన ఆలోచనలూ పైకి ఎదగాలి. గోపురం స్థిరంగా నిలిచినట్లు మన విలువలూ స్థిరంగా ఉండాలి. గోపురం అందరినీ లోపలికి ఆహ్వానించినట్లు మన సమాజం కూడా ధర్మమార్గంలో సమైక్యంగా నడవాలి.

ముక్తాయింపు

భారతీయ ఆలయ సంస్కృతి పునరుద్ధరణ అంటే కేవలం పాత దేవాలయాల మరమ్మతు కాదు; అది భారతీయ జీవనవిలువల పునరుద్ధరణ. ప్రతి గ్రామం దేవగ్రామం కావాలి. ప్రతి జనపదం ధర్మజనపదం కావాలి. ప్రతి పురం పుణ్యపురం కావాలి. ఆ దిశగా ఆలయాలు జీవించాలి; ఆ ఆలయాలకు గోపురాలు శోభించాలి; ఆ గోపురాలు పురాల సంస్కార యశఃపతాకలుగా నిలవాలి.

శైవ గోపురం శివజ్ఞానాన్ని ప్రకటించాలి. వైష్ణవ గోపురం శరణాగతి, కరుణ, ధర్మరక్షణను ప్రకటించాలి. శాక్తేయ గోపురం పరాశక్తి, ధైర్యం, విద్య, రక్షణను ప్రకటించాలి. ఈ మూడు సంప్రదాయాలూ చివరికి ఒకే సత్యాన్ని బోధిస్తాయి – దైవం సమాజాన్ని సంస్కరిస్తుంది; సంస్కారం మనిషిని ఉన్నతుడిని చేస్తుంది; ఆలయం ఆ ఉన్నతికి మార్గం;

గోపురం ఆ మార్గానికి మహాద్వారం అందుకే మన సంకల్పం ఇలా ఉండాలి: ప్రతి ఊరిలో ఆలయం వెలగాలి. ప్రతి ఆలయానికి గోపురం నిలవాలి. ప్రతి గోపురం ధర్మపతాకంలా ఎగసి నిలవాలి. ప్రతి మనసులో భక్తి, ప్రతి కుటుంబంలో సంస్కారం, ప్రతి సమాజంలో సమైక్యత, ప్రతి దేశభక్తునిలో భారతీయ ఆధ్యాత్మిక గౌరవం వికసించాలి.

గోపురం పైకెదిగినంతగా మన సంస్కృతి ఎదగాలి. గోపుర కలశం ఆకాశాన్ని తాకినంతగా మన ఆత్మ దైవాన్ని తాకాలి. అదే భారతీయ ఆలయ సంస్కృతి పునరుద్ధరణకు నిజమైన మార్గం.

ఓం శాంతిః శాంతిః శాంతిః।

మనసే రణరంగం.. అక్కడి నుంచే యుద్ధాలు మొదలు

రాష్ట్రీయం స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్)సర్‌కార్యవాహ దత్తాత్రేయ హోసబల మే 12న ఢిల్లీలోని సంస్థ కార్యాలయంలో పీటీఐతో జరిపిన సుదీర్ఘ ముఖాముఖిలో హిందుత్వం,సనాతన ధర్మం, అంతర్జాతీయ వేదికపై భారత్ పాత్ర, పాశ్చాత్య దేశాలలో సంస్థ విస్తరణ, పాకిస్థాన్‌తో సంబంధాలు, ప్రవాస భారతీయులు, విజ్ఞానం, ఆధ్యాత్మికత, ఆధునిక ప్రపంచం ఎదుర్కొంటున్న నాగరిక సవాళ్లపై మాట్లాడారు. ముఖాముఖిలోని ముఖ్యాంశాలు ఆర్ఎస్ఎస్ ప్రపంచ దృక్పథాన్ని విశదీకరిస్తున్నాయి.

పాశ్చాత్య ప్రపంచంలో ఆర్ఎస్ఎస్ గురించి ఉన్న అపోహలను తొలగించడం మీ పర్యటన ఉద్దేశ్యాలలో ఒకటి. దాని ఫలితంతో మీరు సంతృప్తిగా ఉన్నారా?

నేను గతంలో కూడా పాశ్చాత్య దేశాలను సందర్శించాను. ప్రధానంగా హిందూ సమాజాన్ని కలవడానికి, హిందూ స్వయంసేవక్ సంఘ్ సమావేశాలలో ప్రసంగించడానికి పర్యటించాను. ఒకటి రెండు సందర్భాలు మినహా, ఆ సంభాషణలలో చాలా వరకు భారతీయ మూలాలున్న ప్రజలు, హిందూ సమాజ సభ్యులతోనే జరిగాయి. ఈసారి ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల నేపథ్యంలో మా ప్రపంచవ్యాప్త ప్రచార ప్రయత్నాలలో భాగంగా, విద్యావేత్తలు, విధాన రూపకర్తలు, మేధావులు సహా సమాజంలోని వివిధ రంగాలకు చెందిన స్థానిక, ప్రభావ వంతమైన వ్యక్తులతో మరింతగా మమేకమవ్వాలని నిర్ణయించుకున్నాము. నాకు స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయంలోని గ్లోబల్ సైంటిఫిక్ ఇన్వేషన్ ఫోరమ్, వాషింగ్టన్‌లోని హడ్సన్ ఇన్‌స్టిట్యూట్‌ల నుంచి ఆహ్వానాలు అందాయి.ఈ కార్యక్రమాలు నాకు ఇతర ప్రదేశాలను సందర్శించడానికి, విద్యావేత్తలు, మేధోమథన బృంద సభ్యులు, నోబెల్ బహుమతి గ్రహీతలు, యూఎస్ కాంగ్రెస్‌కు సంబంధించిన కొందరు సభ్యులతో కూడా సంభాషించడానికి అవకాశాలు కల్పించాయి. ఆర్ఎస్ఎస్ అంటే ఏమిటి? దాని తాత్వికత, భారతదేశపు ప్రాచీన నాగరిక సంస్కృతి,ఆధ్యాత్మిక సందేశం నుంచి అది ఎలా ప్రేరణ పొందింది? అనే ప్రశ్నలకు సమాధానాలను ప్రపంచానికి వివరించడానికి ఈ పర్యటన నాకు అవకాశం కల్పించింది.

మీరు చాలా మంది భారతీయులు కానివారితో సంభాషించారు కాబట్టి, మీ చర్చల సమయంలో పాశ్చాత్య ప్రపంచం నుంచి ఏ ఆందోళనలు ప్రముఖంగా కనిపించాయి?

నేను గమనించిన ఒక ప్రధాన ఆందోళన... వేగవంతమైన సాంకేతికత, వేగవంతమైన వృద్ధి గురించి. కృత్రిమమేధ వంటి ఆవిష్కరణల పట్ల ఉత్సాహం ఉన్నప్పటికీ, సమాజాలు సాంస్కృతిక సవాళ్లను ఎలా ఎదుర్కొంటాయి? మానవ సంబంధాలకు ఏమవుతుంది? మానవ సమాజం ఎలా పరిణామం చెందుతుంది? అనే విషయాలపై కూడా ఆందోళన ఉంది. పర్యావరణం మరో ముఖ్యమైన ఆందోళన. తన సుదీర్ఘ నాగరికతా అనుభవం, ప్రపంచ దృక్పథం కారణంగా, ఈ సమస్యలను పరిష్కరించడానికి భారతదేశానికి ప్రత్యేక సామర్థ్యం ఉందని నేను భావిస్తున్నాను.

ఆర్ఎస్ఎస్ గురించి, దాని చుట్టూ అల్లుకున్న అపోహల గురించి ప్రజలు మిమ్మల్ని ఎలాంటి ప్రశ్నలు అడిగారు?

చాలా సందర్భాల్లో అది కేవలం అపోహ మాత్రమే కాదు, అజ్ఞానం కూడా. ఆర్ఎస్ఎస్ ఏం చేస్తున్నది చాలా మందికి నిజంగా తెలియదు. వారికి తెలిసిన దంతా ఎక్కువగా మీడియా నివేదికలు లేదా ఇతరుల ద్వారా విన్నదే. కొంతమంది ఆర్ఎస్ఎస్‌ను ముస్లిం వ్యతిరేక, మైనారిటీ వ్యతిరేక లేదా జాత్యహంకార సంస్థగా కూడా చూస్తున్నారు. ఆర్ఎస్ఎస్ అనేది సమాజసేవ, జాతీయసేవ ద్వారా మానవ, సామాజిక మూలధనాన్ని నిర్మించడానికి పనిచేసే ఒక స్వచ్ఛంద సంస్థ అని నేను వివరించాను. మా వందేళ్ల ప్రయాణంలో చేసిన మంచి పనుల గురించి, స్వయంసేవకులు ప్రజాజీవితానికి ఎలా దోహదపడుతున్నది, వారు దేశ నిర్మాణ కార్యకలాపాలకు అంకితమైన అనేక పౌర సంస్థలను స్థాపించి, వాటిని నిర్వహిస్తున్న వైనం గురించి కూడా మాట్లాడాను. ప్రజలు ఆసక్తిగా విన్నారు. ప్రశ్నలు

అడిగారు. సమాధానాలను శ్రద్ధగా ఆలకించారు.

అమెరికాలోని ప్రవాస భారతీయులు సంపదలోనూ, పలుకుబడిలోనూ గణనీయంగా వృద్ధి చెందారు. కానీ ఆ ప్రవాస భారతీయులు ఇప్పటికీ ప్రాంతీయ, భాషా, కుల ప్రాతిపదికన వేరుపడి ఉన్నారని కూడా మీరు భావిస్తున్నారా?

మీరు చెప్పిన రెండు విషయాలు నిజమే. ప్రవాస భారతీయులు అమెరికాలో తమదైన ముద్ర వేశారు. భారతీయ లేదా హిందూ సమాజం గురించి ఒక ముఖ్యమైన విషయం ఏమిటంటే...వారు నివసించే ఏ దేశానికీ సమస్యగా మారలేదు. ఒక సమాజంగా వారి ప్రవర్తన సాధారణంగా సానుకూలంగా ఉంది. ఇది వారి సాంస్కృతిక, నాగరిక నేపథ్యం నుంచి వచ్చిందని విశ్వసిస్తున్నాను.

అయితే, ఒకే పెద్ద సమాజంగా ఎదగడానికి బదులుగా, విదేశాల్లోని భారతీయులు కొన్నిసార్లు తెలంగాణ, తమిళనాడు లేదా ఆంధ్రప్రదేశ్‌ల చిన్న ప్రతిరూపాలను సృష్టిస్తున్నందుకు మీరు నిరాశ చెందారా?

ఆర్ఎస్ఎస్ సమాజం పట్ల అసంతృప్తిగా ఉన్నట్లయితే వంద సంవత్సరాలు పూర్తి చేసుకొనేది కాదు.ప్రజల పట్ల మాకు ఎనలేని విశ్వాసం ఉంది. మనమం దరం ఒకే సంస్కృతికి, ఒకే నాగరిక నేపథ్యానికి చెందిన వారమనేది ప్రధాన భావన. నేను ప్రతిచోటా నొక్కి చెప్పిన మరో విషయం ఏమిటంటే.. ప్రజలు "విడివిడిగా కలిసి పనిచేయడం" అనే కళను నేర్చుకోవాలి.వివిధ సంస్థలు తాము ఎంచుకున్న ఆశయాల కోసం స్వయంప్రతిపత్తితో పనిచేయడం కొనసాగించవచ్చు. కానీ అదే సమయంలో, వారు అప్పుడప్పుడు కలిసి రావడానికి, ఉమ్మడి కార్య క్రమాలను నిర్వహించడానికి, పరస్పర మద్దతు అందించడానికి మార్గాలను కూడా కనుగొనాలి. ప్రతి ఒక్కరూ హిందూ స్వయంసేవక్ సంఘ్ కిందకు గానీ లేదా ఏదైనా ఒక సంస్థ కిందకు గానీ రాలేరు.అది ఆచరణ సాధ్యం కాదు. ఇక్కడ ముఖ్యమైనది ఉమ్మడి సాంస్కృతిక విలువల ప్రభావం,"విడివిడిగా కలిసి పనిచేయడం" అనే భావన.

అమెరికా లేదా బ్రిటన్‌లో నివసించే భవిష్యత్ తరాలు తమ భారతీయ గుర్తింపును పూర్తిగా కోల్పోతారేమోనని మీరు ఆందోళన చెందుతున్నారా? భారతీయులు తమ సంస్కృతి పట్ల గర్వాన్ని, స్థానిక సమాజాల పట్ల గౌరవాన్ని ఎలా సమతుల్యం చేసుకోవాలి?

మనం కూడా అనేక విధాలుగా మరింత పాశ్చాత్యీకరణ చెందుతున్నాము. అనలు ప్రశ్న...ఎవరైనా అమెరికన్ లేదా బ్రిటిష్ అయ్యారా? అనేది కాదు, వారు ఏ విలువలతో జీవిస్తున్నారు అనేది. అంతిమంగా కుటుంబం, సమాజం, ప్రకృతి పట్ల మానవ ప్రవర్తనే ముఖ్యమైనది. భారతదేశ ప్రపంచ దృష్టికోణం ఎల్లప్పుడూ ఈ శాశ్వతమైన విలువలపైనే దృష్టి సారించింది. దుస్తులు లేదా జీవనశైలి వంటి బాహ్య అంశాలు ఒకరు నివసించే సమాజానికి సమాజంగానే అనుగుణంగా మారతాయి. ఆ కోణంలో 'రోమ్‌లో ఉన్నప్పుడు, రోమన్‌లా ప్రవర్తించు' అనేది ఆమోదయోగ్యమైనదే. కానీ పెద్దల పట్ల గౌరవం, కుటుంబ ఐక్యత, సమాజం పట్ల బాధ్యత, తరువాతి తరాన్ని పోషించడం వంటి విలువలు మానవ జీవితంలో ప్రాథమికమైన, శాశ్వతమైన విలువలుగా మిగిలిపోతాయి.

విదేశాలలో ఉన్న భారతీయులలో అత్యధికులు చట్టాన్ని గౌరవించేవారు. వారు చట్టవిరుద్ధమైన కార్యకలాపాలలో పాల్గొనరు. భారతీయులు కష్టపడి, ప్రతిభతో ఆర్థికంగా విజయం సాధించడం వల్ల కొన్నిసార్లు ఘర్షణలు తలెత్తు తాయి. ఉద్యోగాలు లేదా అవకాశాలు లాగేసుకుంటున్నారనే భయాలు స్థానిక సమాజంలోని కొన్ని వర్గాలలో ఉండవచ్చు. ఇక్కడే నాగరిక విలువలు ముఖ్యమవుతాయి. విదేశాలలో నివసిస్తున్న భారతీయులు తాము నివసిస్తూ, జీవనోపాధి పొందుతున్న సమాజం, దేశం పట్ల తమ బాధ్యతను ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలి. వారి విధేయత ఎన్నడూ ప్రశ్నార్థకం కాకూడదు. వారు భారత దేశంతో సంబంధాన్ని కొనసాగించడం సహజమే, కానీ అదే సమయంలో వారు తమ చుట్టూ ఉన్న స్థానిక సమాజానికి చురుకుగా సేవ చేయాలి. అక్కడి వారితో మమేకం కావాలి.

మాదకద్రవ్యాల దుర్వ్యసనం, విచ్ఛిన్నమైపోతున్న కుటుంబాలు, అతి వ్యక్తివాదం, తదితర సామాజిక సమస్యల పరిష్కారానికి భారత్ చేస్తున్న మార్గదర్శనం గురించి మీకు ఆతిథ్యం ఇచ్చినవారికి మీరేమి చెప్పారు?

నేను భారతీయ తాత్వికతలో పాతుకుపోయిన ప్రపంచ దృష్టికోణం గురించి మాట్లాడాను. స్వామి వివేకానంద ఇలాంటి విషయాల గురించి మాట్లాడి 100 సంవత్సరాలు దాటిపోయింది. మత దురభిమానం పరిష్కారాలను అందించలేదు. భారతీయ ప్రపంచ దృష్టికోణం సజీవ, నిర్జీవ అనే తేడా లేకుండా అన్ని ప్రాణులలో ఒకే దైవత్వాన్ని చూడాలని బోధిస్తుంది. ఈ విలువలను విద్య, కుటుంబ జీవితం, నైతిక శిక్షణ ద్వారా పెంపొందించాలి. మానవ సంబంధాలు, సామాజిక సామ రస్యం, ప్రకృతితో సామరస్యం అన్నీ ముఖ్యమైనవే. మన పండుగలు, సంప్రదా యాలు కేవలం ధార్మికపరమైన ఆచారాలు మాత్రమే కాదు. అవి మానవ బంధాలను, విలువలను బలోపేతం చేయడానికి రూపొందించిన రక్షాబంధన్, గురు వందన వంటి సాంస్కృతిక యంత్రాంగాలు.

ప్రపంచంలో కొనసాగుతున్న సంఘర్షణల గురించి చాలా మంది ప్రస్తుత పరిస్థితిని ఒక నాగరిక సంక్షోభంగా అభివర్ణిస్తున్నారు. మీరు ఈ యుద్ధాలను ఎలా చూస్తారు?

గత 30 సంవత్సరాల ప్రపంచ చరిత్రను మనం పరిశీలిస్తే, యుద్ధం లేదా సంఘర్షణ పూర్తిగా లేని కాలం దాదాపుగా లేదు. ఏ సమయంలోనైనా, ప్రపం చంలోని ఏదో ఒక ప్రాంతం యుద్ధం, ఉద్రిక్తత లేదా ఘర్షణను చవిచూసింది. ప్రచ్ఛన్న యుద్ధం, వియత్నాం యుద్ధం, గల్ఫ్ యుద్ధం, ఇరాక్ సంఘర్షణ, పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు ఉన్నాయి. యుద్ధాలు మానవ మనస్సులో మొదలవుతాయి.అవి దురాశ, అహంకారం లేదా తమకు చెందని దానిని స్వాధీనం చేసుకోవాలని లేదా నియంత్రించాలనే కోరిక నుంచి పుడతాయి. ఇది వ్యక్తులు, సమాజాలు లేదా దేశాల స్థాయిలో జరగవచ్చు. అనేక ఆధునిక సంఘర్షణలు వాణిజ్య ప్రయోజనాలు, భౌగోళిక రాజకీయాలతో ప్రభావిత మవుతున్నాయి. దశాబ్దాల క్రితం, కొంతమంది మేధావులు చమురు కోసం యుద్ధాలు వస్తాయని అంచనా వేశారు, ఇప్పుడు నీటి కోసం భవిష్యత్ యుద్ధాల గురించి అంచనాలు ఉన్నాయి. దీని అర్థం మానవాళి సంఘర్షణల నుంచి పూర్తిగా విముక్తి పొందడం అసంభవం. ప్రస్తుత సంఘర్షణలు మానవ జీవితాన్ని ప్రభావితం చేస్తాయి. ప్రపంచాన్ని

గణనీయమైన రీతిలో మారుస్తాయి. అయితే, ఈ యుద్ధాల కారణంగా భారత్ వంటి దేశాలు కూడా బాధపడుతున్నాయి. ప్రధానమంత్రి ఇటీవల పొదుపు చర్యలకు పిలుపునిచ్చారు. చాలా మంది పౌరులు దానిని మనఃస్ఫూర్తిగా పాటించారు. లాల్‌బహదూర్ శాస్త్రి, ఇందిరాగాంధీ కూడా కష్ట సమయాల్లో పొదుపు కోసం విజ్ఞప్తి చేశారు. జాతీయ నాయకులు సంయమనం, నిరాడంబరత కోసం పిలుపునిచ్చినప్పుడు, దానిని దేశ సంక్షేమం దృష్ట్యా చూడాలి. ప్రస్తుత ప్రధానమంత్రి విజ్ఞప్తిని కూడా అదే స్ఫూర్తితో అర్థం చేసుకోవాలి. నిజానికి యుద్ధ సమయాలకు అతీతంగా కూడా నిరాడంబరత, పొదుపు అనేవి భారతదేశ సాంప్రదాయ జీవన విధానంతో గాఢంగా ముడిపడి ఉన్న విలువలు. సంక్షోభ సమయాల్లో ఈ విలువలు మరింత అవసరం అవుతాయి.

ఇలాంటి సంక్షోభ సమయాల్లో భారతదేశం అంతర్జాతీయంగా పెద్ద పాత్ర పోషించగలదని మీరు భావిస్తున్నారా?

గత దశాబ్దం లేదా అంతకంటే ఎక్కువ కాలంలో ప్రపంచంలో భారత్ స్థానం గణనీయంగా మారింది. నేడు, అంతర్జాతీయంగా భారత్ మాట వినబడుతోంది. గుర్తింపును, గౌరవాన్ని పొందుతున్నది. ఈ పరిస్థితి కారణంగా, దేశాలు, ప్రపంచ నాయకుల వివేకానికి, సదవగాహనకు విజ్ఞప్తి చేయడం ద్వారా భారత్ ఒక నిర్మాణాత్మక పాత్ర పోషించగలదు.

గత సంవత్సర కాలంలో, భారతదేశం అనేక విదేశాంగ విధాన సవాళ్లను ఎదుర్కొంది. ఈ సమస్యలను ఎలా పరిష్కరించాలనే దానిపై ఆర్ఎస్ఎస్ ప్రభుత్వానికి ఏమైనా సూచనలు ఇచ్చిందా?

మేము అనధికారికంగా చర్చలు జరుపుతాము. కానీ ఆర్ఎస్ఎస్‌కు అధికారిక విదేశాంగ విధాన మేధోమథన బృందం లేదు. అయితే, ప్రధానమంత్రి విదేశాంగ విధాన వైఖరిలో కనిపించే అనేక సూత్రాలు, ఆర్ఎస్ఎస్ ఎప్పటి నుంచో నొక్కి చెబుతున్న వాటిని, ఈ దేశ సంప్రదాయాలలో పాతుకుపోయిన విస్తృత నాగరికతా భావనలను, ప్రపంచ దృక్పథాలను ప్రతిబింబిస్తాయి.

పాకిస్తాన్‌తో భారతదేశం ఎలా వ్యవహరించాలని మీరు భావిస్తున్నారు? సంబంధాలు కొనసాగించాలా?

గత కొన్నేళ్లుగా పాకిస్తాన్‌తో సంబంధాల కోసం భారతదేశం సాధ్యమైన ప్రతి పద్ధతిని ప్రయత్నించింది. సంబంధాలను మెరుగుపరిచే ప్రయత్నంలో భాగంగా అటల్‌బిహారీ వాజ్‌పేయి బస్సులో లాహోర్ ప్రయాణించారు. ప్రస్తుత ప్రధానమంత్రి తన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాకిస్తాన్ నాయకత్వాన్ని ఆహ్వానించారు. కొన్ని సందర్భాల్లో వ్యక్తిగతంగా సంప్రదింపుల ప్రయత్నాలు కూడా చేశారు. అదే సమయంలో, పాకిస్తాన్ ఉగ్రవాదదాడులు లేదా



పుల్వామా వంటి రెచ్చగొట్టే చర్యలకు పాల్పడినప్పుడల్లా, భారతదేశం తగిన విధంగా, దృఢంగా స్పందించింది. దేశ భద్రతను, ఆత్మగౌరవాన్ని ఎల్లప్పుడూ కాపాడాలి. దానిని నిర్ధారించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉంది. అయితే, దృఢంగా ప్రతిస్పందిస్తున్నప్పటికీ చర్చల ద్వారాలను పూర్తిగా మూసివేయకూడదు. దౌత్య సంబంధాలు కొనసాగుతున్నాయి. వాణిజ్యం కొంత మేరకు కొనసాగుతున్నది. వీసాలు ఇప్పటికీ జారీ అవుతున్నాయి. ప్రస్తుతం, పాకిస్తాన్ కఠిన వైఖరి, పదేపదే జరుగుతున్న సంఘటనల వల్ల ఏర్పడిన ఉద్రిక్తతల కారణంగా ఇరుదేశాల మధ్య అనేక మార్పిడులు నిలిచిపోయాయి. 26/11 ముంబై దాడుల తర్వాత పరస్పర విశ్వాసం గణనీయంగా బలహీనపడింది. శాంతి ప్రయత్నాలు పదేపదే ఎదురుదెబ్బలు తిన్నాయి. అయినప్పటికీ, ఇతర రకాల సంప్రదింపులు పరిమిత మార్గాల్లో కొనసాగుతున్నాయి. పాకిస్తాన్ పౌరసమాజం నుంచి అధిక భాగస్వామ్యం సంబంధాలను మెరుగు పరచడంలో సహాయపడుతుందని నమ్ముతున్నాను. రాజకీయ, సైనిక నాయకత్వాల మధ్య తీవ్ర విభేదాలు లేదా అపనమ్మకం ఏర్పడవచ్చు. కానీ సాధ్యమైనంత వరకు పౌర సమాజ సంబంధాలు కొనసాగాలి.

అమెరికా సహా పలు దేశాల్లో హిందుత్వ గురించి, హిందూ దేశం అనే భావన గురించి తరచుగా ఒక ప్రశ్న వినిపిస్తుంటుంది. మీరు వారికి భారత దేశంలో మైనారిటీలు సురక్షితంగా ఉన్నారనే ఒక భరోసాను ఎలా ఇస్తారు?

ఈ ప్రశ్న దశాబ్దాలుగా పదేపదే వినవస్తున్నది. కానీ మనం వాస్తవాలను పరిశీలించాలి. భారత దేశంలో ముస్లిం జనాభా తగ్గిపోయిందా? ముస్లింలు లేదా క్రైస్తవులు భారతదేశం నుంచి పారిపోవలసి వచ్చిందా? బీజేపీ పాలించే రాష్ట్రాల్లో లేదా స్వయం సేవకులు చురుకుగా ఉన్న ప్రదేశాలలో వారిని రెండవ తరగతి పౌరులుగా చూస్తున్నారా? ఇవి నిజాయితీగా పరిశీలించాల్సిన ప్రశ్నలు. మీడియాలోని కొన్ని వర్గాలలో, ప్రజా చర్చలలో ఇటువంటి ఆందోళనలను పదేపదే ప్రచారం చేయడం ద్వారా తరచుగా అనవసరంగా భయాన్ని సృష్టిస్తున్నారు. ఆర్ఎస్ఎస్ క్రైస్తవులు, ముస్లింలు సహా మైనారిటీ వర్గాల నాయకులతో నిరంతర సంభాషణను కొనసాగిస్తుంది. నిజానికి, భారతదేశంలో ''మతపరమైన మైనారిటీలు'' అనే భావన మూలచట్రం పూర్తిగా సరైనది కాదని ఆర్ఎస్ఎస్ విశ్వసిస్తుంది. ప్రాథమికంగా మేము భారతీయులందరినీ ఒకే ప్రజలుగా, ఉమ్మడి పూర్వీకులు, ఉమ్మడి నాగరిక వారసత్వం కలిగిన వారిగా చూస్తాము. ఒకరి ఆరాధనా విధానాన్ని పుణికి పుచ్చుకోవడంల వల్ల అలా చేసిన వారి జాతీయత మారదు. ఆర్ఎస్ఎస్ ఒక హిందూ దేశాన్ని సృష్టించడానికి ప్రయత్నించడం లేదు. ఈ దేశానికి ఇప్పటికే హిందూ నాగరిక స్వభావం ఉంది. దేశం, రాజ్యం అనే భావనల మధ్య తరచుగా గందరగోళం ఉంటుంది. భారతదేశంలో జాతీయతను కేవలం ఒక రాజకీయ ఏర్పాటుగా కాకుండా, విస్తృతమైన నాగరిక, సాంస్కృతిక కోణంలో అర్థం చేసుకుంటారు. ఆర్ఎస్ఎస్‌లోనే ముస్లిం, క్రైస్తవ నేపథ్యాలకు చెందిన వ్యక్తులు ఉన్నారు. వారు సంస్థతో సంబంధం కలిగి ఉన్నారు. వారి సంఖ్య పెద్దగా ఉండకపోవచ్చు, కానీ గాంధీజీ ప్రభావంతో హిందూ-ముస్లిం ఐక్యతను బలంగా ప్రోత్సహించిన సర్వోదయ వంటి సంస్థలలో కూడా ముస్లింల నుండి పెద్ద సంఖ్యలో భాగస్వామ్యం కనిపించలేదు. కేవలం దానిని బట్టి శత్రుత్వం లేదా బహిష్కరణ అని నిర్ధారించలేము. అందువల్ల, ఈ సమస్యల మూలాల్లోకి మరింత లోతుగా చర్చ జరగాలని నేను నమ్ముతున్నాను.

ఈ ప్రశ్న ఆర్ఎస్ఎస్‌ను ఉద్దేశించి అడగకూడదు. దీనిని ముస్లిం నాయకత్వాన్ని అడగాలి.

సనాతన ధర్మాన్ని నిర్మూలించాలని ఉదయనిధి స్టాలిన్ మరోసారి అన్నారు. ఇలాంటి ప్రకటనలకు మీరెలా స్పందిస్తారు?

అది ఆయన అభిప్రాయం. ప్రజలు కూడా ఎన్నికలద్వారా ఇలాంటి అభిప్రాయాలకు ప్రతిస్పందించారు. కానీ ఎవరో చెప్పినంత మాత్రాన సనాతనత్వం అదృశ్యం కాదు. సనాతనత్వం కేవలం ఒక ధార్మికపరమైన ఆచారం కాదు. అది ఈదేశపు స్ఫూర్తి, ఆత్మ. అదొక విలువల వ్యవస్థ, ఒక ప్రపంచ దృక్పథం. సనాతనత్వం అనే పదానికి అసలైన అర్థం శాశ్వతమైనది, నిరంతరం కొనసాగేది. శ్రీ అరబిందో కూడా సనాతనత్వాన్ని ఈ దేశ జాతీయతకు ఆధారం అని వర్ణించారు. ఆ కోణంలో సత్యం వంటి శాశ్వత విలువలు,మనం హిందూ విలువలు, భారత నాగరికతా స్ఫూర్తి అని పిలిచే వాటిద్వారా వ్యక్తమవుతాయి.

అనువాదం: మహేష్ ధూళిపాళ్ళ

'భోజ్‌శాల' తీర్పు- ఏడు

శతాబ్దాలుగా హిందువులకు జరుగుతున్న అన్యాయానికి మధ్యప్రదేశ్ హైకోర్టు తెరదింపుతూ భోజ్‌శాల తీర్పు వెలువరించింది. ధార్ నగరంలోని కమాల్ మౌలా కాంప్లెక్స్ ముమ్మాటికీ వాగ్దేవీ ఆలయమనీ, సంస్కృత విద్యా కేంద్రమని తీర్పులో స్పష్టం చేసింది. పరమార్ రాజవంశీకుడైన భోజరాజుకు చెందినదిగా న్యాయస్థానం తేల్చింది. భారత పురావస్తు శాఖ (ఎఎస్ఐ) సమర్పించిన ఆధారాలను పరిశీలించిన హైకోర్టు భోజ్‌శాలపై తీర్పు ఇచ్చింది. గతంలో హైకోర్టు ఆదేశాలతో పురావస్తు శాఖ భోజ్‌శాల ప్రాంతంలో పరిశోధనలు చేసింది. సరస్వతీదేవి ఆలయాన్ని సాధారణ శకం 1034లో నిర్మించినట్టు ఆధారాలున్నాయని, ముస్లిం దండయాత్రల సమయంలో మసీదుగా మార్చినట్టు న్యాయస్థానం స్పష్టం చేసింది.

తీర్పు సందర్భంగా న్యాయస్థానం కొన్ని కీలక పరిశీలనలు చేసింది. ఆలయ ప్రాంగణాన్ని ఆక్రమించుకున్నా... హిందువులు మొక్కవోని దీక్షతో తమ విశ్వాసాలను కాపాడుకుంటూ దైవారాధన చేశారని కోర్టు పేర్కొంది. భారత పురావస్తు శాఖ ఆధ్వర్యంలో ఉన్నందున, ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా నిబంధనలు ఉంటాయి కాబట్టి, భోజ్‌శాల విషయంలో ప్రార్థనా స్థలాల చట్టం-1991 వర్తించదని తేల్చి చెప్పింది.

భారత రాజ్యాంగంలోని 25,26 అధికరణాల ప్రకారం ప్రభుత్వానికి హిందువుల విశ్వాసాలను, దైవారాధనను కాపాడే బాధ్యత ఉంటుందని తెలిపింది. రామజన్మభూమి విషయంలో సుప్రీం కోర్టు తీర్పు వల్ల భోజ్‌శాల విషయంలో హిందువుల వాదనకు బలం చేకూరింది. 2003 ఏప్రిల్‌లో ముస్లింలకు శుక్రవారం నమాజ్ చేసుకోవచ్చంటూ ఏఎస్ఐ ఇచ్చిన ఉత్తర్వులను సైతం హైకోర్టు తీర్పు సందర్భంగా రద్దు చేసింది.

తాను భోజ్‌శాల-కమాల్ మౌలా మసీదు ప్రాంగణంపై కేవలం యాజమాన్య హక్కుల కోసం కోరడం లేదని, భోజ్‌శాలలో దైవారాధన చేసుకునే హక్కు కేవలం హిందువులకు ఉందని, భోజ్‌శాల ప్రాంగణంలో ముస్లింలు మతపరమైన కార్యక్రమాల కోసం ఉపయోగించుకోవడానికిగాని, ప్రార్థనలు చేసుకోవడానికిగాని హక్కులేదని పిటిషనర్ కోర్టుకు తెలిపారు.

రాజ్యాంగంలోని 25వ అధికరణం ప్రకారం మతపరమైన హక్కును, సాంస్కృతిక వారసత్వ సంపదను కాపాడే 29వ అధికరణాన్ని భోజ్‌శాల విషయంలో అమలు చేయాలని పిటిషనర్ న్యాయ స్థానానికి విన్నవించారు. సాధారణ శకం 1034లో ఆలయాన్ని నిర్మాణ ప్రధాన ఉద్దేశం, సంస్కృత విద్యను, సాహిత్యాన్ని, వ్యాకరణాన్ని నేర్పడం, జ్యోతిశ్శాస్త్రం, ఖగోళం సహా వేద విద్యను ప్రోత్సహించడమే భోజరాజు లక్ష్యమని పిటిషనర్ కోర్టుకు తెలిపారు. సరస్వతీదేవి విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించాలని పిటిషన్‌లో పేర్కొన్నారు.

భోజ్‌శాల ఆలయం, సంస్కృత పాఠశాల పాలన, నిర్వహణ కోసం ప్రభుత్వం ఓ ట్రస్టును ఏర్పాటు చేయాలని, భారత పురావస్తు శాఖ ఆధ్వర్యంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని కూడా పిటిషనర్ హైకోర్టును కోరారు. ప్రాచీన, పురావస్తు సంపద రక్షణ చట్టం-1958 ప్రకారం చర్యలకు ఆదేశించా

శతాబ్దాల నిరీక్షణ

లని పిటిషనర్ హైకోర్టుకు విన్నవించారు.

హిందువుల ప్రధాన అభ్యంతరాలుః

ముస్లిం రాజుల దండయాత్రల కాలంలో వాగ్దేవీ రూపంలో కొలువైన సరస్వతీ అమ్మవారి ఆలయ విధ్వంసం హిందూ భక్తుల మనోభావాలు తీవ్రంగా గాయపరిచింది. రాజ్యాంగంలోని అధికరణం 13(1) ప్రకారం హిందువుల ధార్మిక జీవనాన్ని పరిరక్షించాలి. విగ్రహ ఆరాధనను ద్వేషించే ముస్లిం పాలకుల దండయాత్రలు, దాడుల మూలంగా హిందువులు సుమారు 7 శతాబ్దాలుగా నిత్యం గాయపడుతూనే ఉన్నారు. ఆలయ ప్రాంగణాన్ని అన్యాక్రాంతం చేసుకుని మసీదుగా మార్చుకున్నా, శుక్రవారం ప్రార్థనలకు అనుమతి కోరినా ప్రభుత్వం అంగీకరించడం అన్యాయం.

అధికరణం 51(a) ప్రకారం భారతదేశ ప్రాచీన సాంస్కృతిక సంపద పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి. 25వ అధికరణంతో సంబంధం లేకుండా దీన్ని అనువర్తింపచేయాలి.

భారత ఉప ఖండంపై దాడి చేసిన ముస్లిం దురాక్రమణదారులు భోజ్‌శాలతో పాటు వేలకొద్ది ఆలయ సంపదను ధ్వంసం చేసి హిందువుల ధార్మిక విశ్వాసాలను గాయపరిచారు. అల్లావుద్దీన్ ఖిల్జీ భోజ్‌శాలపై తొలిదాడి చేశారు. సుమారు 12వందల మంది సంస్కృత విద్యార్థులు, ఉపాధ్యాయులు ఖిల్జీ దండయాత్రలో మతమార్పిడిని తిరస్కరించడంతో హత్యకు గురయ్యారు.

హిందూ రాజైన మహల్ దేవ్ ముస్లిం దురాక్రమణదారులతో వీరోచితంగా పోరాడి యుద్ధభూమిలో ప్రాణార్పణ చేశారు. ఈ దాడి తర్వాత భోజ్‌శాల ప్రాంగణంలోని ఓ భాగాన్ని పూర్తిగా స్వాధీనం చేసుకుని, దేవీదేవతల విగ్రహాలను ధ్వంసం చేశారు. 1401లో దిలావర్ ఖాన్ సరస్వతీ మాత ఆలయాన్ని మసీదుగా మార్చే ప్రయత్నం చేసి ఘోరంగా విఫలమయ్యాడు. 1514లో మరోసారి భోజ్‌శాలపై పెద్ద ఎత్తున దాడి జరిగింది. సరిగ్గా ఈ సమయంలోనే వాగ్దేవీ అమ్మవారి ఆలయం స్థానంలో ఓ సమాధి వంటి స్మారకాన్ని నిర్మించారు.

బ్రిటీష్ పాలన ఉచ్ఛదశలో ఉన్న సమయంలో 1875లో మేజర్ జనరల్ విలియం కిన్ కెయిడ్ భోజ్‌శాల ప్రాంగణంలో తవ్వకాలు జరిపించి, ముస్లిం రాజులు భూమట్టం చేసిన వాగ్దేవీ అమ్మవారి విగ్రహాలను వెలికితీశారు. 1903లో లార్డ్ కర్జన్ సరస్వతీ అమ్మవారి విగ్రహాన్ని ఇంగ్లాండ్‌కు బట్వాదా చేశారు. వాగ్దేవీ విగ్రహంతో పాటు సరస్వతీ అమ్మవారి మరో రూపమైన అంబ విగ్రహం కూడా లండన్ మ్యూజియంలో ఉంది.

2024 మార్చిలో మధ్యప్రదేశ్ హైకోర్టు ఆదేశాలతో భోజ్‌శాల ప్రాంగణంలో ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా శాస్త్రీయ పద్ధతిలో పరిశోధనలు, తవ్వకాలు జరిపింది. శాస్త్రీయ, పురావస్తు ఆధారాలను హైకోర్టుకు సమర్పించింది. భోజ్‌శాల ప్రాంగణంలో మూడు తరహాల నిర్మాణ శైలిని ఏఎస్ఐ గమనించింది. ప్రస్తుతం భోజ్‌శాలలో నిర్మాణ శైలి చిట్టచివరదిగా ఏఎస్ఐ పేర్కొంది.

అంతకు ముందున్న నిర్మాణాన్ని ధ్వంసం చేసిన తర్వాత చివరిసారిగా నిర్మించినట్టు ఏఎస్ఐ తేల్చింది. అయితే నిశితంగా పరిశోధన చేస్తే గత నిర్మాణ శైలులు సైతం భోజ్‌శాల ప్రాంతంలో కనిపిస్తాయని ఏఎస్ఐ హైకోర్టుకు సమర్పించిన పరిశోధనా పత్రాల్లో వివరించింది. ఆలయ ఆనవాళ్లు కనపడకుండా పటిష్ఠమైన బేస్‌మెంట్‌లను ఏర్పాటు చేసినట్టు ఏఎస్ఐ తెలిపింది.

పురావస్తు శాఖ తన పరిశోధనల క్రమంలో కనుగొన్న కళాకృతుల ఆధారంగా భోజ్‌శాల నిర్మాణం పరమార రాజవంశీకులు 10–11 శతాబ్దాల్లో నిర్మించినట్టు ఒక అంచనాకు వచ్చింది. స్తంభాల నిర్మాణ శైలిని చూస్తే అత్యంత ప్రాచీనమైనవిగా తేల్చింది. ప్రాచీన స్థపతులు చెక్కిన విగ్రహాలను ధ్వంసం చేసినట్టుగా ఏఎస్ఐ తేల్చింది.

గణపతి, బ్రహ్మ, నరసింహ అవతారం, భైరవుడు వంటి దేవీదేవతల విగ్రహాలు, దేవతల సమక్షంలో ఉండే సింహం, ఏనుగు, అశ్వం, వానరం, హంస, సర్పం వంటి విగ్రహాలను సైతం దురాక్రమణ క్రమంలో ధ్వంసం చేసినట్టు ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా కనుగొంది. భారతీయ ఆలయ నిర్మాణ శైలిలో కనిపించే కీర్తిముఖ ఆకారాలు సైతం భోజ్‌శాల ప్రాంగణంలో కనిపించాయని ఏఎస్ఐ తన పరిశోధనలో తేల్చింది.

భోజ్‌శాల ఆలయ ప్రాంగణంలో తూర్పు, పశ్చిమ ద్వారాలను నిశితంగా పరిశీలిస్తే అవి ధ్వంసమైన తీరు కనిపిస్తుందని కూడా పురావస్తు శాఖ స్పష్టం చేసింది. ఆలయ తూర్పు భాగంలోని స్తంభంపై ప్రాకృత భాషలో రెండు పద్యాలు కనిపిస్తాయి. 109 వాక్యాల ఈ ప్రాకృత పద్యాలు భోజరాజు కాలంలో జరిగిన సంస్కృత బోధనను రూఢీ చేస్తాయి.

పురావస్తు శాఖ పరిశోధనలు నిష్పాక్షికంగా ఉన్నాయని మధ్యప్రదేశ్ హైకోర్టు విశ్వసించింది. వరిశోధనలను వరిగణనలోకి తీనుకున్న న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. 'భోజ్‌శాలను సరస్వతి అమ్మవారి ఆలయంగా అంగీకరించక పోవడం అర్థరహితం' అంటూ తీర్పులో వ్యాఖ్యానించింది. హిందూ ఆగమాల ప్రకారం ఒక్కసారి ప్రాణప్రతిష్ఠ జరిగిన తర్వాత...విగ్రహ విధ్వంసం జరిగినా ఆ స్థలానికి ఉండే ధార్మిక ప్రాధాన్యత పోదనే పిటిషనర్ వాదనతో న్యాయస్థానం ఏకీభవించింది. 'ప్రాణప్రతిష్ఠ" అనేది హిందువుల ఆలయ ఆరంభ ఘట్టాల్లో అత్యంత పవిత్రమైంది.

పురావస్తు శాఖ సమర్పించిన చారిత్రక, ప్రాచీన ఆధారాలను పరిశీలించిన న్యాయస్థానం..అయోధ్య కేసులో సుప్రీం కోర్టు తీర్పును ప్రాతిపదికగా చేసుకుని తీర్పు వెలువరించింది. పురావస్తు పరిశోధన అనేది బహుముఖీనమైన, శాస్త్రీయ పరిశోధన కాబట్టి ఏఎస్ఐ ఆధారాలను పునాదిగా చేసుకుంటున్నట్టు హైకోర్టు తీర్పు సందర్భంగా చెప్పింది. ప్రాథమిక హక్కులకు హామీ పడే రాజ్యాంగంలోని 25,26 అధికరణాలను కూడా పరిగణనలోకి తీసుకుంటున్నట్టు తీర్పులో స్పష్టం చేసింది. చారిత్రక, ప్రాచీన ప్రాధాన్యత గల నిర్మాణాలనే కాదు ఆలయాలను కూడా సంరక్షించడం ప్రభుత్వాల బాధ్యత అని కోర్టు ఈ సందర్భంగా గుర్తు చేసింది. ఆలయాన్ని సందర్శించే భక్తులకు మౌలిక సౌకర్యాలు కల్పించడం, శాంతి భద్రతలను పరిరక్షించడం వంటి పనులు ప్రభుత్వాలు విధిగా చేయాలని సూచించింది. ఏఎస్ఐ సమర్పించిన చారిత్రక, సాహిత్య ఆధారాలను పరిశీలించిన తర్వాత భోజరాజు స్థాపించిన సంస్కృత విద్యాపీఠంగా భావిస్తున్నామని న్యాయస్థానం తేల్చింది. ఇకపై ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఎఎన్ఐ) ఆధ్వర్యంలోనే భోజ్‌శాల నిర్వహణ ఉండాలని న్యాయస్థానం ఆదేశించింది. లండన్ మ్యూజియంలోని సరస్వతి అమ్మవారి విగ్రహాన్ని తిరిగి తెచ్చే బాధ్యతను కేంద్ర ప్రభుత్వం తీసుకోవాలని సూచించింది. వేరే చోట మసీదును నిర్మించుకునేందుకు ముస్లింలకు స్థలం ఇవ్వాలని కూడా న్యాయస్థానం ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని ఆదేశించింది.

ఎ. సూర్యప్రకాశ్
మాజీ చైర్మన్, ప్రసారభారతి

దక్షిణ కోస్తా రైల్వే జోన్ కల సాకా

ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నాన్ని సాకారం చేస్తూ దక్షిణ కోస్తా రైల్వే జోన్ జూన్ 1న కార్యకలాపాలు ప్రారంభించింది. విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, గుంతకల్లు డివిజన్లు ఈ జోన్ పరిధిలో పనిచేయనున్నాయి. పాత వాల్తేరు డివిజన్‌ను విభజించి విశాఖ డివిజన్‌గా మార్చగా, మరో భాగాన్ని రాయగడ డివిజన్‌గా ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలో కొనసాగిస్తున్నారు.

విశాఖపట్నం కేంద్రంగా దేశంలో 18వ రైల్వేజోన్‌గా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రధాన కార్యాలయం నగరంలోని ముడసలోవ ప్రాంతంలో ఏర్పాటవుతోంది 52 ఎకరాల విస్తీర్ణంలో జోన్ హెడ్ క్వార్టర్స్ పనులు కొనసాగుతున్నాయి. ఇందుకూ రూ.183 కోట్ల పైగా ఇప్పటికే రైల్వేశాఖ మంజూరు చేసింది. తక్షణ కార్యకలాపాల కోసం సిరిపురంలోని 'ది డెక్' భవనంలో తాత్కాలిక కార్యాలయాన్ని సిద్ధం చేశారు. మొత్తం జోన్ పరిధిలో 3,532 రూట్ కిలోమీటర్ల మేర రైల్వే నెట్‌వర్క్ ఉండగా, డబుల్, ట్రిపుల్ లైన్లు తదితర ట్రాక్లతో కలిపి మొత్తం ట్రాక్ పొడవు 6,454 కిలోమీటర్లు కలిగి ఉంది. ఈ జోన్ పరిధిలోని గూడ్స్, ప్యాసింజర్ సేవల ద్వారా ఏడాదికి సుమారు 12 వేల కోట్ల రూపాయల నుంచి 15 వేల కోట్ల రూపాయల వరకు ఆదాయం లభిస్తుందని అంచనా. విశాఖ పట్నంలో రైల్వే జోన్ హెడ్‌క్వార్టర్స్ రావడం వల్ల కేవలం రైల్వే రంగానికే పరిమితం కాకుండా, స్థానిక ఆర్థిక వ్యవస్థ ఊహించని రీతిలో పుంజుకోనుంది. ముఖ్యంగా మూడు రంగాలు లాభపడే వీలుంది.

అమలైన కీలక హామీ

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం–2014లో దక్షిణ కోస్తా రైల్వేజోన్ ఏర్పాటుచేస్తామని హామీ కేంద్ర ప్రభుత్వం ఇచ్చింది. 2014 నుంచి 2019 వరకు జోన్ ఏర్పాటుకు కొంత ప్రయత్నం జరిగింది. కానీ 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ దీనిపై పెద్దగా స్పందించలేదు. 2024లో తిరిగి అధికారం లోకి వచ్చిన కూటమి దీనిపై గట్టి ప్రయత్నం చేసింది.

తురగా నాగభూషణం
సీనియర్ జర్నలిస్ట్

మడసర్లోవ ప్రాంతంలో 52 ఎకరాల స్థలాన్ని జోన్ కార్యకలాపాలకు కేటాయించింది. ఈ ప్రాంతంలోని ఆక్రమణలను తొలగించి వాటిని రైల్వేశాఖకు అప్పగించింది. దాంతో రైల్వేజోన్ కార్యాలయం ఏర్పాటుకు సుగమమైంది. రైల్వే చట్టం 1989లోని సెక్షన్ 3, ఉప–సెక్షన్ (4) ప్రకారం కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ (రైల్వే బోర్డు) మే 4, 2026న పూర్తిస్థాయి గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ మేరకు భారతీయ రైల్వే వ్యవస్థలోనే అత్యంత కీలకమైన, వ్యూహాత్మకమైన 18వ అధికారిక జోన్‌గా దక్షిణ కోస్తా రైల్వే జోన్ అవతరించింది.

3,532 కి.మీ.నెట్‌వర్క్

దక్షిణ కోస్తా రైల్వే జోన్ పరిధిలో మొత్తం 3,532 రూట్ కిలోమీటర్ల మేర రైల్వే నెట్‌వర్క్ ఉండగా, డబుల్, ట్రిపుల్ లైన్లు తదితర ట్రాక్లతో కలిపి మొత్తం ట్రాక్ పొడవు 6,454 కిలోమీటర్లకు చేరుకుంటుంది. విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, గుంతకల్ డివిజన్లను కలిపి నాలుగు డివిజన్లు, 385 రైల్వే స్టేషన్లు ఉన్నాయి. నాలుగు డివిజన్లలో సుమారు 62 వేల మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తుండగా, జోన్ ప్రధాన కార్యాలయంలో 128 మంది గెజిటెడ్ అధికారులు, 1,100 మంది నాన్–గెజిటెడ్ సిబ్బంది పనిచేయనున్నారు. ప్రతి ఏడాది సుమారు 100 మిలియన్ టన్నుల సరుకు రవాణా ఈ జోన్ పరిధిలో జరుగుతుంది. సరకులు, ప్రయాణికుల రవాణా ద్వారా ఏటా సుమారు రూ.15,500 కోట్లు ఆదాయం సమకూరుతుంది. విశాఖపట్నం సమీపంలోని వడ్లపూడి రైల్వే వ్యాగన్ డిపోలో రోజుకు సగటున 250 నుండి 300 వ్యాగన్ల నిర్వహణ, తనిఖీ, మరమ్మతు పనులు చేపట్టేసామర్థ్యం కలిగిన సంస్థ సౌత్ కోస్ట్ రైల్వేజోన్లో ఉంది.

నాలుగు జోన్లు.. 385 స్టేషన్లు..

కొత్తగా రూపుదిద్దుకున్న విశాఖ డివిజన్ పరిధి సుమారు 450 కి.మీ. ఇందులో ఇచ్ఛాపురం–పలస, విశాఖపట్నం – దువ్వాడ (270కి.మీ) ప్రధాన సెక్షన్‌గా ఉండనుంది. అలాగే, 102 కి.మీ పొడవైన విజయనగరం –కునేరు సెక్షన్ కూడా ఈ డివిజన్‌లో ముఖ్యమైనది. ఇక విజయవాడ డివిజన్ పరిధి సుమారు 956 కి.మీ. కాగా, గుంటూరు 630 కి.మీ, గుంతకల్లు 1452 కి.మీ పరిధిని కలిగి ఉన్నాయి. ఈ నాలుగు డివిజన్లు కలిసి ఆంధ్రప్రదేశ్‌లో చాలా భాగం రైల్వే నెట్‌వర్క్‌ను కవర్ చేస్తుంది. కొంతభాగం తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లోకి కూడా విస్తరించి ఉంది.

133 ఏళ్ల వాల్తేరు డివిజన్ ప్రస్థానానికి ముగింపు

భారతీయ రైల్వేలో అత్యంత ప్రతిష్టాత్మక డివిజన్లలో ఒకటిగా గుర్తింపు పొందిన వాల్తేరు డివిజన్ ప్రస్థానం ముగిసిపోయింది. జూన్ 1 నుంచి 'వాల్తేరు' అనే పేరు అధికారికంగా రైల్వే మ్యాప్ నుంచి కనుమరుగై, దాని స్థానంలో కొత్తగా విశాఖపట్నం డివిజన్ ఆవిర్భవించింది. దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటులో భాగంగా కేంద్ర ప్రభుత్వం వాల్తేరు డివిజన్‌ను విశాఖపట్నం, రాయ గడ డివిజన్‌లుగా విభజించింది. మే 31 అర్ధరాత్రి నుంచి ఈ మార్పు అమల్లోకి రాగా, ప్రస్తుత వాల్తేరు డీఆర్ఎం లలిత్ బోహ్రా నూతన విశాఖపట్నం

డివిజన్‌గా తొలి డివిజనల్ రైల్వే మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టారు. వాల్తేరు డివిజన్ చరిత్ర మూలాలు 19వ శతాబ్దం చివరలో నిక్షిప్తమై ఉన్నాయి. మద్రాసు–కలకత్తాను కలిపే 'తూర్పు తీర రైల్వే' నిర్మాణంలో భాగంగా 1893లో వాల్తేరుకు తొలిసారిగా రైలు మార్గం ఏర్పడింది. అనంతరం 1896లో బెంగాల్–నాగపూర్ రైల్వే అధీనంలోకి వెళ్లిన ఈ ప్రాంతం..ఆ తర్వాత కాలక్రమేణా వ్యూహాత్మకంగా ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. విశాఖపట్నం పోర్టు వేగంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో సరకు రవాణాకు వాల్తేరు ఒక ప్రధాన కేంద్రంగా రూపాంతరం చెంది దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషించింది. రైల్వే ఆదాయ వనరుల్లో వాల్తేరు డివిజన్ ఒక బంగారు బాతు లాంటిది. తూర్పు కోస్తా రైల్వే జోన్లోనే అత్యధిక ప్యాసింజర్, సరకు రవాణా వ్యాగన్ ట్రాఫిక్ కలిగిన రికార్డు ఈ డివిజన్ సొంతం. ముఖ్యంగా ఇనుప ఖనిజం, బొగ్గు, ఇతర పారిశ్రామిక ఉత్పత్తుల రవాణాలో వాల్తేరు ఎన్నో రికార్డులను సృష్టించింది. ఛత్తీస్‌గడ్‌లోని బైలడిల్లా గనుల నుంచి విశాఖ పోర్టుకు ఇనుప ఖనిజాన్ని చేరవేసే కొత్తవలస–కిరండూల్ (కేకే లైన్) మార్గం ఒక అద్భుతమైన ఇంజనీరింగ్ నైపుణ్యానికి సజీవ సాక్ష్యం. ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన, క్లిష్టమైన మార్గాల్లో ఒకటిగా గుర్తింపు పొందిన ఈ మార్గంలో 56 సొరంగాలు, 87 భారీ వంతెనలు, 1236 చిన్న వంతెనలు ఉన్నాయి. కేవలం సరకు రవాణాకే పరిమితం కాకుండా, పర్యాటక రంగంలోనూ వాల్తేరు తనదైన ముద్ర వేసింది. బొర్రాగుహలు, అరకు లోయ వంటి ప్రకృతి సిద్ధమైన అద్భుత ప్రాంతాల మీదుగా సాగే రైలు ప్రయాణం పర్యాటకులకు మరుపురాని అనుభూతిని కలిగిస్తోంది. విశాలమైన అద్దాల పెట్టెలు కలిగిన 'విస్టాడోమ్' రైలును ప్రవేశపెట్టి పర్యాటకాన్ని ప్రోత్సహించడంలో ఈ డివిజన్ దేశంలోనే ముందు వరుసలో నిలిచింది. పర్యావరణ హితమైన రైల్వే నిర్వహణలో, స్వచ్ఛతలో అనేక జాతీయ పురస్కారాలను సైతం సొంతం చేసుకుంది. అయితే, విభజన కారణంగా ఈ ప్రకృతి రమణీయ మార్గంలో ఎక్కువ భాగం కొత్తగా ఏర్పాటైన రాయగడ డివిజన్‌లోకి వెళ్లిపోతోంది.

నిర్ణయాలు వేగవంతం

దక్షిణకోస్తా రైల్వేజోన్ ఏర్పాటుతో ఆంధ్ర ప్రదేశ్‌లో రైల్వే పరిపాలన, ప్రాజెక్టుల ఆమోదం, నిర్ణయాల ప్రక్రియ అత్యంత వేగవంతం కానున్నాయి. విశాఖపట్నం, గంగవరం, కాకినాడ, కృష్ణపట్నం వంటి ప్రధాన ఓడరేవులను ఈ జోన్ అనుసంధానించడం వల్ల సరకు రవాణా సులువై, పారిశ్రామిక రంగానికి, రైల్వేకు భారీ ఆదాయం సమకూరనుంది. కొత్త రైల్వే లైన్ల విస్తరణతో స్థానిక యువతకు పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. శ్రీ సత్యసాయి జిల్లా మినహా రాష్ట్రం మొత్తం, అలాగే తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు

దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుతో ఆంధ్రప్రదేశ్‌లో రైల్వే పరిపాలన, ప్రాజెక్టుల ఆమోదం, నిర్ణయాల ప్రక్రియ అత్యంత వేగవంతం కానున్నాయి. విశాఖపట్నం, గంగవరం, కాకినాడ, కృష్ణపట్నం వంటి ప్రధాన ఓడరేవులను ఈ జోన్ అనుసంధానించడం వల్ల సరకు రవాణా సులువై, పారిశ్రామిక రంగానికి, రైల్వేకు భారీ ఆదాయం సమకూరనుంది.

సరిహద్దుల్లోని కొన్ని ప్రాంతాలు ఈ జోన్ పరిధిలోకి వస్తాయి. దీని కింద విజయవాడ, గుంటూరు, గుంతకల్లు కొత్తగా ఏర్పాటైన విశాఖపట్నం (పాత వాల్తేరు విభజన ద్వారా ఏర్పడినది) అనే నాలుగు ప్రధాన డివిజన్‌లు పనిచేస్తాయి. కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు రూ.10,134 కోట్ల రైల్వే బడ్జెట్‌ను కేటాయించగా, ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.1,06,000 కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులు శరవేగంగా ప్రగతిలో ఉన్నాయి.'అమృత్ భారత్' పథకం కింద ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా 74 రైల్వే స్టేషన్లను అంతర్జాతీయ ప్రమాణాలతో పునర్నిర్మిస్తున్నారు. ముఖ్యంగా విశాఖపట్నం, తిరుపతి, నెల్లూరు, విజయవాడ స్టేషన్లను కార్పొరేట్ లుక్‌తో, అత్యాధునిక సదుపాయాలతో తీర్చిదిద్దుతున్నారు. జోన్ పరిధిలో 100% విద్యుద్దీకరణ, డబ్లింగ్, ట్రిప్లింగ్ పనులు యుద్ధ ప్రాతిపదికన సాగుతున్నాయి. రైళ్ల వేగాన్ని పెంచడానికి, ప్రమాదాల నివారణకు ఇప్పటికే 832 ఫ్లైఓవర్లు/అండర్‌పాస్‌లు పూర్తి కాగా, ప్రస్తుతం మరో 299 నిర్మాణంలో ఉన్నాయి. ★



మార్క్సిజం-శ్రీరామరాజ్యం

వ్యక్తివాదం-ఉపయోగితావాదం

పారిశ్రామిక విప్లవానికి మూలకారణమైన వ్యక్తివాదంలోని ప్రధాన ఏడు నియమాలనూ శ్రీకరపాత్రీ స్వామి కూలంకషంగా చర్చించారు. ఏడో నియమమైన అంతర్జాతీయ వాణిజ్యాలకు సంబంధించిన చట్టాలపై వ్యక్తివాద ధోరణులు ఏ విధంగా భారతీయ రాజనీతి శాస్త్ర సూత్రాలతో విభేదిస్తున్నాయో వివరిస్తున్నారు. వ్యక్తివాదానికి అనుబంధంగా వచ్చిందే ఉపయోగితావాదం.

నెపోలియన్ చేసిన యుద్ధాల సమయంలో (1802-14) యూరప్ నుంచి వచ్చే ధాన్యంపై బ్రిటిష్ ప్రభుత్వం పన్ను విధించిందని చెబుతారు. దీనివల్ల బ్రిటన్‌లో ధాన్యాల ధరలు పెరిగాయి. ఇది భూస్వాములకు లాభాలు తెచ్చి పెట్టింది. కానీ సామన్య ప్రజలకు, శ్రామికులకు జీవన వ్యయాలు పెరిగాయి. శ్రామికులు వేతన వృద్ధిని కోరుకున్నారు. వేతనాలు పెంచితే ధనికులకు లాభాలు తగ్గుతాయి. ఆ స్థితిలో జనసామాన్యానికి చేయూతను అందించాలనే నెపంతో పెట్టుబడిదారులు 'స్వేచ్ఛా వాణిజ్యం' కావాలని డిమాండ్ చేశారు.

ధాన్యంపై పన్ను రద్దు చేయాలని ఆందోళనలు చెలరేగాయి. సంఘర్షణల తరువాత ధాన్యంపై పన్ను రద్దయింది. శ్రామికుల వేతన పెంపు డిమాండ్ కొంతకాలం వాయిదా పడింది. అప్పటినుంచే స్వేచ్ఛా వాణిజ్య పద్ధతి ప్రారంభమైంది. పెట్టుబడిదారులకు, సామంతులకు లాభం కలిగింది. అంతర్జాతీయ వాణిజ్యంలో కూడా బ్రిటిష్ వ్యాపారులకు లాభమే సమకూరింది. బ్రిటన్‌లోనే మొట్టమొదటిసారిగా పారిశ్రామిక విప్లవం మొదలైంది. దానివల్ల ఇతర దేశాల వస్తువులతో పోల్చి చూసినప్పుడు బ్రిటన్ వస్తువులు మెరుగ్గానూ తక్కువ ధరల్లోనూ లభించాయి. ఒకవేళ ప్రపంచమంతటా స్వేచ్ఛా వాణిజ్యం అమలై ఉంటే, బ్రిటన్ అన్ని మార్కెట్లపైనా పూర్తి అధికారం సాధించి ఉండేది. కానీ బ్రిటిష్ ఆధిపత్యం ఉన్నచోట్ల స్థానిక వ్యాపారాలు క్రమంగా అంతరించి పోయాయి. సామ్రాజ్యవాదం వల్ల వ్యాపారంలో వృద్ధి జరిగి సామ్రాజ్యం విస్తరించింది.

భారతీయుల రాజనీతి దీనికి విరుద్ధంగా ఉంటుంది. కారణం ఏమిటంటే స్వార్థపరులైన వారే లాభం కోసం దేశసంపదను, విదేశాలకు ఎగుమతి చేస్తారు. దేశంలో నిత్యావసరాలకు ధరలు పెరిగేలా చేస్తారు. దీనివల్ల పేదవారి జీవనం సంకటంలో పడిపోతుంది. అందువల్ల దేశంలో నిత్యావసర వస్తువులు తగినంతగా ఉన్నప్పుడు మాత్రమే ఎగుమతులకు అనుమతు లివ్వడం ప్రభుత్వాల కర్తవ్యం. అలా తక్కువ ధరలతోనే దేశ ప్రజల అవసరాలన్నీ తీరేలా చూడాలి. స్థానిక వ్యాపారాలు వృద్ధి చెందేలా చూడాలి. విదేశీ వస్తువులపై పరిమితులు లేదా పన్నులు విధించాలి. కౌటిల్యుడు వంటివారు ఈ విధానాన్ని సమర్థించారు. జర్మనీ వంటి దేశాలు దిగుమతి పన్నులు విధించడం ద్వారా తమ దేశపు వ్యవసాయం, వాణిజ్యాలను బ్రిటన్‌తో పోటీ నుంచి రక్షించుకున్నాయి. బ్రిటన్ కూడా అమెరికా వస్తువుల ఏకస్వామ్యాన్ని అడ్డుకోవడం కోసం 1931లో 'రక్షణా తృక వాణిజ్య పద్ధతి'ని (protectionism) అనుసరించింది. ఈ దృష్టితో చూసినప్పుడు వ్యక్తివాదానికి సంబంధించి పైన చెప్పిన ఏడు నియమాలు కూడా నైసర్గిక నియమాల వలె మార్పు లేకుండా జరుగుతుంటాయనే సిద్ధాంతాన్ని అంగీకరించలేము. పైగా ఈ నియమాలను మన ధర్మశాస్త్ర గ్రంథాలు అంగీకరించవు కూడా.

బెంథమ్ (1748-1832) ఉపయోగితావాదం ద్వారా వ్యక్తివాద సిద్ధాంతాలను సమర్థించాడు. హెన్రీమేన్ అభిప్రాయం ప్రకారం, 'ఆ కాలంలో చట్టపరమైన అన్ని సంస్కరణలపైనా బెంథమ్ ప్రభావం ఉంది.' అతడి తత్త్వసిద్ధాంతాలు 11 ఉద్గ్రంథాల రూపంలో లభిస్తున్నాయి. అతడు ఫ్రాన్స్, అమెరికాలతో పాటు భారతదేశానికి కూడా చట్టాలను రూపొందించాడు. పోటీపద్ధతి ద్వారా ఉద్యోగుల నియామకం, ప్రభుత్వ శాఖలను సంస్థాపన, వలస రాజ్యాలలో ఓటుహక్కు అమలు, కరెన్సీ నోట్ల ముద్రణ వంటి విషయాలపై తన అభిప్రాయాలను వ్యక్తం చేశాడు.

ప్రసిద్ధ ఆంగ్ల తత్త్వవేత్త అయిన జోసెప్ ప్రెస్టీ చెప్పిన, 'అధిక సంఖ్యాకుల ప్రయోజనాలు' అనే సూత్రం బెంథమ్‌ను తీవ్రంగా ప్రభావితం చేసింది అని చెబుతుంటారు. ప్రెస్టీ కంటే ముందుగానే ఫ్రాన్సిన్-హేబిస్ వంటివారు ఈ సూత్రాన్ని అనుకరించడమే ప్రభుత్వాల ప్రథమ లక్ష్యం కావాలని ఉద్ఘోషించారు. గ్రీసుకు చెందిన 'హెడోనిజం' అనే తత్త్వసిద్ధాంతం ప్రకారం మానవులు చేపట్టే కార్యాలన్నీ సుఖదుఃఖాలనే కొలమానాలపై ఆధారపడి కొనసాగుతుంటాయి.

బెంథమ్ ఈ సిద్ధాంతాన్ని పై సూత్రంతో కలగలిపి, తన ప్రసిద్ధ గ్రంథం 'నైతిక-చట్టాల రూపకల్పనా సిద్ధాంతాల పరిచయం'లో (An Introduction to the principles of morals and Legisltaion) ఇలా చెప్పాడు.'ఈ ప్రకృతి మానవుడిని సుఖము-దుఃఖము అనే ఇద్దరు ప్రభువుల అధీనంలో ఉంచింది. అందువల్ల మానవుడు చేపట్టే కార్యాలన్నీ వాటి పట్ల తన ప్రవర్తనలన్నీ సుఖము లేదా దుఃఖాన్ని ఆశ్రయించి ఉంటాయి. జీవితానికి ఏకైక ధ్యేయం సుఖాన్ని పొందడం, దుఃఖాన్ని నివారించుకోవడం. ఇదే జీవిత సారం. ఈ సిద్ధాంతాన్ని అనుసరించని వారిని 'అజ్ఞాని' అని పిలవాల్సి వస్తుంది. సుఖఃదుఃఖాలు కలుగుతున్నాయంటే దాని అర్థం ఉపయోగితా కారణం ఒకటి ఉందని. ఉపయోగకరమైన వస్తువు నుంచి సుఖం లభిస్తుంది. ఆనందము లేదా ఆనందకారణము సుఖమే. క్లేశము లేదా క్లేశ కారణం దుఃఖము.'

హిందీమూలం : కరపాత్రీ స్వామి
అనువక్త : నేతి సూర్యనారాయణశర్మ

Asvins Specialty Hospitals

ASVINS
Specialty Hospitals
Care • Cure • Comfort

6-3-903/A&B, Raj Bhavan Road, Somajiguda, Hyderabad, Telangana 500082.
www.asvinshospitals.com   Ph: +91 94404 45775

40+ YEARS OF ONCOLOGY EXPERTISE | OVER 7,00,000 TREATED | 75,000 SUCCESSFUL SURGERIES

Dr. G. Suryanarayana Raju
M.S. Mch, FRCS, FUICC
Chief of Surgical Oncology
40+ Years of Experience

Dr. D. Raghunadharao
MD, DM, FRCP (London), FACP
Chief of Medical Oncology
40+ Years of Experience

SERVICES

MEDICAL SPECIALTIES:
- Bone Marrow Transplant
- Cardiology
- Chest Medicine
- Endocrinology
- Gastroenterology
- Hematology & Hemato Oncology
- Internal Medicine
- Intensive Care
- Medical Genetics
- Medical Oncology
- Nephrology & Dialysis
- Neurology
- Orthopaedic & Rheumatology

SURGICAL SPECIALTIES:
- Anaesthesiology
- Breast Surgery
- Bone & Soft Tissue Tumors
- Gynaecology & Gynaec Oncology
- Head & Neck Oncology
- Minimal Access Surgery
- Neurosurgery
- Plastic & Reconstructive Surgery
- Surgical Oncology
- Thoracic Oncology
- Transplant Surgery
- Urology, Andrology & Endo Urology
- Vascular Surgery

అశ్విన్ క్యాన్సర్ కేర్, భీమవరంలో

ప్రతి నెల మొదటి ఆదివారం

ప్రతి నెల రెండవ ఆదివారం

ప్రముఖ సర్జికల్ అంకాలజిస్ట్
డా॥ జి. సూర్యనారాయణ రాజు
M.S. MCh, FRCS, FUICC సర్జికల్ అంకాలజీ అధినేత
వ్యవస్థాపక డైరెక్టర్, అశ్విన్స్ స్పెషలిటీ హాస్పిటల్స్
మాజీ సభ్యుడు, MARB, NMC, న్యూఢిల్లీ
మాజీ సహాచరుడు. రీసెర్చ్ & ప్రాజెక్ట్స్ డీన్, రిజిస్ట్రార్, ప్రొఫెసర్
మరియు సర్జికల్ అంకాలజీ వ్యవస్థాపక అధిపతి, నిమ్స్

ప్రముఖ గైనో అంకాలజిస్ట్
డా॥ రమణి GSV
MS, OBG
కన్సల్టెంట్ గైనకాలజీ, గైనక్ అంకాలజీ &
ప్రివెంటివ్ అంకాలజీ

ప్రముఖ హెమటో అంకాలజిస్ట్
డా॥ గెంటే. విక్రమ్ కుమార్
MBBS, MD ఇమ్యునో- హెమటాలజీ మరియు రక్త మార్పిడి (JIPMER),
పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్ ఇన్ క్లినికల్ హెమటాలజీ (CMC వెల్లూర్)
కన్సల్టెంట్ హెమటాలజీ మరియు
హెమటో- అంకాలజీ

Book Your Consultation Now +91 9440445775

We do all types of Radical, Organ Sparing and Laparoscopic Surgeries

We Expertise in Treating All Cancers   Expert Treatment At Affordable Prices

ఈ దిగువ లక్షణాలు కలవారు డాక్టర్ గారిని సంప్రదించగలరు.

తెల్ల బట్ట, అధిక నెలసరి, PCOS లక్షణాలు, గర్భసంచి క్యాన్సర్, అండాశయ క్యాన్సర్, అండాశయపు గడ్డలు & సిస్ట్ గడ్డలు, గర్భ సంచి కణితులు, గర్భాశయ క్యాన్సర్ వ్యాక్సిన్ (HPV), రుతువిరతి తర్వాత సమస్యలు, దీర్ఘకాలిక దగ్గు, దగ్గేటప్పుడు రక్తం పడటం, మూత్రంలో రక్తం, ఆహారం మింగలేకపోవడం, నోటి పూతలు, మెడలో గడ్డలు, రొమ్ము లో గడ్డలు, వాంతులు, రక్తపు వాంతులు, కామెర్లు, దీర్ఘకాలిక అతిసారం, మలబద్ధకం, రక్తస్రావం, తెల్లబట్ట

బ్లడ్ క్యాన్సర్, అధిక రక్తస్రావం (Bleeding Problem), రక్తహీనత (Anaemia), ప్లేటిలెట్స్ కణాలు తగ్గడం, రక్త కణాలు సమస్య, రక్తం అధికంగా గడ్డకట్టడం, పసకలు (Jaundice), ప్లీహం పెద్దగా అవడం (Splenomegaly), బోన్ మ్యారో మార్పిడి

అభినవ్ డయగ్నోస్టిక్స్, జెపి రోడ్, ఆనంద బ్లడ్ బ్యాంకు దగ్గర, భీమవరం
08816 224338

ఉదయం గం॥ 10:30ల నుండి గం॥ 2:00ల వరకు

లోటస్ డయగ్నోస్టిక్స్, జెపి రోడ్, ఆనంద బ్లడ్ బ్యాంకు దగ్గర, భీమవరం
08816 230555

గమనిక పేషెంట్స్ తమ పాత రిపోర్టులతో సంప్రదించండి | అన్ని రకాల క్యాన్సర్ల కు చికిత్స మరియు సలహాలు ఇవ్వబడును.

అపాయింట్మెంట్ కొరకు
అచ్చయ్య **98858 45775**
సీత **9618161032**

SCAN ME

గణపతిదేవుడు

39

గణపతిదేవుడు అనుమకొండలో అనునిత్యమూ పాలనా సమస్యలతో ఊపిరి ఆడని దైనందిన జీవితంనుండి కాస్త ఆహ్లాదాన్ని కోరుకున్నాడు. ఈ ప్రయా ణంలో పాలనా అంశం కూడా ఉంది.

చామనపల్లె స్థల వద్ద ప్రవహించే గొనుగు కాలువ ఎవరికి చెందుతుందనే వివాదాన్ని తాను పరిష్కరించలేక అనుమకొండకు నివేదించాడు సబ్బినాడు పాలకుడు అక్షయ చంద్రదేవుడు. అక్కడి పరిస్థితిపై నివేదిక ఇవ్వవలసిందిగా జాయచోడుని మంత్రి అయిన మంచిరాజును రాజధాని ప్రధాన ప్రాడ్వివాహుడు చెమ్మగిరిభట్టు కోరాడు. మంచిరాజు చామనపల్లె వెళ్లి మూడు గ్రామాల సమయసెట్టిల అభిప్రాయాలు తెలుసుకుని నివేదికను చెమ్మగిరి భట్టుకు సమర్పించాడు. నివేదికను ఆయన గణపతి దేవునికి వివరించాడు. అప్పుడే ఆయనకు స్వయంగా వెళ్లాలన్న ఆలోచన కలిగింది. ఆత్మీయమిత్రుడు, బావమరిది జాయచోడునితో బయలుదేరి వచ్చాడు.

"మీరు నదులకు, కాలువలకు పటిష్టమైన.. ఎత్తైన రాతిగట్టలు కట్టించడం వలే ఇదిగో ఈ నేలతల్లి ఇలా పచ్చటి కోకలతో సింగారించుకుని పసిడి పంటలు పండిస్తోంది బావగారూ..!" అన్నాడు జాయచోడుడు.

ఇద్దరూ బండి వెనుకవైపు తెర తొలగించి దగ్గరగానూ, దూరంగానూ చూస్తూ ముచ్చటించు కుంటున్నారు. పచ్చని ప్రకృతి అందాలను చూస్తున్న వారి ముఖాలలో ఓ తన్మయత్వం కనిపిస్తోంది.

మత్తి భానుమూర్తి

నిండుగా పండిన పొలాలు,ఆవలగా విరగకాసిన తోటలు చూస్తూ చిన్న కూనిరాగం తీసి ఓ పాట ఎత్తుకున్నాడు జాయచోడుడు.

'పచ్చా పచ్చని చేలో.. ఓ యమ్మలాలో..
పసుపు పారాడి నట్టుందే.. ఓ యమ్మలాలో..
ఆకూపచ్చని తోటల్ల .. ఓ యమ్మలాలో..
గోరింట పూసినట్టుందే.. ఓ యమ్మలాలో..'

ప్రకృతి సోయగాలకు జాయసేనాపతి గాత్ర మహిమ తోడుకాగా, ఆ అద్భుత ఆవిష్కరణను అనుభూతిస్తూ అరమోడ్పు కన్నులతో మైమరచి పోయాడు గణవతిదేవుడు. బండి కదలక మొరాయించిది కాబోలు.. పెరికవాడు ఎడ్లను గట్టిగా అదిలిస్తూ చెర్నాకోలతో వాటిని కొడుతున్నాడు.

ఇద్దరికి తన్మయత్వభంగం అయ్యింది.

"అరె.. ఏమయ్యింది బాబూ.." అంటూ ఇద్దరూ బండి దిగారు. పంట సిరులతో పరవశిస్తున్న ఆ నేలతల్లిని తాకగానే మరింత పులకించారిద్దరూ.

రహదారి అక్కడి నుండి చాలాఎత్తుగా కొండను ఎక్కుతున్నట్లుంది. ఆ పైకి ఎక్కలేక ఎద్దులు ఇబ్బంది పడుతున్నాయి. పెరికను ఆపి ఇద్దరూ చెరోవైపు బండి చక్రాలను పట్టి పైకి తోయసాగారు. ఎద్దులు ఇలాంటి ఇబ్బంది లేకుండా బండిని పైకి లాగుతున్నాయి.

బండి చక్రాలను పట్టి పైకి తోస్తున్న మహానుభావు లిద్దరికి ఆ పని బహు ఆనందంగా, భలే సంతోషం కలిగిస్తున్నట్లుంది. జాయచోడుడు పాడిన పాటను తిరిగి ఆలపిస్తూ హుషారుగా బండిని తోస్తున్నాడు గణపతిదేవుడు. తన పాటను బావగారు పాడుతుంటే మైమరచి తనూ గొంతు కలిపి బండిని నెడుతున్నాడు జాయచోడుడు.

ఇద్దరూ చూశారు బండి పక్కగా ఓ పొలంగట్టు వద్ద కూర్చున్న వృద్ధ రైతుని.

తాటిఆకుల గొడుగు నీడలో కూర్చుని పక్కగా పోతున్న కాలువ నీటిని ఆనందంగా చూస్తున్నాడా రైతు.

"పెరికా..!కాసేపు బండి ఆపు. ఎద్దులను విడిచి పుచ్చు. కాసేపు విశ్రాంతి తీసుకుందాం ఎద్దులతో పాటు మనం కూడా.." అన్నాడు గణపతిదేవుడు. ఆయన ఆజ్ఞ చెవినపడగానే పెరికె మాత్రమే కాదు ఎద్దులు కూడా తలతిప్పి ఆయనను చూశాయి.

ఆయన దృష్టి మాత్రం గట్టుపై కూర్చుని తన్మయత్వంలో పిల్లకాలువలో పారుతున్న నీటి గలగలను వింటున్న ఆ వృద్ధ రైతుపై పడింది.

"ఎంత అద్భుతమైన జీవితం ఈ రైతుది..??!!" అన్నాడు ఆయన.

ఆ రైతు తలతిప్పి చూశాడు ఇద్దరిని. వారి తోజోవిలాసం అతడిని చకితుడ్ని చేసింది కాబోలు లేవబోయాడు.

"వద్దు..వద్దు.. కూర్చో కూర్చో.." అంటూ గణపతిదేవుడు అతని దగ్గరకు వెళ్లాడు.

ఆవల పెద్ద చెరువు, ఓ మహాసముద్రంలా కనిపిస్తోంది. దాని గట్లపై కూడా ఏదో పంట.. సస్యశ్యామలంగా ఉంది. దూరంగా మరో చెరువు. దాని ఆవలగా మరో చెరువు.ఆ చెరువుల చుట్టూ కనుచూపు మేర పచ్చని పంట పొలాలు, ఏపుగా ఎదిగి ఒయ్యారంగా కదిలి గాలి తెమ్మెరలతో సయ్యాట లాడుతున్నాయి.

వాళ్ల కళ్లల్లో మెరుపును చూస్తూ ఆ రైతు "ఆ కనిపించే మేరా భూములన్నీ నావే.." మీసం మెలివేస్తూ అన్నాడు.అతని మాటల్లో గర్వం లేదు కానీ ఓ స్థిరత్వపు ఆత్మవిశ్వాసం కనిపించింది.

"ఇంత ఎత్తులో చెరువు..??" ఆర్థోక్తిలో ఆపాడు జాయపుడు.

"అవును బాబూ..! నేనే తవ్వించుకున్నాను. మొత్తం మూడు గొలుసు చెరువులు. ఇది నిండితే ఆ నీరు కిందికి పోతుంది. అక్కడో చెరువు. అది నిండితే.. మళ్లీ దానికి కాలవలు. వాటి ద్వారా కిందికి పొతే అక్కడ ఇంకో చెరువు. ఈ మూడో చెరువు ఎప్పుడూ ఎండదు. బాగా పల్లంలో ఉంది కదా. మొన్న కరవొచ్చిందే.. ఏడేళ్ల కరవు. మీకు కరవు అంటే తెలిసినట్టు తెలీదు. మిమ్మల్ని చూస్తే బాగా బలిసినోళ్లులాగా ఉండారు. ఆ కరవులో కూడా నా ఆ మూడో చెరువు ఎండలేదు. అప్పుడు అదిగో ఆ పది గ్రామాలలో పంటలు పండాయి. ఎవరో వర్తకుడు వచ్చి మొత్తం పంట అంతా పట్టుకు పోయాడు. గంజి కేంద్రాలు తెరిచి పేదోల్లకు పోస్తానంటే నేనే సొమ్ము తీసుకోకుండా ఇచ్చేశా.."

ఇద్దరి శరీరాలు జలదరించాయి. అతనికి చెరో పక్కనా చతికిలబడ్డారు.

"దగ్గరలో నది లేదు కదా. కాలువలూ లేవు. వరదలు రావు. మాకు తాగడానికే నీళ్లు లేవు. నా పిల్లలు చెప్పినా వినరు. అందుకే నేనే.. ఒక్కడినే తవ్వుకున్నా. ఇప్పుడు ఈ మూడు చెరువులు మొత్తం పాతిక ఊళ్లకు..అంటే మొత్తం స్థలకే బువ్వ పెడుతున్నాయి. ఇప్పుడందరూ నన్ను గ్రామదేవుడులా కొలుస్తున్నారు.."

'జాగృతి' నిర్వహించిన స్వర్గీయ కొండపాక కిషన్‌రావు స్మారక నవలల పోటీలో ప్రథమ బహుమతి పొందిన రచన

ఇద్దరూ వంగి ఆ రైతు కాళ్లకి దండం పెట్టారు.

కాస్త మొహమాట పడినా అతడు కూడా సంతోషించాడు.

"నీ పేరేవిటి?" అడిగాడు జాయపుడు.

"ఏవో..అంతా చెరువుల బోసోడు అంటారు నన్ను.." ఫక్కున నవ్వాడు.. బోసినోటితో.

"రాళ్ల నేలలో నీరు నిలువచేసి పంటలు పండిస్తున్నాను కానీ నా నోట్లో పళ్లు కాపాడుకోలేకపోయాను. పళ్లన్నీ రాలిపోయాయి.." బోసినోటితో మళ్లీ నవ్వాడు.

ఇద్దరూ అతని హాస్య చతురతకు ఫక్కున నవ్వారు.

"ఇలా చెరువులు..అదే గొలుసు చెరువులు తవ్వాలని, తద్వారా నీరు నిలువ ఉంటుందని, పంటలకు ఎప్పుడూ నీళ్లు అందుతాయని నీకు ఎవరు చెప్పారు?" అడిగాడు గణపతిదేవుడు.

"మా ఊళ్లో ఎప్పుడో మూడుతరాల నాడే అప్పటి రాజుగోరు తవ్వించాడంట. నా చిన్నప్పుడు మా తాత చెప్పాడు. ఈ మూడు తరాలుగా మావూళ్లో కరవు అనేదే లేదు. అది నాకెప్పుడూ గుర్తే.."

ఇద్దరూ ముఖాలు చూసుకున్నారు.

"అవును అప్పటి రాజు గోరు.. తవ్వించాడు పెద్ద చెరువు. సముద్రమంత. అక్కడ ఎప్పుడూ కరవులేదు..కానీ మాకు పొలం లేదు. అందుకని నన్ను మా అయ్య ఇల్లరికం ఇచ్చాడు. ఈ రాళ్లపల్లి మా అత్తారి ఊరు. ఈడ పొలం ఉంది కానీ నీళ్లులేక పంటల్లేవ్.నన్ను మోసంచేసి ఆ యమ్మికి కట్టబెట్టారు. కానీ ఎంతైనా నా ఇంటిది కదా బాబూ.! ఆమెను వదల్లేక నేనే ఇట్టా చెరువులు తవ్వి నీళ్ల దాచిపెట్టుకుని పొలం పండించుకుంటన్నా. ఇప్పుడు ఈ స్థలలోని పాతిక ఊళ్లూ నా చెరువుల నీటితో పంటలతో కళకళ లాడుతున్నాయి. మా యాడది సంతోషించింది. అంతకంటే నాకేమి కావాలి బాబూ.."

చేతులెత్తి నమస్కరించడం కన్నా విజ్ఞులైన వాళ్లిద్దరూ మరేమీ మాట్లాడలేక పోయారు. లేచి బండి వైపు కదిలారు.

అప్పుడా వృద్ధుడు "మా అయ్య నాకు పెట్టిన పేరు. మా రాజుగారి పేరే. ఆయన పేరు అరిగజకేసరి ప్రోలరాజులుం గారు! ఆయన పేరున ఊరును కేసరి సముద్రం అంటారు.."

మరి కొన్నిగంటల అనంతరం ఎడ్లబండి చామనపల్లె వద్దనున్న గొనుగు కాలువ వద్దకు చేరింది. ఐదు గ్రామాల సమయసెట్టిలు, రైతులు అక్కడికి వచ్చారు. ప్రతివారూ ఆ కాలువపై హక్కులు తమకే దక్కుతాయని గొప్పగా వివరించారు.

గణపతిదేవుడు విన్నాడు. మౌనంగా బండి ఎక్కారు. బండి వెనుతిరిగింది.

సబ్బినాడు మండలేశ్వరుని నివాసానికి వచ్చాక...

"ఆ కాలువపై సర్వహక్కులు.. రాళ్లపాడు గ్రామరైతు కేసరికి సర్వమాన్యంగా రాసి ఇవ్వండి. ఇది నా ఆజ్ఞ!!" అన్నాడు.

కేసరి నేర్పిన పాఠం కాకతీయ రాజ్యాన్ని, గణపతిదేవుని వంశాన్ని చరిత్రలో శాశ్వతంగా నిలిపింది..

గొలుసుకట్టు చెరువుల ఆలోచనకు బీజం వేసినవాడు గణపతిదేవుని తాత పేరు పెట్టుకున్న వాడు, చెరువుల బోసోడు.. కేసరి!!

* * *

తొమ్మిదవ మెట్టు: కళింగ సరిహద్దులో తెలుగు గ్రామాల విలీనం అఖండ గోదావరి తీరం.. కొలని రాజ్యపు అంచు..

కళింగరాజ్యంపై యుద్ధం ప్రకటించి రుద్రమదేవి, మురారిదేవుల నాయకత్వంలో అపార కాకతీయ సైనిక పారావారం తరలివచ్చి గోదావరి తీరాన ఆగింది. కొలని రాజ్యపు చిట్టచివర..గోదావరి నదీతీరంలోని దట్టమైన అడవుల సమూహం.

దాదాపు పదివేల గొల్లెనలు వేసుకుని రెండు మూడు రోజులుగా అక్కడ నిలిచి ఉంది కాకతీయ సైన్యం. నది దాటాల్సిఉంది కాబట్టి సైనికులు కాస్త విశ్రాంతి తీసుకుంటే మంచిదని రుద్రమ భావించింది.

మూడవ రోజు బాగా తెల్లవారింది. సైనికులు అప్పుడప్పుడే లేచి కాల కృత్యాలు తీర్చుకుంటున్నారు.

మంచి యుద్ధాశ్వం ఒకటి చాలా వేగంగా అక్కడికి వచ్చింది. గొల్లెనల చుట్టూ కాపలా తిరుగుతున్న రక్షణభటులు పరుగున ముందుకు వెళ్లి ఆ అశ్వాన్ని ఆపారు. అశ్వంపై నుండి అశ్వికుడు దబ్బున కిందికి ఉరికాడు. తానెవ్వరో అతడు చెప్పగానే ఓ భటుడు అతని వద్ద ఉండగా, ఆగంతుకుని వివరాలతో ఒకరిద్దరు భటులు లోపలికి పరిగెత్తారు. వెళ్లినంత వేగంగా తిరిగి వచ్చి మరింత గౌరవంగా అతనిని లోపలికి తీసుకువెళ్లారు.ఓ గొల్లెన ముందు ఆగి, లోపలికి సమాచారం పంపించి.. లోపలి నుండి ఆహ్వానం రాగానే అతన్ని లోపలికి పంపి రక్షకభటులు వెనుదిరిగారు.

"రా రా.. గోకర్ణా.. నీ కోసమే చూస్తున్నాను.."

ఆ మృదుమధుర కంఠం యువరాజ్ఞి రుద్రదేవమ్మ వారిది.

వచ్చిన ఆగంతుకుడు దూరంగానే పూర్తిగా మోకాళ్లపై కూర్చుని తలవాల్చి ఆమెకు నమస్కరించాడు.

"జయము జయము యువరాజ్ఞి.."

సర్వసైన్యాధ్యక్షులు, మహాయోధులు, శూన్యపాలుడు, సంధి విగ్రహులు, యుద్ధ తంత్రజ్ఞులు, మందడులు, అంచె బృందాల అధ్యక్షులు.. లాంటి యుద్ధ ప్రముఖుల గొల్లెనలు కొన్ని రహస్యమైన చోట్ల ఉంటాయి. యుద్ధ తంత్రజ్ఞతలో ఈ ముఖ్యుల గొల్లెనల ఏర్పాట్లు కూడా ఓ భాగం. శూన్యపాలునితో పాటు మందడి, సైన్య సాహిణిలు.. ముఖ్యుల స్థానం నిర్ణయిస్తారు. యుద్ధభూమిలోనైనా, దండుబాట లోనైనా, కాకతీయసైన్యంలోని సాధారణ సైనికులు

కూడా ఆయా ముఖ్యుల గొల్లెనలను గుర్తించలేరు. యుద్ధవీరుల రక్షణలో అంతటి తంత్రజ్ఞత ఉంటుంది.

చరిత్ర తొలినాటి నుండి కళింగ, ఆంధ్ర రాజ్యాలు రెండూ వేరువేరు జన పదాలుగానే ప్రసిద్ధి చెందాయి.నిజానికి ఉత్తరాన గంగానది నుండి దక్షిణాన గోదావరి నది వరకు విస్తరించి ఉన్న కళింగ రాజ్యం మూడు భాషలతో మమేకమైన రాజ్యం. దక్షిణ కళింగంలో ముప్పాతిక భాగం ఒంధ్రతో తెలుగు, ఉత్తరమంతా ఒంధ్రతో బెంగాళం, మధ్య కళింగంపై ఒంధ్రతో కలిపి కోనల భాష ఎక్కువగా మాట్లాడతారు.

ఇప్పుడు భాషలు స్పష్టమై తెలుగు వేరుగా, ఒంధ్ర వేరుగా మాట్లాడుతూ.. 'మేము తెలుగువారం'.. 'మేము ఒంధ్ర భాషీయులం' అని విస్పష్టంగా చెప్పుకుంటున్న ఈ కాలానికి తెలుగుభాష మాట్లాడే కొన్నిగ్రామాలే కాదు...స్థల, విషయ, మండలాలు కూడా ఉన్నాయి. మా తెలుగు ప్రాంతాలన్నీ మా రాజ్యంలో ఉండాలనే కాకతీయ రాజ్యపు వాదనకు తెలుగు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు.

'మండలా'లను, 'విషయ'లను మాకు అప్పగించ వలసినదిగా మరోమారు కోరుతున్నాము. మా రాజ్యాలలో ఒంధ్ర భాష మాట్లాడే గ్రామాలున్నట్లు మీరు తెలియజేస్తే తప్పక తమరికి అప్పగించగలము. ఇది సుహృద్భావ వాతావరణంలో ఇచ్చి పుచ్చుకునే అంశం. సహజంగా తెలుగుభాషీయులంతా తెలుగు రాజ్య పౌరులుగా కలసి మెలసి జీవించాలని మేము గాఢంగా వాంఛిస్తున్నాము. అదే భావనతో మీరూ ఉన్నారని భావిస్తున్నాము. ఇది సామరస్య పూర్వకంగా పరిష్కరించుకుంటే ఉభయులకు శ్రేయోదాయకం. లేకుంటే మేము యుద్ధ రీతిలోనయినా మా గ్రామాలను సాధించుకోగలమని తెలియజేస్తున్నాము.

చిత్తగించవలెను.

భవదీయుడు

గణపతిదేవుడు, కాకతీయరాజ్య మహామండ లేశ్వరుడు."

ఊహించినట్లే కళింగ మహారాజు నారసింహదేవుడు దానిని తిరస్కరించాడు. యుద్ధానికి సిద్ధమని ప్రకటించాడు.

సైన్యం వెళ్లగలిగింది గోదావరి నదీతీరం వరకే. కళింగరాజ్యం గోదావరికి ఆవల, ఈశాన్య మూలగా ఉంటుంది. గోదావరి చాలా పొడవుగా చాలా చోట్ల చాలా వెడల్పుగా, అనేక చోట్ల చాలా లోతుగా ఉంటుంది. తూర్పు కనుమల్లో చిన్నపెద్ద చాలా కొండలు ఉన్నాయి. నది ఆవల ప్రోలవరం, రేఖపల్లి తదితర రాజ్యభాగాలూ ఈ నైరుతి మూలగా ఉన్నాయి. నిజానికి గోదావరి నైరుతి మూలగా మాత్రమే కాక తూర్పు, పడమర వైపున్న అనేక చిన్న పెద్ద రాజ్యాలు కూడా గోదావరికి ఆవల ఉన్నాయి. ఈ రాజ్యాలన్నింటిని దాటాక కళింగ రాజ్యం ఉంటుంది కానీ ఈ గోదావరి తీరం వరకు ఉన్న రాజ్యాలపై దాడులు చేస్తూ తన రాజ్యంలో కలిపేసుకుంటూ రాజ్యాన్ని విస్తృతపరచుకుంటారు కళింగ పాలకులు.

ఈశాన్య రాజ్యాలలోని తెలుగుభాషా ప్రాంతాలను సాధించుకోవాలంటే కళింగ రాజ్యంపై పూర్తి స్థాయి యుద్ధంతోనే సాధ్యం. చర్చలతో ఫలితం శూన్యం. తన అధీనంలోని ప్రాంతాలను భాష పేరు చెప్పి వదలి వేయడానికి కళింగ పాలకుడు నారసింహదేవుడు సిద్ధంగా లేడు.యుద్ధ ప్రయత్నాలు ముమ్మరం చేసుకుంటున్నాడని వార్త.

'అయినను పోయిరావలె హస్తినకు..' అని తిక్కనామాత్యులు అన్నట్లు సంధివిగ్రహి ఉరువేల శర్మకు లేఖ ఇచ్చి పంపాడు గణపతిదేవుడు.

"కళింగ ప్రభువులు శ్రీశ్రీశ్రీ నారసింహదేవులకు ప్రణామములు. కాకతీయ రాజ్యాధిపతి మహామండ లేశ్వరులు, రాయగజకేసరి, మూరు రాయలగండ, శ్రీశ్రీశ్రీ గణపతిదేవ మహారాజులుం గారు తమరికి మరొక్కమారు చేసుకుంటున్న విన్నపములు.

నేటి ఈ ఆధునిక కాలానికి మనం మాట్లాడుకునే భాషలు ప్రస్ఫుటమై తెలుగు, ఒంధ్ర భాషలు విడివడ్డాయి. తెలుగుభాష మాట్లాడే ప్రజలున్న కళింగ రాజ్యంతో యుద్ధమంటే మాటలు కాదు. అందుకు రెండు పెద్ద అవరోధాలున్నాయి. మొదటిది గోదావరి నది. రెండవది కళింగ రాజ్యపు బలిష్టమైన గజసైనిక వ్యవస్థ.

చాలాకాలంగా గజసాహిణి జాయచోడుని అధ్వర్యంలో కాకతీయ గజ సైనిక వ్యవస్థ కూడా బలిష్టంగా సిద్ధమైంది.ప్రస్తుతం ఆయన గజసాహిణి కాక పోయినా కాకతీయ గజసైనికవ్యవస్థకు వచ్చిన లోపం ఏమీ లేదు. నాట్యంపై గ్రంథరచనలో ఉన్న జాయసేనాపతి గణపతిదేవుని ఆజ్ఞపై రెప్పపాటులో యుద్ధ క్షేత్రంలోకి దూకగలడు.

కళింగపై యుద్ధానికి పూర్తి బాధ్యతలు తీసుకున్నారు కాకతీయ యువతరం పాలకులు రుద్రమదేవి, మురారి దేవుడు. యువరాణి రుద్రమ కత్తి యుద్ధంలో సాటిలేని యోధురాలు అని ప్రతీతి. ఆమె కత్తిపట్టి నిలబడితే ఎదుటివాడికి ఊపిరిపీల్చడం కూడా కష్టమేనని చెప్పుకుంటారు ఖడ్గయోధులు. ఆమె ఖడ్గాలు ప్రత్యేకమైనవి. ఆమె ప్రత్యేకంగా తయారు చేయించుకుంటుంది.

"కత్తి పట్టడమా! చెయ్యి చూడు..లేత తామరతూడులా ఉంది.కత్తి ప్రహారాలు సరే! అసలు కత్తిని గట్టిగా పట్టు కోగాలదా..?" అని హాస్యమాడిన శత్రు ఖడ్గ యోధుడు వెకిలిగా వాగుతుండగానే అతనికి తెలియకుండా అతను ఖడ్గం పట్టుకున్న చేతిని ముంజేతివరకు నరికి పట్టుకుని అతని ముఖానే చూపిందట కొలని యుద్ధంలో. అప్పుడు వాడు తల దించి చూసుకుంటే ఖడ్గం సంగతి సరే.. అసలు చెయ్యే లేదట!!

కొలని యుద్ధంలో ఆమె ప్రతిభను స్వయంగా చూసిన మేనమామ జాయచోడుడు ఈ ముచ్చట అంతఃపురంలో చెప్పినప్పుడు రుద్రమ పక్కన కూర్చున్న తల్లులిద్దరూ కాస్త పక్కకు జరిగారు. అప్పుడా దృశ్యం చూసిన గణపతిదేవుడు, పరిచారికలు.. ఘోల్లున నవ్వారట.

మురారిదేవుడు మేనమామలాగా గజయుద్ధ విశారదుడని అతని మిత్ర బృందం చెబుతుంది. యుద్ధం, పరాక్రమం సంగతి అటుంచితే ఎప్పుడూ పది మంది మిత్రులను వెంటేసుకుని కబుర్లు చెబుతూ తిరుగుతుంటాడు. 'కబుర్లు కాదు.. యుద్ధక్షేత్రంలో చూపిస్తా నాతడాఖా.." అనేది మురారి నినాదం.

కాల్బలాన్ని, అశ్వదళాలను, గజదళాలను, ఖడ్గయోధులను, గజయుద్ధ విశారదులను సమాయత్తపరచారు. మహామహా సైనికవీరులతోను, సేనానులు, సర్వసైన్యాధ్యక్షుల తోనూ సమావేశాలు నిర్వహించి వారిని పూర్తిగా యుద్ధానికి సిద్ధం చేశారు. ఏ దళాలు ఎక్కడ మొహరించాలో, ఎప్పుడు ఏ దళం ఎటు కదలాలో నిర్ణయించే యుద్ధ నిపుణులతో కూలంకషంగా చర్చించారు.

ఓ శుభ ముహూర్తాన కాకతీయ సైన్యం కళింగంపై యుద్ధానికి తరలింది.

సైన్యం వెళ్లగలిగింది గోదావరి నదీతీరం వరకే. కళింగరాజ్యం గోదావరికి ఆవల, ఈశాన్య మూలగా ఉంటుంది. గోదావరి చాలా పొడవుగా చాలా చోట్ల చాలా వెడల్పుగా, అనేక చోట్ల చాలా లోతుగా ఉంటుంది. తూర్పు కనుమల్లో చిన్నపెద్ద చాలా కొండలు ఉన్నాయి. నది ఆవల ప్రోలవరం, రేఖపల్లి తదితర రాజ్యభాగాలూ ఈ నైరుతి మూలగా ఉన్నాయి. నిజానికి గోదావరి నైరుతి మూలగా మాత్రమే కాక తూర్పు, పడమర వైపున్న అనేక చిన్న పెద్ద రాజ్యాలు కూడా గోదావరికి ఆవల ఉన్నాయి.

ఈ రాజ్యాలన్నింటిని దాటాక కళింగ రాజ్యం ఉంటుంది కానీ ఈ గోదావరి తీరం వరకు ఉన్న రాజ్యాలపై దాడులు చేస్తూ తన రాజ్యంలో కలిపేసుకుంటూ రాజ్యాన్ని విస్తృతపరచుకుంటారు కళింగ పాలకులు.

ఇదంతా గతం!..

ఇప్పుడు భాష ప్రధాన పాత్ర వహించడంవల్ల

కళింగరాజ్య పరిధిలో ఉన్న తెలుగు భాషా ప్రాంతాలను తప్పకుండా కలల రాజ్యమైన తెలుగు సామ్రాజ్యంలో కలిపి తీరాలని తిక్కనామాత్యునికి, గణపతిదేవునికి తీవ్రమైన పట్టుదల. తిక్కన విక్రమసింహపుర రాజ్య సమస్యలు ఎన్ని ఉన్నా, ఎవరితో సంఘర్షిస్తున్నా.. 'తెలుగు రాజ్యం తెలుగు రాజ్యం' అంటూ గణపతిదేవుని నిత్యమూ పోరుతుంటాడు. తిక్కనామాత్యునికి ఉన్న గూఢచార వ్యవస్థ, సమాచార వ్యవస్థ.. మరే మహాకవులకు, పండితులకు లేవు.

'కళింగ రాజ్యంలో మన తెలుగు గ్రామాలు బోలెడు ఉన్నాయి. వాటిని తమరు ఎప్పుడు జయిస్తారు?" అంటూ లేఖ రాసి నెల్లూరు నుండి అనుమకొండకు ఓ సమాచారభటుడ్ని పంపిస్తాడు తిక్కనార్యుడు.

అలా నిత్యమూ సొద పెడుతుంటే గణపతిదేవుడు రుద్రమ, మురారిలతో చర్చించి యుద్ధానికి సిద్ధమయ్యాడు.

సైన్యం నది దాటడం అనేదే ఓ పెద్ద యుద్ధం.

లక్షల సైన్యం..మహామత్తగజాలు, అద్భుతమైన యుద్ధ అశ్వాలు.. కత్తులు, కటారులు, డాళ్లు, విల్లంబులు, బల్లేలు మొదలైన ఆయుధాలు, దుస్తులు, ఆహార తినుబండారాలు.వీటన్నింటిని మోసుకువచ్చే ఎడ్ల బళ్లు. వైద్యులు లాంటి సహాయ బృందాలు, చతురంగ సైన్యాలతోపాటు సహాయ బృందాలు, సదుపాయ బృందాలు, ప్రోత్సాహక బృందాలు అనే మూడు అంచే బృందాలుంటాయి. యుద్ధభూమిలో వారికి పూర్తి తోడ్పాటునందించేవే ఈ అంచే బృందాలు. మంత్రాంగ నిపుణులు, సమాహర్తలు, వేగులు, లేఖకులు, సమాచార నివుణులు, వార్తాహరులు మొదటి అంచే బృందం.

కత్తులు, ఖడ్గాలు, కవచాలు, డాళ్లు, బల్లేలు, విల్లంబులు, బాణాలు, అంబుల పొదులు మొదలైన ఆయుధాల నిర్వహణ, అశ్వాల సమస్యలు, గజసైన్యపు అవసరాలు, రథాలు, ఎడ్లబళ్ల అంశాలను రెండో అంచె బృందాలు చూస్తాయి. వైద్యబృందాలు, భోజనబృందాలు, చాకలి, మంగలి, కంసాలి, భోగపుసానుల బృందాలు, కళాకారుల బృందాలు, పురోహిత, జ్యోతిష్య బృందాలు.. మొదలైన వారంతా ఈ మూడో అంచె బృందాల్లోకి వస్తారు.

సైనికులే కాదు ఈ మొత్తం అందరూ..వారి వారి సయకు, సరంజామాతో నది దాటాల్సిందే.

నది దాటించడం అంటే ఏదో చేయి పట్టి పడవ ఎక్కించడం కాదు.

సాధారణంగా అనేకానేక సామాజిక కార్య కలాపాలు నదుల మీదుగానే జరుగుతుంటాయి. నది వెంబడి, రెండు వైపులా రేవులు ఎన్నో ఉంటాయి. అవన్నీ నిత్యమూ పూర్తి సందడిగా ఉంటాయి. వచ్చే పోయే ప్రయాణికులే కాదు వస్తురవాణా కూడా నది

ఆదిమకాలం నుండి జనులు ఎక్కువగా ప్రయాణించింది నదుల మీదుగానే. నదులతో ప్రజలకున్న అనుబంధం ఇంతా అంతా కాదు. అనాది నుండి యుద్ధాలున్నాయి. ఒక్కసారిగా వేలకొద్ది సైనికులు నదులు దాటిన చరిత్రలున్నాయి. అలెగ్జాండర్ లాంటి ప్రపంచ ప్రఖ్యాత యుద్ధ యోధుడు ప్రపంచాన్ని జయించాలనే ఆశయంతో సింధు దేశం వరకు వచ్చేడంటే ఎన్నో చిన్న పెద్ద నదులు, సముద్రాలూ దాటడం వల్లనే.

మీదుగా నిరంతరంగా జరుగుతుంటుంది.

ఇవన్నీ ఒకెత్తు. యుద్ధానికి బయలుదేరిన లక్షోపలక్షల సైన్యం నది దాటడం ఒకెత్తు.

మహాగజరాజులు ఎలా నదిని దాటుతాయి. అశ్వాలు, ఎద్దులు నదిలోపడి మునిగి చనిపోవా! ఒకరు ఇద్దరు కాదు.. లక్షల సైనికులు ఎలా దాటుతారు? ఎన్నిరోజులు పడుతుంది దాటడానికి??

ఇవన్నీ పెద్ద ప్రశ్నలు.

మరో అంశం.. అవతల శత్రువు కూడా నది దాటకుండా అడ్డుకుంటాడు. నదిలో వస్తుండగానే బాణాలు వేసి.. బరిసేలు విసిరి చంపేస్తే??

వీటన్నిటికి జవాబులున్నాయి.

ఆదిమకాలం నుండి జనులు ఎక్కువగా ప్రయాణించింది నదుల మీదుగానే. నదులతో ప్రజలకున్న అనుబంధం ఇంతా అంతా కాదు. అనాది నుండి యుద్ధాలున్నాయి. ఒక్కసారిగా వేలకొద్ది సైనికులు నదులు దాటిన చరిత్రలున్నాయి. అలెగ్జాండర్ లాంటి ప్రపంచ ప్రఖ్యాత యుద్ధ యోధుడు ప్రపంచాన్ని జయించాలనే ఆశయంతో సింధు దేశం వరకు వచ్చేడంటే ఎన్నో చిన్న పెద్ద నదులు, సముద్రాలూ దాటడం వల్లనే.

ప్రాచీనకాలంలో మానవ ప్రయాణం ఎక్కువగా నీటి మీదనే జరిగేది అంటే ఇప్పుడు ఆశ్చర్యంగా ఉండొచ్చు కానీ అది నిజం. భూమిపై ప్రయాణం చాలా కష్టతరం, క్లిష్టతరం. ప్రమాదం కూడా. అన్ని కీకారణ్యాలే కావడం వల్ల ఎప్పుడు ఎటు నుండి ఏ జంతువో, ఏ దోచుకునే క్రూరుడో మీద పడతాడనే భయంతోనే ప్రయాణించాలి. నీటిపై ఆ సమస్య లేదు. హాయిగా పడవలో తేలిపోతూ వెళ్ల వచ్చు. వానలూ వరదల కాలంలో మాత్రం కాస్త అప్రమత్తంగా ఉండాలి.

సైన్యానికి కూడా ఇదే పరిస్థితి వర్తిస్తుంది.

సాధారణంగా యుద్ధాలు వేసవి కాలంలోనే నిర్ణయిస్తారు. అప్పుడైతే గోదావరి లాంటి నదులు ఎండకపోయినా ప్రవాహ ఉధృతి తగ్గుతుంది. సాధారణ రేవులు అన్నిచోట్ల నీటి ప్రవాహం తక్కువగానే ఉంటుంది. సైన్యం అక్కడ నది దాటడం చేయదు. కాకపోతే దానికి దరిదాపులలో దాటుతాయి. నీటి ప్రవాహ ఉధృతి తక్కువగా ఉన్నా గోదావరి లాంటి నదుల లోతు మాత్రం భయానకం. దాదాపు రెండు తాడిచెట్లలోతు ఉంటుంది.

అన్ని రాజ్యాలకు నదుల లోతుపాతుల పట్ల అనుభవమున్న నిపుణులు ఉంటారు. నదీతీరాలలో ఉన్న రాజ్యాలలో ఎక్కువగా.. దూరపు రాజ్యాలలో తక్కువ ఉంటారు.

కళింగరాజ్యంలో ఈ సముద్రనిపుణులు ఎక్కువ. కారణం అటు సముద్రం, పైన గంగానది, మధ్యలో మహానది, దిగువన గోదావరి వాళ్లకు సరిహద్దులుగా ఉండటంతో వారి సంస్కృతీ, దైనందిన జీవనం అంతా ఈ సహజ జీవజలాలపైనే పరిణామం చెందింది.

(సశేషం)



యుద్ధంతో ఆర్థిక సం

యూఎస్–ఇరాన్ యుద్ధం కారణంగా అంతర్జాతీయ మార్కెట్లో రోజుకు 1.3 కోట్ల నుండి 2 కోట్ల బారెళ్ల ముడి చమురు సరఫరా నిలిచిపోవడంతో ప్రపంచ దేశాలు తీవ్ర ఇంధన సంక్షోభంలో కూరుకు పోయాయి. ఈ సంక్షోభానికి ప్రధాన కారణం హోర్ముజ్ జలసంధి పూర్తిగా మూతపడటం! ప్రపంచ చమురు వ్యాపా రంలో 20% వాటా ఈ సముద్ర మార్గం ద్వారానే జరుగుతుంది. ఇరాన్ సైనిక ఆంక్షలు, డ్రోన్ దాడుల వల్ల ఈ మార్గంలో ఓడల ప్రయాణం పూర్తిగా నిలిచిపోయింది. దీనివల్ల సౌదీ అరేబియా, కువైట్, ఇరాక్, యూఏఈ తదితర దేశాల నుంచి చమురు సరఫరా నిలిచిపోయింది.

యుద్ధానికి ముందు బ్యారల్‌కు 70 డాలర్లు ఉన్న బ్రెంట్ ముడి చమురు ధర, ఏప్రిల్ నాటికి రికార్డు స్థాయిలో 120–122 డాలర్లకు చేరినా, మే నాటికి, యూఎస్–ఇరాన్ మధ్య జరుగుతున్న సంధి చర్చల వల్ల మార్కెట్ ఒత్తిడి కొద్దిగా తగ్గింది. ప్రస్తుతం బ్రెంట్ క్రూడ్ బ్యారల్ ధర 100 డాలర్లకు పైనే కొనసాగుతోంది. హోర్ముజ్ జలసంధి గుండా వెళ్లే చమురులో 90% ఆసియా దేశాలకే వెళ్తుంది. భారత్ తన వంటగ్యాస్‌లో 90% పైగా, రోజుకు 25 లక్షల బ్యారెళ్ల చమురును ఈ మార్గం ద్వారానే దిగుమతి చేసుకుంటుంది. ప్రస్తుతం ఈ మార్గం మూతపడటంతో దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలు భారీగా పెరిగాయి. చమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్లకు పైనే ఉండటం వల్ల మనదేశంలో రవాణా ఖర్చులు భారీగా పెరిగాయి. దీనివల్ల దేశంలో పండ్లు, కూరగాయలు, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని చూస్తున్నాయి. చమురు దిగుమతుల కోసం భారత్ ఎక్కువ మొత్తంలో డాలర్లను చెల్లించాల్సి వస్తోంది. డాలర్లకు డిమాండ్ పెరగడంతో, అమెరికన్ డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి విలువ రికార్డు స్థాయికి పడిపోయింది. దేశంలోకి వచ్చే విదేశీ మారక ద్రవ్యం కంటే, బయటకు వెళ్లే ద్రవ్యం (ముఖ్యంగా చమురు బిల్లుల రూపంలో) ఎక్కువగా ఉండటం వల్ల బడ్జెట్ లోటు, కరెంట్ ఖాతా లోటు భారీగా పెరిగాయి. పరిస్థితిని అదుపు చేయడానికి కేంద్ర ప్రభుత్వం వైజాగ్, మంగళూరు, పాడూరులలో ఉన్న భూగర్భ వ్యూహాత్మక చమురు నిల్వల నుండి చమురును విడుదల చేస్తోంది. రష్యా, బ్రెజిల్, ఆఫ్రికా దేశాల నుండి హోర్ముజ్ జలసంధితో సంబంధం లేని సురక్షిత మార్గాల ద్వారా చమురు దిగుమతులను పెంచడానికి భారత్ చర్చలు జరుపుతోంది. ఇరాన్ ఎగుమతి చేసే చమురులో 90% చైనాకే వెళ్తుంది. ప్రస్తుతానికి చైనా తన అత్యవసర నిల్వలు, సరఫరాలపై ఆధారపడుతోంది. ఇంధన ధరలు భారీగా పెరగడంతో యూరప్‌లో తయారీ రంగం దెబ్బతిని ఆర్థిక వ్యవస్థ క్షీణించింది. అమెరికా స్వంతంగా చమురు ఉత్పత్తి చేసుకుంటున్నప్పటికీ, అంతర్జాతీయ ధరల ప్రభావం వల్ల అక్కడ గ్యాసోలిన్ (పెట్రోల్) ధర 4 ఏళ్ల గరిష్టానికి అంటే గ్యాలన్‌కు 4.56 డాలర్లకు చేరింది. ఈ పరిణామాలను స్థూలంగా పరిశీలిస్తే ఇరాన్‌తో అమెరికా–ఇజ్రాయెల్ యుద్ధం, గల్ఫ్ ప్రాంతం నుండి వచ్చే ఇంధనంపై ప్రపంచం ఎంతగా ఆధారపడి ఉందో స్పష్టంగా తెలియజేస్తోంది. ఘర్షణ ప్రారంభమైనప్పటి నుండి, చమురు ధర విపరీతంగా పెరిగింది. నౌకా రవాణా, ఇంధన మౌలిక సదుపాయాలపై జరిగిన వైమానిక దాడులు, అలాగే ప్రపంచ చమురు సరఫరాలో ఐదవ వంతును మోసుకెళ్లే కీలకమైన హోర్ముజ్ జలసంధిని మూసివేయడం ముడి చమురుధర పెరగడానికి ప్రధాన కారణం.

దెబ్బతిన్న సముద్ర వ్యాపారం

ప్రపంచవ్యాప్తంగా చమురు రవాణాలో 20%, ఎల్ఎన్‌జీ సరఫరాలో 19% హోర్ముజ్ జలసంధి దిగ్బంధం వల్ల నిలిచిపోయింది. మధ్యప్రాచ్యంలోని 80కి పైగా ఇంధన కేంద్రాలపై ఇరాన్ జరిపిన దాడుల వల్ల రోజుకు 13 మిలియన్ బ్యారళ్ల చమురు ఎగుమతులు నిలిచిపోయాయి. సూయజ్ కాల్వ, బాబ్ ఎల్–మండెబ్ మార్గాల్లో దాడుల వల్ల ప్రపంచ సముద్ర వ్యాపారంలో మూడోవంతు నిలిచి పోయింది. దీంతో పెద్ద షిప్పింగ్ కంపెనీలు తమ సేవలను నిలిపేశాయి. ముడిచమురుతో పాటు, పెట్రోకెమికల్స్, ఎరువులు, ప్లాస్టిక్ వంటి పారిశ్రామిక ఉత్పత్తుల తయారీ, రవాణా కూడా నిలిచిపోయింది. యూరోపియన్ గ్యాస్ ధరలు 100% పెరిగాయి. ముడి చమురు దిగుమతులపై ఆధారపడే ఆసియా/యూరప్ దేశాల కరెన్సీ విలువలు పడిపోయి, ద్రవ్యోల్బణం తారస్థాయికి చేరుకుంది. యుద్ధం వల్ల అమెరికా ఎగుమతి ఆదాయం గణనీయంగా పెరిగింది. దేశ జీడీపీ స్థిరమైన వృద్ధిని నమోదు చేయడం గమనార్హం. ప్రపంచం మొత్తం ఆర్థిక మాంద్యం అంచులకు చేరుతుండగా, అమెరికా మాత్రం యుద్ధం నెగళ్లలో చక్కగా చలి కాచు కుంటోంది. అక్కడి చమురు ఉత్పత్తి కంపెనీలు విపరీతంగా లాభాలు ఆర్జిస్తున్నాయి. కానీ సగటు అమెరికన్లు పెరిగిన ధరలతో ఇక్కట్లు పడుతున్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం వల్ల ప్రపంచ వ్యాప్తంగా ద్రవ్యోల్బణం 0.6% నుంచి 0.7%కు పెరిగింది. నిత్యావసరాల ధరలు పెరిగి అన్ని దేశాల్లో సామాన్యులు నానా ఇబ్బందులు పడుతున్నారు. భారత్, చైనా, దక్షిణ కొరియా, జపాన్, ఐరోపా దేశాల కరెన్సీ విలువలు పడిపోయాయి. ఈ దేశాల నుంచి పెట్టుబడులు వెనక్కి వెళ్లిపోయాయి. ద్రవ్యోల్బణం పెరిగిపోవడంతో వివిధ దేశాల కేంద్ర బ్యాంకులు వడ్డీరేట్లను పెంచడంతో వ్యాపారాలు

కష్టమై, ఆర్థిక మాంద్యం ప్రమాదం పెరిగింది. విమాన ఇంధన ధరలు రెట్టింపు కావడం, సముద్ర ప్రయాణ బీమా ప్రీమియంలు పెరగడంతో అంతర్జాతీయ వ్యాపారంలో లాభాలు లేక, కొన్ని మార్గాలను మూసివేశారు.

ఆసియాలో తీవ్రం

ప్రస్తుత ఇంధన సంక్షోభ ప్రభావం ఆసియాలో ఉన్నంత తీవ్రంగా మరెక్కడా లేదు. గత ఏడాది హోర్ముజ్ జలసంధి గుండా రవాణా అయిన మొత్తం చమురు, గ్యాస్‌లో దాదాపు 90% ఈ ప్రాంతానికే కావడం గమనార్హం. పర్షియన్ గల్ఫ్ సంక్షోభం వల్ల ముఖ్యంగా ఆగ్నేయా సియా దేశాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నాయి. మలేషియా, ఇండోనేషియా వంటి స్వయంగా చమురును ఉత్పత్తి చేసే దేశాలు కూడా గత దశాబ్ద కాలంలో క్రమంగా

క్షోభంలో ప్రపంచం!

ఉత్పత్తిని తగ్గించి, దిగుమతులను పెంచుకోవడం ప్రారం భించాయి. మధ్యప్రాచ్యంలో ఉత్పత్తి అయ్యే చమురు రకం, అలాగే ఆ ప్రాంతం లోని దేశాలు దానిని శుద్ధి చేసే విధానం కూడా ఈ పరిస్థితికి పాక్షికంగా కారణం. మధ్యప్రాచ్య ముడి చమురు సాధారణంగా 'హెవీ సోర్' లేదా 'మీడియం సోర్' రకానికి చెందింది. ఆగ్నేయాసియాలోని రిఫైనరీలు ఈ రకమైన ముడి చమురును శుద్ధి చేయడానికే ఏర్పాటు చేయడంవల్ల, అమెరికా వంటి మరో సరఫరాదారుకు మారడం అంత సులభం కాదని

నిపుణులు పేర్కొం టున్నారు. ఎందుకంటే రిఫైనరీ స్పెసిఫికేషన్లను మార్చడానికి గణనీయమైన పెట్టుబడి అవసరం అవుతుందనేది వారు చెప్పేమాట!

పెరిగిన పెట్రోల్ ధరలు

ఆసియాలో కనిపించినంత స్థాయిలో కాకపోయినా, ప్రపంచవ్యాప్తంగా పెట్రోల్ ధరలు పెరుగుతున్నాయి. అమెరికాలో నెల రోజుల క్రితంతో పోలిస్తే సగటు పెట్రోల్ ధరలు 23% పెరగ్గా, డీజిల్ ధరలు మూడో వంతు పెరిగాయి. యూకేలో డీజిల్ ధర 9% పెరిగింది. ప్రభుత్వాలు ఈ విషయంపై నిఘా ఉంచుతున్నాయి. పెరుగుతున్న చమురు ధరలపై ఆందోళనను తగ్గించడానికి దక్షిణ కొరియా ఇంధన ధరలపై తాత్కాలిక పరిమితిని విధించింది. రిటైల్ పెట్రోల్ ధరలను అదుపులో ఉంచడానికి, చమురు టోకు వ్యాపారులకు సబ్సిడీలు అందిస్తామని జపాన్ ప్రభుత్వం తెలిపింది. ఆసియాలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన చైనా, ఈ సంక్షోభాన్ని తట్టుకునే స్థితిలో ఉంది. సంవత్సరాలుగా, ఇది ప్రపంచంలోనే అతిపెద్ద చమురు నిల్వలను నిర్మించుకుంది. ఈ నిల్వలు కొన్ని నెలలపాటు చైనా ఇంధన అవసరాలను తీరుస్తాయి. అనధికారికంగా, అమెరికా ఆంక్షల పరిధిలో ఉన్న ఇరాన్ చమురును కూడా చైనా లక్షలాది బ్యారెళ్ల మేర కొనుగోలు చేస్తున్నది. నౌకల కదలికలను గమనించే డేటా ప్రకారం, ఇందులో కొంత చమురు ఇంకా సరఫరా అవుతూనే ఉన్నట్లు తెలుస్తోంది. దీనికి అదనంగా, ప్రస్తుతం దక్షిణ చైనా సముద్రంలో 4.6 కోట్ల బ్యారెళ్లకు పైగా ఇరాన్ ముడి చమురును తేలియాడే విధానంలో నిల్వ చేసింది. గమనించాల్సిన విషయమేంటంటే చైనాలో అమ్ముడయ్యే కొత్త కార్లలో మూడింట ఒక వంతు ఎలక్ట్రిక్ కార్లే కాబట్టి, పెట్రోల్ ధరల పెరుగుదల ప్రభావం అక్కడ అంత తీవ్రంగా ఉండదు. ఇతర ఆసియా దేశాలతో పోలిస్తే, విద్యుత్ ఉత్పత్తి విషయంలో చైనా చమురుపై చాలా తక్కువగా ఆధారపడుతుంది. అక్కడ ఉత్పత్తి అయ్యే విద్యుత్‌లో అధిక భాగం బొగ్గుతోనే జరుగుతుంది. అంతర్జాతీయ ఇంధన సంస్థ ఇటీవల ప్రకటించిన ఒప్పందానికి అనుగుణంగా, ఆసియా ఖండంలోని ఇతర ప్రధాన ఆర్థిక వ్యవస్థలైన జపాన్, దక్షిణ కొరియా, తమ జాతీయ నిల్వల నుండి లక్షలాది బ్యారెళ్లను విడుదల చేయడానికి అంగీకరించాయి. అయినప్పటికీ, 2022లో ఉక్రెయిన్‌పై దాడి జరిగిన నేపథ్యంలో రష్యా చమురు, గ్యాస్ కొనుగోలును తగ్గించాలని నిర్ణయించుకున్నప్పటి నుండి, ఈ రెండు దేశాలు మధ్యప్రాచ్య ఇంధనంపై ఆధారపడటం పెరిగింది.

యూరప్‌కు గ్యాస్ సమస్య

యూకే, ఈయూ ఇప్పుడు తమ ద్రవీకృత సహజ వాయువులో ఎక్కువ భాగాన్ని నార్వే, యూఎస్ నుండి దిగుమతి చేసుకుంటున్నాయి. ఒక అంచనా ప్రకారం ఈయూ తన గ్యాస్‌లో కేవలం 10% మాత్రమే ఖతార్ నుండి నేరుగా పొందుతుండగా, యూకే సుమారు 2% పొందుతోంది. కానీ యూరప్‌లోని దేశాలు గల్ఫ్ నుండి గ్యాస్ సరఫరాలో తగ్గుదల ప్రభావానికి తక్కువగా గురైనప్పటికీ, ప్రపంచంలోని అతిపెద్ద ఎగుమతి దారులలో ఒకటైన ఖతార్ ఎనర్జీ, తన ప్లాంట్లపై జరిగిన "సైనిక దాడుల" కారణంగా ఇటీవల ఉత్పత్తిని నిలిపివేసింది. దీని ప్రభావం యూరప్‌పై కొంతమేర పడిందనడంలో ఎంతమాత్రం సందేహం లేదు. గల్ఫ్ దేశాల గ్యాస్‌ను పొందలేని ఆసియా వినియోగదారులు ఇతర మార్గాలకు మరలడంతో గ్యాస్ ధరలు పెరుగుతున్నాయి. అయితే ఇందుకు అమెరికా మినహాయింపనే చెప్పాలి. ఎందుకంటే ఇటీవలి సంవత్సరాలలో అది సొంత గ్యాస్ ఉత్పత్తిని పెంచుకోవడమే ఇందుకు కారణం. ప్రస్తుత షాక్ నుంచి ఆమెరికా సురక్షితంగా ఉండ టానికి ఇదే ప్రధాన కారణం. అయితే గ్యాస్‌ను ఎగుమతి చేసే సామర్థ్యం విషయంలో అమెరికాకు కొన్ని పరిమితులున్నాయి. కానీ గల్ఫ్ దేశాలనుంచి సరఫరాల నష్టాన్ని పూడ్చడానికి ఈ ప్రత్యామ్నాయాలు సరిపోవన్నది మాత్రం సుస్పష్టం.

ఇజ్రాయెల్ కీలకం

ఇరాన్‌తో యూఎస్, ఇజ్రాయెల్ దేశాలు జరుపుతున్న యుద్ధానికి ముగింపు పలికితేనే ప్రపంచం చమురు సంక్షోభం నుంచి బయట పడగలుగుతుంది. ఈ విషయంలోనే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహుల మధ్య దాదాపు గంటసేపు వాగ్వాదం జరిగిందని వార్తలు వచ్చాయి. జరుగు తున్న పరిణామాలను పరిశీలిస్తే, గల్ఫ్ సంక్షోభం ఇప్పుడే ముగిసేలా లేదు. అబ్రహామిక్ ఒప్పందాలపై సంతకాలు పెట్టాలని డోనాల్డ్ ట్రంప్ పాకిస్తాన్, టర్కీ, సౌదీ అరేబియా వంటి ముస్లిం దేశాలపై ఒత్తిడి తీసుకురావడం వెనుక ఇజ్రాయెల్ ఉన్నదన్నది వేరే చెప్పాల్సిన పనిలేదు. 60 రోజుల తాత్కాలిక అవగాహనా ఒప్పందంపై అమెరికా, ఇరాన్ ప్రతి నిధులు ఒక అభిప్రాయానికి వచ్చినట్టు తెలుస్తోంది. ఒప్పందం అమల్లోకి వస్తే కాల్పుల విరమణ అమల్లోకి వచ్చి, ఇరు వర్గాలు మళ్లీ చర్చలు ప్రారం భించే అవకాశముంది. అట్లాగని పశ్చిమాసియాలో శాంతి వీచికలు వీస్తాయనుకోవడం కూడా భ్రమే! ఎందుకంటే ఈ యుద్ధానికి కీలకం ఇజ్రాయెల్! ఆ దేశం అంగీకరించకుండా యుద్ధం ఒక కొలిక్కి రావడం కష్టమే! ఎందుకంటే ఇజ్రాయెల్– హిజ్ బుల్లాల పరస్పర దాడులు ప్రాంతీయ ఉద్రిక్తతలను మరింత పెంచుతున్నాయి. యూఎస్, ఇరాన్‌లు ఒక ఒప్పందానికి వచ్చినా అది తాత్కాలికమే కానీ, శాశ్వత ప్రాతిపదికన వచ్చే అవకాశాలు కనిపించడంలేదు. అందువల్ల పశ్చిమాసియా సంక్షోభం కొనసాగే అవకాశాలే అధికం!

జమలాపురపు విఠల్‌రావు
సీనియర్ జర్నలిస్ట్

ఆదర్శగృహి

అహల్య

ధర్మశాస్త్రాలలోనూ, పురాణాలలోనూ ఆదర్శ గృహిణి అనే పదం అత్యంత పవిత్రమైనదిగా పరిగణించబడుతుంది. తమ జీవితాల్లో ఎదురైన క్లిష్ట పరిస్థితులను, సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొని, తమ వ్యక్తిత్వంతో పురాణాల్లో ప్రసిద్ధి చెందిన వారు అహల్య, సీత, తార, మండోదరి, ద్రౌపది, కుంతి. ఈ ఆరుగురు స్త్రీమూర్తులు భారతీయ సంస్కృతిలో స్త్రీ శక్తికి వివిధ రూపాలు. ఆరు లక్షణాలను వేర్వేరు సందర్భాల్లో తమదైన శైలిలో నిరూపించుకున్నారు.

అహల్య గౌతమ మహర్షి భార్య. ఇంద్రుని మాయ వల్ల శాపానికి గురైనా, శ్రీరాముని పాదస్పర్శతో తిరిగి తన రూపాన్ని పొందింది. ఇది క్షమాగుణానికి, నిరీక్షణకు నిదర్శనం. ద్రౌపది పంచపాండవుల ధర్మపత్ని. అపారమైన మేధస్సు, పట్టుదల కలిగిన వ్యక్తిత్వం. అధర్మంపై యుద్ధం చేయడానికి ప్రేరణనిచ్చిన శక్తి స్వరూపిణి. సీత సహనానికి, పాతివ్రత్యానికి మారుపేరు. భూదేవి పుత్రికగా కష్టాలను ఓర్చుకుంటూ ధర్మాన్ని నిలబెట్టిన ఆదర్శమూర్తి. తార వాలి భార్య. అత్యంత తెలివైనది, రాజనీతిజ్ఞురాలు. కష్టకాలంలో కూడా సరైన నిర్ణయం తీసుకోగల వివేకవతి. మండోదరి రావణుని భార్య. భర్త అధర్మ మార్గంలో వెళ్తున్నా, అతనికి హితబోధ చేస్తూ తన ధర్మాన్ని పాటించిన నిశ్చల భక్తురాలు. పాండురాజు భార్య కుంతిని శ్రీకృష్ణుడు ఏదైనా వరం కోరుకోమన్నప్పుడు, ఆమె 'ఎప్పుడూ కష్టాలనే ఇవ్వు' అని కోరింది. ఎందుకంటే, కష్టాల్లో ఉన్నప్పుడే భగవంతుని స్మరణ ఎక్కువగా ఉంటుందని ఆమె భావన. ఇది ఆమెలోని అత్యున్నతమైన వైరాగ్యానికి, భక్తికి గుర్తు. కుంతి పాత్ర మనకు నేర్పే పాఠం ఏమిటంటే పరిస్థితులు ఎంత ప్రతికూలంగా ఉన్నా, ఒంటరిగానైనా సరే ధర్మాన్ని నమ్ముకుని బిడ్డలను సరైన మార్గంలో పెంచడం ఎలాగో అని.

'అహల్యా, ద్రౌపదీ, సీతా, తారా, మండోదరీ తథా పంచకన్యాం స్మరేన్నిత్యం మహాపాతక నాశనం' వీరందరూ అయోనిజలు. అంటే తల్లి గర్భం నుంచి పుట్టినవారు కాదు. అందుకే వారికి ఏ దోషాలు అంటవు. మహా పతివ్రతలు. వీరిని రోజుకు ఒక్కసారి తలుచుకుంటే చాలు మహాపాతకాలు కూడా నశిస్తాయి. కొన్ని సంప్రదాయాలలో 'సీత'కు బదులుగా 'కుంతి' పేరును కూడా చేరుస్తారు. ఈ ఆరుగురు తమ ఇంద్రియాలను, మనస్సును కష్టకాలంలో ఎలా అదుపులో ఉంచుకున్నారో అది ఒక పరిపాలన వంటిదే. ధర్మ పరిపాలన అంటే ప్రతికూల పరిస్థితుల్లో కూడా ధర్మాన్ని విడిచి పెట్టకుండా జీవించడం. రాజ్యాల్లో తలెత్తిన సంక్షోభాలను (వాలి మరణం తర్వాత తార, రావణుడి మరణం తర్వాత మండోదరి, పాండురాజు మరణం తర్వాత కుంతి) తమ విజ్ఞతతో చక్కదిద్దారు.

అహల్య

మొదటి వ్యక్తిగా అహల్యను పేర్కొనడానికి ప్రధాన కారణం ఆమె సహనం. ఇంద్రుని మాయ వల్ల తాను తెలియక తప్పు చేసినా, భర్త ఇచ్చిన శాపాన్ని మౌనంగా భరించి, కొన్ని వేల ఏళ్లు తపస్సు చేస్తూ శ్రీరాముని రాక కోసం నిరీక్షించింది. భూదేవికి ఉండేంత ఓర్పు ఆమె సొంతం. గౌతమ మహర్షి ఆశ్రమంలో ఆమె చేసిన సేవలు అనన్యం. రూపేష లక్ష్మి అన్నట్లుగా బ్రహ్మదేవుడు అహల్యను సృష్టించినప్పుడు, ఆమెను అత్యంత సౌందర్యవతిగా తీర్చిదిద్దాడు. ఆమె రూపం సాక్షాత్తు లక్ష్మీదేవిని తలపిస్తుందని పురాణాలు చెబుతాయి. అహల్య కేవలం ఒక అందమైన స్త్రీ మాత్రమే కాదు, ఆమె జ్ఞానానికి ప్రతీక. అహల్య అంటేనే 'హల్య' (దున్నడం/కల్మషం) లేనిది అని అర్థం. అంటే ఎటువంటి మాలిన్యం లేని మనస్సు కలది. అహల్య తన జీవితంలో ఎదురైన ఒడుదొడుకులను ఎదుర్కొని, పశ్చాత్తాపంతో తపస్సు ద్వారా తిరిగి తన పవిత్రతను నిరూపించుకుంది. గౌతమ మహర్షి పత్నిగా అహల్య ఆశ్రమ విధులను అత్యంత భక్తితో నిర్వహించేది. మహర్షి తపస్సుకు, ఆయన దైనందిన అవసరాలకు ఎటువంటి ఆటంకం కలగకుండా ఒక దాసి వలె వినమ్రతతో సేవలు చేసేది. ఆమె సేవాగుణం ఆశ్రమానికి ఒక పవిత్రతను ఇచ్చేది. ఆమె గౌతమ మహర్షి వంటి జ్ఞాని పక్కన ఉంటూ, ఆమె ధర్మ సూక్ష్మాలను గ్రహించింది. వివేకంతో మెలగడం ఆమె సహజ గుణం. ఆశ్రమానికి వచ్చే అతిథులకు, భర్తకు ప్రేమతో భోజనం సమకూర్చడంలో ఆమె తల్లి వంటి ఆప్యాయతను చూపేది. ఆమె చేతి వంట ఆశ్రమవాసులకు తృప్తినిచ్చేది. భర్త మనసును ఎరిగి, ఆయనకు మానసిక ఉల్లాసాన్ని, సుఖాన్ని అందించడంలో ఆమె రంభ వలె ప్రియమైన అర్ధాంగిగా ఉండేది. అహల్య పాత్ర ద్వారా మనకు తెలిసే గొప్ప సత్యం ఏమిటంటే మనిషికి పరిస్థితుల ప్రభావం వల్ల తెలియక పొరపాటు జరిగినా, పశ్చాత్తాపం, నిరీక్షణ ద్వారా తిరిగి తన పవిత్రతను, గౌరవాన్ని పొందవచ్చు. అందుకే ఆమెను మొదటి వ్యక్తిగా స్మరిస్తాము.

సీతామాత

రాజకుమారిగా పుట్టి, కోడలిగా అడుగుపెట్టిన సీత, అరణ్యవాస సమయంలో రాముునికి సేవ చేయడంలో ఎప్పుడూ అలసత్వం ప్రదర్శించలేదు. కారడవుల్లో రాముని అవసరాలను గుర్తిస్తూ, ఒక దాసి వలె వినమ్రతతో ఆయనకు సేవలు అందించింది. భోగభాగ్యాలను వదిలి భర్త అడుగు జాడల్లో నడవడం ఆమె సేవానిరతికి నిదర్శనం. రాముడు ఏదైనా ధర్మసంకటంలో ఉన్నప్పుడు లేదా ముఖ్యమైన నిర్ణయాలు తీసుకోవాల్సి వచ్చినప్పుడు సీత ఒక మంత్రిలా నరైన నలహాలు ఇచ్చేది. దండకారణ్యంలో ఉన్నప్పుడు మునులను రక్షిస్తానని రాముడు ప్రతిజ్ఞ చేసినప్పుడు, అహింస గురించి, ఆయుధధారణ వల్ల కలిగే మార్పుల గురించి సీత చేసిన హితబోధ ఆమెలోని వివేకానికి, మంత్రిత్వానికి గుర్తు. సీత సాక్షాత్తు మహాలక్ష్మి అవతారం. ఆమె సౌందర్యం కేవలం బాహ్యమైనది మాత్రమే కాదు, పవిత్రతతో (అంతర సౌందర్యం) కూడినది. లంకలో అశోకవనంలో ఉన్నప్పుడు కూడా ఆమె తన తేజస్సును కోల్పోలేదు. శ్రీరాముడు అరణ్యవాసానికి వెళ్లాల్సి వచ్చినప్పుడు, రాజభోగాలను తృణప్రాయంగా వదిలేసి, కారడవుల్లో భర్త అడుగుజాడల్లో నడిచిన ఆమె సహధర్మచారిణి అనే పదానికి నిలువెత్తు రూపం. రావణుడు అపహరించి లంకకు తీసుకువెళ్లినప్పుడు, అపారమైన సంపదను, వైభవాన్ని చూపి

తిరిగాప్పుల విఎల్లెన్ మూర్తి
8008577834

ప్రలోభపెట్టినా ఆమె చలించలేదు. అశోకవనంలో ఒక చిన్న గడ్డిపోచను అడ్డం పెట్టుకుని రావణుడితో మాట్లాడింది. ఆ గడ్డిపోచ ఆమె ఆత్మగౌరవానికి, పాతివ్రత్యానికి ప్రతీక. పరపురుషుడిని కన్నెత్తి చూడని ఆమె నిష్ఠ రావణుడిని సైతం భయపెట్టింది. రావణుడి చెరలో ఉన్నప్పుడు రాక్షస స్త్రీలు ఆమెను ఎన్నో రకాలుగా వేధించారు. కానీ యుద్ధం ముగిసిన తర్వాత హనుమంతుడు వారిని శిక్షిస్తానంటే, సీతమ్మ వారించింది. 'కేవలం రాజు ఆజ్ఞను పాటించారు తప్ప వారిలో తప్పు లేద'ని వారిని క్షమించింది. జీవితాంతం అగ్నిపరీక్షలు, బహిష్కరణలు ఎదురైనా ఆమె రాముడిని ద్వేషించలేదు. రాముడు ఆమెను అడవులకు పంపినప్పుడు ఆమె గర్భవతి. వాల్మీకి ఆశ్రమంలో ఉంటూ లవకుశులను ఒంటరిగానే పెంచింది. వారిని అజేయులైన వీరులుగానే కాకుండా, రామాయణాన్ని గానం చేసే సంస్కారవంతులుగా తీర్చిదిద్దింది. తండ్రి తనను అడవికి పంపినా, పిల్లల మనసులో తండ్రిపై గౌరవం తగ్గకుండా పెంచడం ఆమె గొప్పతనం. సీత తన కర్తవ్యం ముగిసిందని భావించే లోకానికి తన సచ్ఛీలతను చాటిచెప్పి, తిరిగి భూమాత ఒడిలోకి వెళ్లిపోయింది. ఇది ఆమె నిశ్చలమైన ఆత్మగౌరవానికి నిదర్శనం.

సీతమ్మ కేవలం ఒక పురాణ పాత్ర కాదు; కష్టాల్లో ఉన్న ప్రతి మహిళకు ధైర్యాన్ని ఇచ్చే ఒక శక్తి. 'జనక నందిని'గా పుట్టి, 'రామపత్ని'గా జీవించి, 'లోకమాత'గా నిలిచిపోయిన సీతమ్మ గొప్పతనం అనంతం. అందుకే ఆమె పేరును రాముడి కంటే ముందే చేర్చి 'సీతారామ' అని పిలుచుకుంటాం. రామునికి భోజనం వడ్డించేటప్పుడు ఒక తల్లిలా ఆప్యాయతను కురిపించేది. కందమూలాలు అయినా, రుచికరమైన ఆహారం అయినా ప్రేమతో వడ్డించి ఆయన ఆకలిని, అలసటను తీర్చేది.

భర్తకు ఆహ్లాదాన్ని, సంతోషాన్ని కలిగించడంలో ఆమె రంభ వలె అత్యంత ప్రియమైనదిగా ఉండేది. మానసిక ప్రశాంతతను ఇచ్చే అర్ధాంగిగా ఆమె రాముని హృదయంలో నిలిచింది. సీతమ్మ కేవలం భార్యగానే కాకుండా, కష్టాల్లో తోడుండే స్నేహితురాలిగా, పాలనలో సలహాలిచ్చే మంత్రిగా, సేవలో దాసిగా రాముని జీవితంలో అంతర్భాగమైంది. అందుకే ఆమెను "ఆదర్శ గృహిణి"గా లోకం కొలుస్తుంది. అహల్య పశ్చాత్తాపానికి, నిరీక్షణకు ప్రతీక అయితే, సీత త్యాగానికి, ధర్మానికి నిలువెత్తు రూపం.

ణికి ఆరు రూపాలు

తారాదేవి

వానర రాజు వాలి ధర్మపత్ని అయిన తారాదేవి కేవలం ఒక రాణి మాత్రమే కాదు, అసాధారణమైన మేధాశక్తి కలిగిన మనీషి. తార తన భర్త వాలి పట్ల అత్యంత అనురాగం, అంకితభావం కలిగి ఉండేది. వాలి అజేయుడైన పరాక్రమవంతుడు. అటువంటి వీరుడికి భార్యగా, అతని అవసరాలను గుర్తించి, ఒక దాసి వలె వినమ్రంగా సేవలు అందించేది. వాలి సుగ్రీవుల యుద్ధం సమయంలో కూడా ఆమె తన కర్తవ్యాన్ని మరువలేదు. తారకు ఉన్న అత్యున్నత లక్షణం ఇది. ఆమె కేవలం భార్య మాత్రమే కాదు, వాలికి ప్రధాన సలహాదారు. సుగ్రీవుడికి అయోధ్య రాజకుమారులైన రామలక్ష్మణుల సాయం లభించిందని ఆమె వాలికి హెచ్చరిక చేసింది. రాముడు సామాన్య మానవుడు కాదని, ఆయన సాధువులకు కల్పవృక్షం (నివాస వృక్షః సాధూనామ్) వంటివాడు అని, శరణు కోరిన వారిని రక్షించే గుణం కలవాడని ఆమె వివరించింది. రాముని బాణం అమోఘమని, ఆయనతో వైరం పెట్టుకోవడం అంటే మృత్యువును ఆహ్వానించడమేనని ఆమె వాలిని వారించింది. ఆమె మాట వినకపోవడం వల్లే వాలి ప్రాణాలు కోల్పోయాడు. తార అత్యంత సౌందర్యవతి. ఆమె రూపం లక్ష్మీకళతో ప్రకాశించేది. వాలి మరణం తర్వాత సుగ్రీవుడు రాజ్యాన్ని చేపట్టినప్పుడు, తార తన వ్యక్తిత్వంతో, రూపంతో రాజ్యానికి గౌరవాన్ని తెచ్చిపెట్టింది. తార జీవితం అనేక కష్టాలతో కూడుకున్నది. తన భర్త వాలి తన సోదరుడైన సుగ్రీవుని భార్య రుమను అపహరించినప్పుడు ఆమె ఎంతో బాధపడినా, ఓర్పుతో వాలిని మార్చడానికి ప్రయత్నించింది. వాలి మరణం తర్వాత, కుమారుడైన అంగదుని భవిష్యత్తు కోసం నిలబడింది. ఆమె వాలికి తల్లిలా ఆప్యాయంగా భోజనం సమకూర్చేది. వానర రాజ్యంలో ఆమె అందరి దగ్గర తల్లిలాంటి గౌరవాన్ని పొందింది. వాలికి తారపై ఉన్న అపారమైన ప్రేమకు కారణం ఆమెలోని సౌందర్యం, భర్త మనసుని రంజింపజేసే గుణం. వాలి ఎంతటి మొండివాడైనా, తార మాటను గౌరవించేవాడంటే ఆమె అతనిపై చూపిన అనురాగం అంతటిది. తార 'రాజనీతిజ్ఞతకు' మారుపేరు. వాలి మరణం తర్వాత లక్ష్మణుడు కిష్కింధకు ఆగ్రహంతో వచ్చినప్పుడు, అతని కోపాన్ని తన మాటల చాతుర్యంతో తగ్గించిన ఘనత తారదే.

వాలి మరణశయ్యపై ఉన్నప్పుడు, రాముని సైతం ప్రశ్నించిన విధానం ఆమెలోని ధైర్యాన్ని సూచిస్తుంది. ఆ తర్వాత సుగ్రీవుడు పట్టాభిషిక్తుడైనప్పుడు, రాజ్య క్షేమం కోసం ఆమె తన సలహాలను అందిస్తూ కిష్కింధకు అండగా నిలిచింది. అహల్య, సీత, ద్రౌపది, మండోదరి, తార వేర్వేరు సందర్భాల్లో "కార్యేషు దాసి, కరణేషు మంత్రి..." అనే సూత్రానికి జీవం పోశారు. తార పాత్ర మనకు సమయస్ఫూర్తిని, క్లిష్ట పరిస్థితుల్లో నిర్ణయాలు తీసుకునే ధీరత్వాన్ని నేర్పుతుంది.

(సశేషం)

మహిళల 'బంగారు'

కాలం మారుతోంది. నగల పెట్టెలో నిక్షిప్తమై ఉండాల్సిన బంగారం ఇప్పుడు సరికొత్త రూపం దాల్చుతోంది. ఒకప్పుడు లాకర్లకే పరిమితమైన 'స్త్రీ ధనం' ఇప్పుడు డిజిటల్ సావరిన్ బాండ్లుగా, బ్యాంక్ వడ్డీ పథకాలుగా మారి... దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా నిలిచేందుకు సిద్ధం అవుతోంది.

ప్రాచీన సంప్రదాయ, సంస్కృతులను కొనసాగించడంలో బంగారానిది ప్రముఖ పాత్ర. అందం, ఆహార్యం, ఆరోగ్యం ఇలా అన్నింటా మహిళకు అండగా ఉండేదీ బంగారమే. అంతటి ప్రాముఖ్యత కలిగిన బంగారాన్ని కొనుగోలు చేసి నిల్వ చేయొద్దు అంటూ ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన పిలుపు, కొందరిలో ఆందోళన రేకెత్తిస్తోంది. అత్యవసరాల్లో ఆదుకునే నగలు అక్కరకు రాకుండా పోతాయని మహిళలు దిగులు చెందుతున్నారు. బ్యాంకుల్లో సైతం రుణాలకు పరిధులు విధించడం మధ్య తరగతి మహిళలు శరాఘాతంగా భావిస్తున్నారు. ప్రధాని పిలుపులో అంతరార్థం తెలియక పరేషాన్ అవుతున్నారు.

భారతీయ సంస్కృతిలో బంగారం కేవలం ఒక నగ కాదు. అది మహిళల సమాంతర బ్యాంకింగ్ వ్యవస్థ. దీన్నే స్త్రీ ధనం అంటారు. ఆపత్కాలంలో మహిళకు ధైర్యాన్నిచ్చే ఏకైక ఆస్తి ఇది. మహిళకు పూర్తి హక్కు ఉండే ఆస్తి ఉన్న బంగారం. భవిష్యత్తులో ఆర్థిక సంక్షోభం వచ్చి, ఉద్యోగాలు పోయినా మెడికల్ ఎమర్జెన్సీ వచ్చినా... కుటుంబాన్ని ఆదుకోవడానికి మొదట తాకట్టు పెట్టేది, అత్యవసరం అయితే అమ్మేది మహిళల బంగారాన్నే. ఆ బంగారం చేజారిపోతే, మహిళలు తమ ఆర్థిక స్వయంప్రతిపత్తిని కూడా కోల్పోతారు. భారతీయ మహిళలకు బంగారానికి ఉన్న అనుబంధం కేవలం ఒక లోహంతో ఉన్నది కాదు. అది ఒక సెంటిమెంట్. బంగారం భారతీయ మహిళల ఆత్మగౌరవం. బంగారం అంటే ఒంటిపై మెరిసే నగ మాత్రమే కాదు, పుట్టింటి జ్ఞాపకం, మెట్టినింటి పరువు, ప్రతిష్ఠ.

బంగారం,పెట్రోల్, ఆర్థిక సంక్షోభాలకు... మన దేశంలోని మహిళల జీవితాలకు అత్యంత బలీయమైన, విడదీయరాని బంధం ఉంది. ఆర్థిక వ్యవస్థలో పెట్రోల్ ధరలు పెరిగినప్పుడు వచ్చే నిత్యావసరాల ధరల పెరుగుదల, బంగారానికి పెరిగే డిమాండ్... ఇవన్నీ మహిళల జీవితాలనే ఎక్కువగా ప్రభావితం చేస్తాయి. ధరలు విపరీతంగా పెరిగితే, ఆ భారం పరోక్షంగా ఇంట్లో ఉండే మహిళలపైనే పడుతుంది. పెట్రోల్ ధరలు పెరిగితే రవాణా ఖర్చులు పెరిగి పాలు, కూరగాయలు, కిరాణా సామాగ్రి, వంటగ్యాస్ అన్ని ఆకాశాన్ని తాకుతాయి. మధ్య తరగతి, పేద కుటుంబాల్లో బడ్జెట్‌ను నిర్వహించేది మహిళలే కాబట్టి... ఆదాయం సరిపోనప్పుడు, మహిళలు కుటుంబం కోసం తమ బంగారు నగలను ఆర్థికవనరుగా వినియోగించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ప్రధాని పిలుపుతో ఆ అవకాశం ఇక ముందు ఉండదేమోనని మధ్యతరగతి మహిళలు భయపడుతున్నారు.

ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పుడు మహిళలు బ్యాంకులు లేదా ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల్లో గోల్డ్ లోన్స్ తీసుకుంటారు. సంక్షోభం సుదీర్ఘంగా కొనసాగి, వడ్డీలు కట్టలేకపోతే బ్యాంకులు ఆ బంగారాన్ని వేలం వేస్తాయి. దీనివల్ల తరతరాలుగా వచ్చే కుటుంబ సంపద శాశ్వతంగా చేజారిపోతుంది. అంతర్జాతీయ మార్కెట్ ఒడుదొడుకుల వల్ల బంగారం ధరలు విపరీతంగా పెరిగితే, మధ్యతరగతి, పేద కుటుంబాల మహిళలు భవిష్యత్తు కోసం కనీస మొత్తంలో కూడా బంగారాన్ని కొనుగోలు చేయలేరు.

ముఖ్యంగా పెట్రోల్ ధరల వల్ల పెరిగిన ద్రవ్యోల్బణంతో మహిళలు నడిపే చిన్న వ్యాపారాల లాభాలు తుడిచిపెట్టుకుపోతాయి. ఇటు వ్యాపారాన్ని కాపాడుకోవడానికి, అటు ఇంటి ఖర్చుల కోసం వ్యక్తిగత బంగారాన్ని తాకట్టు పెడతారు. సంక్షోభం తీవ్రమైతే, అటు రుణాలు తీర్చలేక, ఇటు బంగారాన్ని విడిపించుకోలేక తీవ్ర రుణభారంలో మునిగిపోతారు. అలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకే కేంద్ర ప్రభుత్వం కొత్త పథకాలను, నిబంధనలను అమల్లోకి తెస్తోంది.

అంతర్జాతీయంగా యుద్ధభయాలు నెలకొన్నప్పుడు, ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారులు షేర్ మార్కెట్ల నుంచి డబ్బులు తీసేసి అత్యంత సురక్షితమైన బంగారంపై పెట్టుబడి పెడతారు. దీనివల్ల ధరలకు రెక్కలొస్తాయి. అలాంటి పరిస్థితుల్లో మహిళలు భవిష్యత్తు రక్షణ కోసం కనీస మొత్తంలో కూడా బంగారాన్ని కొనలేరు. ఒకవేళ ఇంట్లో పెళ్లిళ్లు, అత్యవసరాలు ఉంటే, అధిక ధరలకు కొనలేక అప్పులపాలు కావాల్సి వస్తుంది. బంగారం అమ్మకాలపై తొందరపడకూడదు. రేట్లు పెరుగుతున్నాయని కంగారుపడి చేతిలో ఉన్న బంగారాన్ని ప్రైవేట్ వడ్డీ వ్యాపారులకు అమ్మేయడం లేదా తాకట్టు పెట్టడం చేయకూడదు. అత్యవసర పరిస్థితుల్లో చిన్న మొత్తాల కోసం బ్యాంకుల్లో తాకట్టు పెట్టుకోవడం మంచిది. అలాగే ఎక్కువ మొత్తంలో డబ్బు అవసరం అనుకున్నవారు బ్యాంకుల నిబంధనలకు లోబడి రుణాలు తీసుకుంటే అన్నివిధాలుగాను శ్రేయస్కరం.

ఆర్థిక సంక్షోభం ఏర్పడినప్పుడు, కుటుంబంలో అన్నిటి కంటే ఎక్కువ ఒత్తిడిని, ఇబ్బందులను ఎదుర్కొనేది మహిళలే. పరిమితమైన ఆదాయంతో ఇల్లు గడపడం, పిల్లల చదువులు, ఆరోగ్యం చూసుకోవడం మహిళల చేతుల్లోనే ఉంటుంది. ఆర్థికంగా తమను తాము కాపాడుకొనేందుకు మెళకువలను పాటించాలి. విలాసాలు, అవసరాలు రెండు

జయశ్రీ ఆచంట
సీనియర్ జర్నలిస్ట్

భాగాలుగా విభజించి... ఆచితూచి ఖర్చు చేయాలి. వెచ్చాలు, పాలు, మందులు వంటి తప్పనిసరి అవసరాలను గుర్తించి, అవి మాత్రమే జరిగేలా చూసుకోవాలి. ఆర్థికం సంక్షోభం రాకముందే అనవసరమైన ప్రయాణాలకు దూరంగా ఉండాలంటూ ప్రధాని పిలుపునివ్వడం గమనార్హం.

బంగారం విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు లోని అంతరార్థం తెలియక చాలామంది ఆందోళన చెందుతున్నారు. అయితే అన్నది, మహిళలు ఒంటిపై వేసుకునే నగలనో, దాచుకునే కొద్దిపాటి బంగారం గురించో కాదు. కొందరు కిలోల కొద్దీ బంగారాన్ని బిస్కెట్లు, కాయిన్ల రూపంలో లాకర్లలో పెట్టేస్తారు. అది దేశ ప్రగతికి ఉపయోగపడేలా పెట్టుబడిగా మారాలన్నదే ప్రభుత్వం ఆలోచన. అంతేకాక బ్యాంకుల్లో బంగారు రుణాలపై నిబంధనలు కఠినతరం చేయడానికి కారణం మహిళలను ఇబ్బంది పెట్టడం కాదు.

ధరలు అకస్మాత్తుగా పడిపోతే బ్యాంకులు నష్టపోకుండా ఉండేందుకు రిజర్వ్ బ్యాంక్ కొన్ని నిబంధనలు పెడుతుంది. ప్రభుత్వ ప్రయత్నం మధ్యతరగతి వారిని అడ్డుకోవాలని కాదు. కేవలం బంగారం కొనొద్దు అన్నదే ప్రమాణంగా తీసుకోకూడదు. దానికి బదులు మహిళలకు లాభం చేకూర్చే అద్భుతమైన ప్రత్యామ్నాయాలను తీసుకొస్తుందన్న విషయాన్ని కూడా గమనించాలి. మహిళల ఆర్థిక భద్రతను కాపాడుతూనే, భౌతిక బంగారం కొనుగోలును తగ్గించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ పథకాలను ప్రవేశపెట్టింది. అందులో భాగంగా... ప్రభుత్వం జారీ చేసే గోల్డ్ బాండ్లను కొనుగోలు చేయ వచ్చు. వీటికి లాకర్ రుసుం కట్టక్కర్లేదు. తయారీ ఖర్చులు, తరుగు ఉండవు. బంగారం ధర పెరిగితే వచ్చే లాభంతో పాటు, ప్రభుత్వం ప్రతి సంవత్సరం 2.5 శాతం అదనపు వడ్డీని నేరుగా బ్యాంక్ ఖాతాలో జమ వేస్తుంది. అలాగే ఇళ్లలో పాత బంగారు నగలు లేదా నాణేలను ప్రభుత్వ గుర్తింపు పొందిన బ్యాంకుల్లో డిపాజిట్ చేయవచ్చు. మీ బంగారం బరువు ఆధారంగా ప్రభుత్వం మీకు వడ్డీ చెల్లిస్తుంది. గడువు ముగిసిన తర్వాత మీ బంగారాన్ని తిరిగి నగదు రూపంలో లేదా కొత్త కాయిన్స్ రూపంలో పొందవచ్చు.

భవిష్యత్ !

మహిళలు తమ ఆచారాలు, సాంప్రదాయాల ప్రకారం కొనుక్కునే నగల విషయంలో ఎలాంటి ఆందోళన అవసరం లేదు.అత్యవసర పరిస్థితుల్లో మీ నగలు ఎప్పుడూ మీకు అండగానే ఉంటాయి. ప్రభుత్వం కోరుకునేదల్లా ఒక్కటే... బంగారాన్ని కేవలం లాకర్లలో దాచకుండా, బాండ్ల రూపంలోనో లేదా బ్యాంక్ స్కీముల రూపంలోనో పెడితే.. అటు దేశానికి, ఇటు మీ కుటుంబానికి రెట్టింపు లాభం ఉంటుంది.

మహిళల ఆర్థిక రక్షణ కవచమైన బంగారాన్ని మరింత శక్తిమంతంగా మార్చడం. భవిష్యత్తు ఆర్థిక సంక్షోభాలను తట్టుకోవడానికి మహిళలు కేవలం నగలు కొని దాచుకోవడమే కాకుండా, ప్రభుత్వ గోల్డ్ బాండ్స్ వంటి పథకాల వైపు అడుగులు వేయాలి. దీనివల్ల అటు కుటుంబానికి అదనపు ఆదాయం రావడమే కాకుండా, ఇటు దేశానికి చమురు, ఇతర అత్యవసర వస్తువులను దిగుమతి చేసుకోవడానికి అవసరమైన విదేశీ మారక ద్రవ్యం ఆదా అవుతుంది.

బంగారం కొనాలనుకుంటే..!!

బంగారం కొనాలన్నా అమ్మాలన్నా, సకాలంలో సరైన నిర్ణయం తీసుకోవాలి. అందుకు కొన్ని జాగ్రత్తలు, చిట్కాలు పాటించడం అవసరం. బంగారం అలంకరణకే కాకుండా ఒక మంచి పెట్టుబడి కూడా ఉపకరిస్తుందనుకొనేవారు, దాని ధర పెరుగుదల, తగ్గుదలలను గమనిస్తూండాలి. తగ్గినప్పుడల్లా కొద్దికొద్దిగా కొనుగోలు చేయాలి. అది కూడా హాల్ మార్కింగ్ ఉన్న బంగారాన్ని మాత్రమే కొనాలి.

బంగారంపై పెట్టుబడి మీరు ఏ రకంగానూ నష్టపోకుండా ఉండాలి. కొనాలి అనుకున్న బంగారాన్ని ధరించేందుకా, దాచుకునేందుకా.. అనేది ముందుగానే నిర్ణయించుకోవాలి. దాచుకునేందుకు అయితే, నాణేలు లేదా బిస్కెట్లు రూపంలో కొనుగోలు చేయడం ఉత్తమం. ఎందుకంటే వీటిపై చేతకూలి (మేకింగ్ ఛార్జీ) తక్కువగా ఉంటాయి. ఆభరణాలు కొనుగోలుపై సుమారు ఎనిమిది నుంచి ఇరవై ఐదు శాతం వరకు తరుగు ఉంటుంది.చేత కూలి, వస్తువు తయారీ, నగిషీలకు పోగా మీరు కొన్న బంగారం బరువు కన్నా తక్కువ విలువ కలిగి ఉంటుంది. బంగారం కొనాలి అనుకుంటే.. తిరిగి అమ్మాలి అనుక్కున్నప్పుడు ఆ ఆభరణం విలువ అప్పటి మార్కెట్ రేటుతో పోలిస్తే తక్కువగా ఉంటుంది. కొన్న సమయం కన్నా అమ్మే సమయానికి రేటు పెరిగితే కొంత నష్టపోకుండా ఉంటారు.

బంగారాన్ని నగలు,నాణేల రూపంలో భద్రపరచుకోవడం కష్టం అనుకునే వారికి, డిజిటల్ గోల్డ్ రూపంలో దాచుకునే అవకాశం ఇటీవల అందు బాటులోకి వచ్చింది. గోల్డ్ ఈటీఎఫ్, సావరిన్ గోల్డ్ బాండ్స్‌గా భద్రపరచుకోవచ్చు. వీటితో భద్రతకు తోడు, వడ్డీ లాభం కూడా లభిస్తుంది.

ఆభరణాలు, నాణేలు అమ్మి నగదుగా మార్చుకోవాలి అనుకున్నపుడు కూడా కొన్ని ముఖ్యమైన విషయాలు గుర్తుంచుకోవాలి. ముందుగా మీ వద్ద ఉన్న బంగారం క్యారట్ల విలువ తెలుసుకోండి. స్వచ్ఛతను తెలుసుకోడానికి హాల్మార్క్ ముద్రను ఆభరణంపై పరీక్షించుకోవాలి. కొన్నప్పటి బిల్లులు ఉంటే, తరుగు విషయంలో మంచిధర లభించే అవకాశం ఉంటుంది. అమ్మే రోజున మార్కెట్‌లో ఉన్న కచ్చితమైన ధరను తెలుసుకోండి. కొనుగోలు,అమ్మకపు ధరలకు మధ్య కొంత వ్యత్యాసం ఉంటుందని గమనించండి. వీలయినంత వరకు మీరు కొన్న షాప్‌లోనే అమ్మేందుకు ప్రయత్నిస్తే మంచి ధర వచ్చే అవకాశం ఉంటుంది

స్వచ్ఛత పరీక్ష

ప్రభుత్వం హాల్‌మార్కింగ్‌ను తప్పనిసరి చేసింది. నగపై ఉండే చిన్న ముద్రల ద్వారా స్వచ్ఛతను తెలుసుకోవచ్చు. బంగారాన్ని కొనేటప్పుడు లేదా ఇంట్లో ఉన్న పాత బంగారం విలువ కట్టేటప్పుడు స్వచ్ఛతను తెలుసుకోవాలి. ఆభరణం స్వచ్ఛతను (బీఐఎస్ కేర్) అధికారిక యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. నగపై ఉండే కోడ్ ను బీఐఎస్ కేర్ యాప్‌లో టైపు చేస్తే ఆ నగ ఎక్కడ తయారైంది, దాని స్వచ్ఛత ఎంత అనే పూర్తి వివరాలు వస్తాయి. బంగారు షాపుల్లో లేదా తాకట్టు పెట్టే కేంద్రాల్లో యాసిడ్ టెస్ట్ చేస్తారు. బంగారాన్ని ఒక రాయిపై గీసి, ఆ గీతపై నైట్రిక్ యాసిడ్ వేస్తారు. రంగు మారకుండా ఉంటే అది స్వచ్ఛమైన బంగారం. రంగు మారితే అందులో ఇతర లోహాలు కలిసినట్లు అర్థం. నీటి ద్వారా కూడా పరీక్ష చేయవచ్చు. ఒక గ్లాసు నీటిలో బంగారాన్ని వేసినప్పుడు అది పూర్తిగా అడుగుకు వెళ్లాలి. బంగారం సాంద్రత ఎక్కువ కాబట్టి అది నీటిపై తేలదు. ఇది శాస్త్రీయమైన పద్ధతి. ఈ పద్ధతిలో బంగారం కోటింగ్ ఉన్న వాటిని కనిపెట్టడం కొంచెం కష్టం. బంగారానికి అయస్కాంత తత్వం ఉండదు. కాబట్టి అయస్కాంతంతో కూడా పరీక్షించవచ్చు. ఆభరణం ఆకర్షితమైతే అందులో ఇనుము లేదా ఇతర లోహాలు కలిశాయని అర్థం. అయితే ఇటువంటి ఇంటి పరీక్షల కంటే దగ్గరలోని షాపుల్లో మెషిన్ పరీక్ష చేయించడమే మెరుగయిన పద్ధతి. ★



"పడగొట్టేది కాదు నిలబెట్టేది భాష విడగొట్టేది కాదు కలిపి కుట్టేది భాష" (సి.నారె). "శబ్దమనే పేరు గల ఈ తేజస్సు సృష్టి ప్రారంభం నుండి ప్రకాశించ కున్నట్లయితే ఈ సమస్తమైన లోకత్రయం కటిక చీకటిగా అయి ఉండేది" (దండి కావ్య దర్శనం). 'వాక్కు సర్వ ప్రాధాన్యం కలది. వాక్కు లేనిచో సృష్టి లేదు. మనోభావములు చెప్పలేము. చెప్పలేనిచో పశువులము.మనలను పశువులుగా నుండనీయని దేవత సరస్వతి. ఆమె మనకు వాక్కును ప్రసాదించుచున్నది. ప్రధానంగా రెండే కనిపిస్తున్నవి. లోనున్న శక్తి, వెలికి వచ్చెడు మాట, మూడవది యింకొకటి యేమియును లేదు. సర్వదేవతలు ఈ రెండు శక్తుల యొక్క విభాగములే. మనుష్యుడు-మాట, ఈ రెంటి తరువాత ప్రపంచకమున్నది. సృష్టియున్నది" అని విశ్వనాథ తన సాహిత్య సురభిలో అంటారు.

మన భావాలను వ్యక్తం చేయడానికి ఉపయోగించే ప్రధాన సాధనం భాష. శాస్త్రాలన్నిటికీ మూలం భాష. శాస్త్రాభ్యాసానికి, కళాసాధనకూ ముఖ్యసాధనం భాష. వర్ణించడంలో నైపుణ్యం కలవాడు కవి. రస భావాలను చక్కగా పరిశీలించే వాడు కవి కాబట్టి ఆతని వర్ణన హృద్యంగా ఉంటుంది. ఆ వర్ణనకు సహృదయ పాఠకుడు ఆనందిస్తాడు. కవిత్వం ఒక కళ, అందాన్ని కొలిచేది, జీవితాన్ని శోభాయమానం చేసేది, నేర్పుతో చేసేది కళ. 'దేవతలను మాట్లాడమని అడిగితే ఇంగ్లిషులోనే మాట్లాడతారు' (If angels are asked to speak, they speak poetry) అని ఒక ఆంగ్లకవి అన్నాడు.

జగన్నాథ పండితరాయలు తన రసగంగా ధరంలో "రమణీయమైన అర్థాన్ని ప్రతిపాదించే శబ్దం కావ్యం" అన్నారు. కవిత్వం సౌందర్యం లయబద్ధమైన సృష్టి అన్నాడు ఎడ్గర్ ఎలన్ పో అనే అమెరికన్ రచయిత. కావ్యం ఎందుకు చదవాలి? అని ప్రశ్నించే వాళ్లకు, మమ్మాటాచార్యుడు తన కావ్య ప్రకాశములో..'కావ్యం యశసేర్థకృతే వ్యవహారనిదే శివేతరక్షతయే సద్యఃపర నిర్వ్రతయే కాంతా సంమిత తమోదేశయుజే" అని కావ్య ప్రయోజనాలను చెప్పాడు.

కవి కావ్యంలో విభిన్న పాత్రలను సృజించడం ద్వారా మానవుడు ఎలా ప్రవర్తించాలో తెలుపుతాడు. కావ్యాలలో మహాపురుషుల చరిత్రలను కవి వర్ణిస్తాడు. ఆ వర్ణన చదువుతున్నప్పుడు పాఠకులకు వ్యవహార జ్ఞానం కలుగుతుంది. "There are more men ennobled by study than by nature" పుట్టుకతో కంటే అధ్యయనం వలన ఉదాత్తీకరించబడ్డ వాళ్లే అనేకులు అన్నాడు సిసిరో (Iron sharpens Iron Scholar the Scholar). కావ్యం పాఠకులను సంస్కరిస్తుంది. వారిపై ప్రభావాన్ని చూపుతుంది.

కావ్యం వలన ఉపదేశం, హితోపదేశం కలుగుతాయి. ప్రియురాలు ప్రియుని మనస్సు నొప్పించకుండా సుకుమారమైన హావభావాలతో తాను చెప్పదలుచుకున్న విషయాన్ని చమత్కారంగా ఆనందదాయకంగా, 'శ్రీరామునిలా ఉండాలి కాని, రావణుని లా కాదు' అని హితబోధ చేసి సన్మార్గంలో నడిచేటట్టు చేస్తుంది.

''నుతజల పూరితంబులగు నూతులు నూఱిటికంటె సూనృత / వ్రత! మొక బావి మేలు, మఱి బావులు నూఱిటికంటె నొక్క స త్క్రతువది మేలు, తత్క్రతు శతంబున కంటె సుతుండ మేలు; త / త్సుత శతకంబు కంటెనొక సూనృత వాక్యము మేలు సూడగన్."

(ఆంధ్ర మహాభారతం-ఆది పర్వం 4-94)

దుష్యంతుడు శకుంతలను నిరాకరించినప్పుడు అతనికి ధర్మ ప్రభోదం చేస్తూ, సత్యవాక్యం గొప్పతనాన్ని వివరిస్తుంది. "సత్యవ్రతం గల ఓ రాజా! మంచినీళ్లున్న నూతులు నూరు కంటే ఒక బావి మేలు, నూరు బావులకంటే ఒక యజ్ఞం మేలు. అలాంటి నూరు యజ్ఞాల కంటే ఒక పుత్రుడు మేలు, అట్టి నూరుగురు పుత్రులకంటే ఒక సత్యవాక్యం మేలు" అని శకుంతలోపాఖ్యానంలో ఈ పద్యం తాత్పర్యం.

కనుగొని కోపవేగమున గన్నుల నిప్పులురాల, సంగము / లసలంగ సాంద్ర ఘర్మసలిలమ్ములు గ్రమ్మ నితాంత దంతపీ డన రట దాస్యరంగ వికట భ్రుకుటీచటుల ప్రవృత న / ర్తన ఘటనా ప్రకార భయద స్ఫురణా పరిణద్ధమూర్తియై

(విరాటపర్వం ద్వితీయ-133)

విరాటుని కొలువులో ద్రౌపదికి జరిగిన అవమానాన్ని, కీచకుని పొగరు బోతుతనాన్ని చూసిన

సాహిత్యం ప్రయోజనా

భీముని మనస్సులో కోపం తీవ్రంగా రేగడం వల్ల అతని కళ్ల నించి నిప్పులు రాలాయి.ఒళ్లంతా ఉడికి పోయింది.దట్టంగా చెమట చుక్కలు కమ్ముకున్నాయి. కోపంతో పళ్లు పటపటమనే ధ్వనులు. భీముని కోపాతిశయాన్ని ప్రదర్శించే ఈ పద్యం చదివితే రసానందం కలుగుతుంది.

ఎర్రాప్రగడ,సరస్వతీదేవికి నమస్కరించి ఆమెను స్తుతిస్తూ రాసిన పద్యం.

''అంబ! నవాంబు జోజ్జ్వల కరాంబుజ శారదచంద్ర చంద్రికా / డంబర చారుమూర్తి! ప్రకటస్ఫుట భూషణరత్నరోచిరా చుంబిత దిగ్విభాగ! శ్రుతి సూక్త వివిక్త నిజప్రభావభా / వాంబర వీది విశ్రుత విహారి! నసుంగ్రపజూడు భారతీ

(ఆంధ్రమహా భారతం అరణ్య 4-215)

'అమ్మా సరస్వతిదేవీ. కొత్త పద్మాలలాగా ప్రకాశించే చేతులు గలదానా, శరత్కాలంలోని వెన్నెల వెలుగువలె మిలమిలలాడే మనోహరమైన ఆకారంగల దానా, దిగ్దింతాల వరకు కాంతులు వెల్లివిరియజేసే రత్నభూషణలు కలదానా, వేదాలలోని సూక్తులలో చక్కగా వెల్లడించబడిన మహిమ కలదానా, భావాలు అనే ఆకాశవీధుల్లో ప్రశస్త రీతిలో విహరించేదానా నన్ను దయతో చూడు"

చదివితే కలిగే

లు ఏమి?

అని దీని తాత్పర్యం.

శ్రీకృష్ణ దేవరాయలు తమ ఆముక్తమాల్యద' (విష్ణుచిత్తీయము) ప్రబంధంలో...

"తెలుగదేల యన్న? దేశంబు తెలుగేను
తెలుగు వల్లభుండ దెలుగొకండ
యెల్ల నృపులు గొలువ నెరుగవేబాసాడి
దేశ భాషలందు దెలుగు లెస్స"..అన్నాడు.

'ప్రబంధాన్ని తెలుగులో ఎందుకు రాస్తున్నావు' అనే ప్రశ్నకు ఆయన ఇచ్చిన సమాధానం అది.

ఆధునిక యుగకర్తలలో ఒకరైన గురజాడ అప్పారావు...

'మంచి చెడ్డలు మనుజులందున
ఎంచి చూడగ రెండె కులములు
మంచి యన్నది మూలయైతే
మాల నేనగుదున్ (లవణరాజు కల)అనే ముత్యాలసరం గేయం, గురజాడ సంఘ సంస్కరణ దృష్టికి ఉదాహరణ

మరో యుగకర్త రాయప్రోలు సుబ్బారావు రాసిన..

"ఏ దేశమేగినా ఎందుకాలిడినా
ఏ పీఠమెక్కినా ఎవ్వరేమనినా
పొగడరా నీతల్లి భూమి భారతిని
నిలుపరా నీ జాతి నిండు గౌరవము" వంటి గేయాలు జాతీయ భావాన్ని రేకెత్తించాయి.

తెలుగు భాష, తెలుగు జాతి, తెలుగుదేశం గర్వించగల మహాకవి, కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ. తెలుగులోజ్ఞానపీఠ పురస్కార ప్రథమ గ్రహీత.

"అంతగా నోటితో నందము వ్రాయుడు
మంతగా నంతందమైన భాష
భాసించు వారి యుచ్ఛ్వాస నిశ్వాసముల్
వెలయించి యాయువు పెంచు భాష
పలు మాటలయ్యు సవ్వడి చేత జనముల
శీలమ్ము సవరించు మేలి భాష
చెట్ట యెంతగ పాదు చేయ నెంచిన
నైన నాపంత మొక్కవోనట్టి భాష....." పలుకులు మన భాష ఉన్నతిని, మాధుర్యాన్ని చాటిచెబుతున్నాయి.

"భరత ఖండంబు చక్కని పాడియావు
హిందువులు లేగదూడలై యేడ్చుచుండ
తెల్లవారను గడుసరి గొల్లవారు
పితుకు చున్నారు మూతులు బిగియగట్టి"

తెలుగు సాహిత్యంలో ప్రసిద్ధులైన దేశభక్త కవి చిలకమర్తి లక్ష్మీ నరసింహారావు రాసిన ప్రఖ్యాత పద్యమిది. 1905లో బెంగాలు విభజన అనంతరం బిపిన్ చంద్రపాల్ రాజమండ్రిలో పర్యటన సందర్భంగా సభలో ఆయన ఈ పద్యాన్ని సభలో చదివారు.

"ప్రతీ మనిషీ నడిచే దైవం
ప్రతీ పులుగూ ఎగిరే దైవం.
అడుగడుగున గుడి ఉంది
అందరిలో గుడి వుంది" దేవులపల్లి కృష్ణశాస్త్రి గేయమది.

అభ్యుదయ కవి శ్రీశ్రీ....

"ఊరుకుంటానా నేను / కసిగా కసాయిగా-
ఉపద్రవంలాగ ఉవ్వెత్తుగ లేచి .... సాయుధ విప్లవ బీభత్ససారథినై/ భారత కురుక్షేత్రంలో / నవయుగ భగవద్గీతా ఝుంఝుని ప్రసరిస్తాను / మంటలచేత మాట్లాడించి-రక్తం చేత రాగాలాపన చేయిస్తాను" (ఝుంఝు).

ఆధునికాంధ్రా కవిత్వంలో వచన కవితా పితామహుడు కుందుర్తి ఆంజనేయులు..

ప్రయోజనం తండ్రిగా
పరమసౌందర్యం తల్లిగా
పలికే ప్రతీవాక్కు రసానంద కల్పవల్లిగా
నాదారినాది.

దీనిలో "పరమ సౌందర్యం" అనే సమాసం కవిత్వం ఆనందాన్ని అందిచాలనే విషయం చెపుతున్నది ''నాదారి నాది'' అనే వంక్తి సృజనాత్మకతను సూచిస్తున్నది.

'ఓ నిజాము పిశాచమా! కానరాడు
నిన్ను బోలిన రాజు మాకెన్నడేని
తీగలను తెంపి అగ్నిలో దింపినావు
నా తెలంగాణ కోటి రతనాల వీణ' (అగ్నిధార).

కవిసింహం డా॥ దాశరథి పలికిన పల్కులివి. దానివలన జనంలో కలిగిన చైతన్యమే స్వేచ్ఛా సిద్ధికి దోహదం చేసింది.

"ఆరబోని దివ్వె నీవు వెలిగించాలి
వాడబోని తోట నీవు మొలిపించాలి
జాతి కొరకు నీ తనువును అర్పించేసి
చావును నీ బ్రతుకు నుండి తొలగించాలి" (దాశరథి రుబాయి)

జ్ఞానపీఠ పురస్కార గ్రహీతశ్రీ సి.నారాయణరెడ్డి గారు వ్రాసిన కవిత ఇది.

ఏది చూసినా లోతును ఇట్టే పసికట్టాలి
ఏది గీసినా కంటిని ఇట్టే చరపట్టాలి
ఏదో పరవాలేదని ఎందుకు ఆ గిట్టింపు
ఏది రాసినా గుండెను ఇట్టే గిలకొట్టాలి
ఏది చేసినా లోకం ఇట్టే జై కొట్టాలి (ప్రపంచ పదులు)

సాహిత్యం చదివితే హృదయాలూ మరింత సుందరంగా మధురంగా గంభీరంగా విశాలంగా ఉన్నతంగా వెలుగుతాయి. ఇంతకంటే లాభం ఏం కావాలి? చదివిన వాళ్లు విద్వాంసులై విశేష యశోవిరాజితులై శ్రీమంతులై సుఖమనుభవిస్తారు. ఇంతకంటే లాభం ఏం కావాలి? సాహిత్యం చదివితే అన్నీ లాభాలే. మనం చేసే తపస్సు వల్ల మనకు తేజస్సు కలుగుతుంది. సాహిత్యం చదవడమంటే ఒక తపస్సే. "తప: స్థితానాం సులభం హి సర్వమ్" తపస్సులో ఉన్నవాళ్లకి అన్నీ సులభమే. "తపో మూల మిదం సర్వం దైవ మానుషకం సుఖమ్" లోకంలో మానవులకు కలిగే దైవిక సుఖమైనా మానుష సుఖమైనా అతడు చేసుకున్న తపస్సు వల్లనే కలుగుతుంది.

మూలం:

1. సాహిత్యం ఎందుకు చదవాలి బై తిరుమల రామచంద్ర (యువభారతి ప్రచురణ) పేజి-1 టు 31

డా. కాశింశెట్టి సీత్యనారాయణ
విశ్రాంత ఆచార్యుడు

చొరబాటుదారులకు

గత కొద్ది వారాలుగా తట్టా బుట్టా సర్దుకొని కుటుంబాలతో తరలి వెళ్లిపోతున్న దృశ్యాలు భారత్ – బాంగ్లాదేశ్ సరిహద్దుల్లో కనిపిస్తున్నాయి. పశ్చిమ బెంగాల్‌లో బిజేపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచీ వారికి కష్టకాలం వచ్చిపడింది. బాంగ్లాదేశ్ నుంచి అక్రమంగా వచ్చి తిష్ఠవేసినవారిని తిరిగి పంపించేందుకు సువేందు అధికారి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు కలకలం రేపుతున్నాయి. వారిని జైళ్లలో పెట్టి పోషించేందుకు అల్లుళ్లు కాదని, పారిపోవడమే ఉత్తమమని హెచ్చరించారు. మరోవైపు అక్రమ చొరబాట్ల కారణంగా దేశంలో ఏర్పడిన సమస్యలను అధ్యయనం చేసేందుకు రిటైర్డ్ జడ్జి జస్టిస్ ప్రకాష్ ప్రభాకర్ నావ్లేకర్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేసింది కేంద్ర ప్రభుత్వం. దేశ సరిహద్దులకు 15 కిలోమీటర్ల పరిధిలో ఉన్న అక్రమ నిర్మాణాలన్నీ కూల్చివేయాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధికారులను ఆదేశించారు. అక్రమ వలసలు దేశ సార్వభౌమాధికారానికి, అంతర్గత భద్రతకు పెద్ద సవాలుగా మారాయని జనాభా సమతుల్యతను దెబ్బతీస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

పొరుగు దేశం నుంచి చొరబాట్లు పెరిగితే జనాభా సమతుల్యం దెబ్బతిని అంతర్గత భద్రతకు, శాంతిభద్రతలకు పెద్ద సవాలుగా మారుతుంది. భారీగా జరిగే చొరబాట్ల వల్ల స్థానిక ప్రాంతాలలో జనాభా నిష్పత్తి వేగంగా మారిపోయే అవకాశం ఉంటుంది. అక్రమ వలసల కారణంగా స్థానిక ఉపాధి, విద్య, వైద్యం, ఇతర ప్రభుత్వ వనరు లపై విపరీతమైన భారం పడుతుంది. వ్యూహాత్మకంగా జనాభా సమతుల్యతను దెబ్బతీయడానికి ఇటువంటి చర్యలను ఒక సాధనంగా వాడుతుంటారని అంతర్జాతీయ భద్రతా నిపుణులు చెబుతుంటారు. ప్రస్తుతం మన దేశం ఎదుర్కొంటున్న సమస్య ఇదే. ముఖ్యంగా బాంగ్లాదేశ్ నుంచి దశాబ్దాలుగా అక్రమ చొరబాట్లు కొనసాగాయి.

పశ్చిమ బెంగాల్ జనాభా సుమారు 10.06 కోట్లుకాగా అక్కడ బాంగ్లాదేశీ చొరబాటుదారులు కోటికి పైగా ఉండవచ్చని అంచనా. అస్సోం జనాభా సుమారు 3.68 కోట్లు కాగా బాంగ్లాదేశ్ నుంచి చొరబడ్డవారు 50 లక్షల దాకా ఉంటారని భావిస్తున్నారు. మూడు వైపులా బాంగ్లాదేశ్ సరిహద్దు ఉండే త్రిపుర మొత్తం జనాభా సుమారు 43 లక్షల వరకు ఉంటే అక్రమ చొరబాట్లు వేలల్లోనే ఉన్నాయని చెబుతున్నారు. మేఘాలయ, మిజోరం రాష్ట్రాల్లో కూడా ఇదే సమస్య ఉంది. అయితే ఇప్పుడు ఈ పరిస్థితిలో చాలావరకూ మార్పు వచ్చింది. ఇందుకు కారణం కొత కొన్నేళ్లుగా అస్సోం, త్రిపురలో బీజేపీ ప్రభుత్వాలు వచ్చాయి. మేఘాలయలో ఎన్డీయే, మిజోరాంలో ఎన్డీయే అనుకూల ప్రభుత్వాలున్నాయి. తాజాగా బాంగ్లాదేశీ చొరబాట్లు ఎక్కువగా జరిగే పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో కూడా బీజేపీ సర్కారు రావడంతో ఈ సమస్యకు ఇక తెరపడినట్లయింది.

గుర్తించు, తొలగించు, పంపించు..

'భారత్ ధర్మసత్రం కాదు.. చొరబాటుదారులను వదిలేద్దామా? వారు మన వనరులను దోచుకుంటుంటే చూస్తూ ఊరుకుందామా? బీజేపీ అధికారంలోకి రాగానే రాష్ట్రంలో అక్రమంగా నివసిస్తున్న చొరబాటుదారులను ఏరివేస్తాం. సరిహద్దు భద్రతను పటిష్టం చేస్తాం' పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో కేంద్రహోంమంత్రి అమిత్ షా చేసిన ప్రకటన ఇది. ఇప్పుడు బెంగాల్‌లో బీజేపీ అధికారంలోకి వచ్చింది. సువేందు ముఖ్య మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత దీన్ని ఆచరణలో చూపిస్తున్నారు. ముందుగా ఎన్నికల హామీల్లో కీలకమైన మిగిలిన బాంగ్లాదేశ్ సరిహద్దులో కంచె ఏర్పాటు కోసం అవసరమైన భూమిని బీఎస్ఎఫ్ కు బదిలీ చేయడానికి సువేందు అధికారి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. సరిహద్దు భద్రత, బాంగ్లాదేశ్ నుంచి చొరబాట్లను నియంత్రించడంలో భాగంగా భూమి బదిలీ ప్రక్రియను వెంటనే ప్రారంభించి, 45 రోజుల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

అక్రమ వలసదారులను ప్రత్యేకంగా వెతికి పట్టుకోవాల్సిన అవసరం లేదు. నిబంధనలు కఠినంగా అమలు చేస్తే, వారిలో అనేక మంది స్వయంగా వెనక్కి వెళ్లిపోతారంటూ ఎన్నికల సమయంలో బీజేపీ నేతలు అన్న మాటలు ఇప్పుడు నిజమవుతున్నట్లు కనిపిస్తోంది. బీజేపీ అధికారంలోకి రాగానే ఇదే పని మొదలుపెట్టింది. బెంగాల్‌లో అక్రమ వలసదారులు పొందుతున్న సంక్షేమ పథకాలను గుర్తించి, వాటిని నిలిపివేస్తున్నట్లు బెంగాల్ కొత్త ప్రభుత్వం ప్రకటించింది. అక్రమ వలసదారుల ఏరివేతకు "డిటెక్ట్, డిలీట్, డిపోర్ట్" (గుర్తించు, తొలగించు, పంపించు) విధానాన్ని అమలు చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. రాష్ట్రంలో అక్రమ వలసదారులను ఏరివేయడానికి జిల్లాల వారీగా జైళ్ల లాంటి 'హోల్డింగ్ సెంటర్లు' ఏర్పాటు చేసింది. బాంగ్లాదేశీయులు, రోహింగ్యాలను పట్టుకొని వారి వివరాలు తేలేదాకా అందులో ఉంచుతారు. వారి దగ్గర ఉన్న పత్రాలను పరిశీలించి బయోమెట్రిక్ వివరాలు సేకరిస్తున్నారు. ఈ తతంగం అంతా సీసీటీవీ, కట్టుదిట్టమైన భద్రత మధ్య కొనసాగుతోంది.

వారు ఇంటి అల్లుళ్లు కాదు..

పశ్చిమ బెంగాల్ లో బీజేపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత తమ మనుగడ కష్టమని బాంగ్లాదేశీ అక్రమ వలసదారులు అర్థమైపోయింది. దీంతో తమ సామానులంతా సర్దుకొని కుటుంబాలతో సహా బాంగ్లాదేశ్‌కు తిరిగివెళ్లిపోవడానికి సిద్ధమయ్యారు. సరిహద్దు దగ్గర పెద్ద నందడి కనిపిస్తోంది. హకీంపూర్ చెక్‌పోస్ట్ నుంచి మాల్డా వరకు పశ్చిమ బెంగాల్ అంతటా ఇవే దృశ్యాలు కనిపిస్తున్నాయి. వామపక్షాలు, తర్వాత తృణమూల్ సర్కారు వీరిని ఓటు బ్యాంకుగా భావించి ఇప్పించిన నకిలీ గుర్తింపు కార్డులు, పత్రాలతో ప్రభుత్వ సబ్సిడీలు, పథకాలతో లబ్ధి పొందారు. వాస్తవానికి ఎన్నికల సంఘం నకిలీ ఓట్ల తొలగింపు ప్రక్రియ చేపట్టినప్పుడే వీరి భయాలు, తిరిగి వెళ్లిపోవడాలు మొదలయ్యాయి. అయితే

కళ్లెం

మమతా బెనర్జీ ఇచ్చిన అభయంతో చివరి ఆశతో ఆగిపోయారు. ఆమె అధికారం కోల్పోవడంతో వీరి ధీమా చెదిరింది.

బాంగ్లాదేశీ వలసదారులను తిప్పిపంపడానికి అమలు చేస్తున్న డిటెక్ట్, డిలీట్, డిపోర్ట్ కార్యక్రమాన్ని పరిశీలించడానికి నదియా, హుగ్లీ, ఉత్తర 24 పరగణాల జిల్లా అధికారులతో సమీక్ష జరిపారు ముఖ్యమంత్రి సువేందు అధికారి. సరిహద్దులకు వెళ్లి

స్వయంగా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ క్రమంలో చేసిన హెచ్చరికలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. భారత్ లోకి అక్రమంగా ఎలా వచ్చారో, అలాగే వెళ్లిపోవాలని సూచించారు సువేందు. పట్టుకొని జైళ్లలో తిండి పెట్టి పోషించడానికి వారేమైనా ఇంటి అల్లుళ్లా? ఇందుకోసం ప్రజాధనం వృథా చేయడం ఇష్టం లేదని.. త్వరత్వరగా పారిపోండి అంటూ హెచ్చరికలు జారీ చేశారు.

సరిహద్దు చెక్ పోస్టుల దగ్గర బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ అధికారులు, సిబ్బంది వీరి పత్రాలు పరిశీలిస్తూ వంతుల వారీగా సరిహద్దు దాటివెళ్లిపోయే అవకాశం కల్పిస్తున్నారు. చొరబాటుదారులు తమంతట తామే తిరిగి వెళ్తున్నారు కాబట్టి ప్రభుత్వం వారిపై ఎలాంటి చట్టపరమైన చర్యలు తీసుకోదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు.

చొరబాట్ల అడ్డుకట్టకు కమిటీ

దేశంలో అక్రమ వలసలు, చొరబాట్ల కారణంగా జరుగుతున్న జనాభా నిష్పత్తిలో మార్పులను అధ్యయనం చేసి చర్యలు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. చట్టవిరుద్ధమైన వలసల వల్ల జరుగుతున్న జనాభా మార్పులు తీవ్రమైనవని ఎక్స్ వేదికగా అమిత్ షా తెలిపారు. సార్వభౌమత్వానికే కాకుండా జాతీయ భద్రత, అంతర్గత శాంతిభద్రతకు, గిరిజనుల ఉనికికి ముప్పుగా మారాయన్నారు. కేంద్రం నియమించిన కమిటీకి రిటైర్డ్ జడ్జి జస్టిస్ ప్రకాష్ ప్రభాకర్ నాయ్లేకర్ నాయకత్వం వహిస్తారు. కేంద్ర హోం శాఖ జాయింట్ సెక్రటరీ ఈ కమిటీకి మెంబర్ సెక్రటరీగా వ్యవహరిస్తారు. ఇంకా ఈ కమిటీలో మాజీ ఐఏఎస్ అధికారి దుర్గా శంకర్ మిశ్రా, మాజీ ఐపీఎస్ అధికారి బాలాజీ శ్రీవాస్తవ, ఆర్థికవేత్త శామికా రవి సభ్యులుగా ఉన్నారు.

ఈ కమిటీ మతపరమైన, సామాజిక వర్గాల స్థాయిలో జనాభా నిష్పత్తిలో వస్తున్న అసాధారణ మార్పుల తీరును విశ్లేషిస్తుంది. ఆపై దీనికి సంబంధించి ఒక ప్రణాళికాబద్ధమైన, కాలపరిమితితో కూడిన పరిష్కారాన్ని సూచిస్తుందని అమిత్ షా తెలిపారు. అందుబాటులో ఉన్న డేటా పోకడలను అధ్యయనం చేస్తుందని, సంబంధిత వర్గాలతో సంప్రదింపులు జరుపుతుందని అమిత్ షా చెప్పారు. అక్రమ వలసల వల్ల ఎదురవుతున్న సవాళ్లను ఎదుర్కొనేందుకు అవసరమైన విధానపరమైన మార్పులను సిఫారసు చేస్తుందన్నారు.కాగా ఈ కమిటీ ఆచరణాత్మక చర్యలపై దృష్టి సారిస్తూ, నిర్దేశిత గడువులోనే తన నివేదికను సమర్పించాల్సి ఉంటుందని అమిత్ షా స్పష్టం చేశారు. సమగ్రమైన సమాచారం, పటిష్టమైన నిర్ణయాల ద్వారా దేశ సమగ్రతను, సామాజిక నిర్మాణాన్ని కాపాడడానికి తాము కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు.

సరిహద్దుల్లో జనాభా మార్పులు జరగకుండా నిరోధించాల్సిన పూర్తి బాధ్యత బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ మీద ఉందన్నారు. పశువుల అక్రమ రవాణాను అడ్డుకోవడానికి పోలీసులు, జిల్లా యంత్రాంగాలతో కలిసి బీఎస్ఎఫ్ పనిచేయాలని సూచించారు. చొరబాటుదారుల రహస్య మార్గాలను గుర్తించి, వాటిని శాశ్వతంగా మూసివేయడం ద్వారా చొరబాట్లకు ముగింపు పలకాల్సిన సమయం ఆసన్నమైందని అమిత్ షా స్పష్టం చేశారు. అస్సాం త్రిపురలతో పాటు పశ్చిమ బెంగాల్ కొత్త ప్రభుత్వం అక్రమ చొరబాట్ల పట్ల వ్యతిరేకంగా కఠిన విధానాలను అనుసరిస్తున్నాయని గుర్తుచేశారు.

సరిహద్దు ఆక్రమణల కూల్చివేత

అక్రమ వలసల ప్రభావం ఇప్పుడు కేవలం సరిహద్దు ప్రాంతాలకే పరిమితం కాలేదని కేంద్ర హోంశాఖ తెలిపింది. వాటి ప్రభావం పట్టణ కేంద్రాలు, పారిశ్రామిక కారిడార్లు, గిరిజన ప్రాంతాలు, ఇతర సామాజికంగా, ఆర్థికంగా సున్నితమైన ప్రాంతాల వరకు విస్తరించిందని పేర్కొంది. సరిహద్దు ప్రాంతాల్లోని అన్ని బ్యాంకింగ్ లావాదేవీల్లో చట్టపరమైన, ఆర్థికపరమైన నిబంధనల అమలును పర్యవేక్షించాలని సూచించింది. పెద్ద పెద్ద వ్యాపార సంస్థలను తనిఖీ చేసి, వాటికి అందుతున్న నిధుల మూలాలను పరిశీలించాలని తెలిపింది. మ్యూల్ అకౌంట్లు, నకిలీ కంపెనీ కార్యకలాపాలను ఎప్పటికప్పుడు ట్రాక్ చేస్తూ ఉండాలని సూచించింది. నకిలీ ఆధార్ కార్డులను గుర్తించడంతో పాటు సరిహద్దుల గుండా జరిగే స్మగ్లింగ్‌ను పూర్తిగా అరికట్టాలని జిల్లా కలెక్టర్లను హోంశాఖ ఆదేశించింది. సరిహద్దు జిల్లాల్లో జరుగుతున్న నేరాలు, డ్రగ్స్ మహమ్మారి వెనుక ఉన్న నెట్‌వర్క్‌లపై లోతైన అధ్యయనం చేయాలని సూచించింది. సరిహద్దు ప్రాంతాల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ఆయా జిల్లా కలెక్టర్లకు అదనపు బాధ్యతలను అప్పగిస్తూ కేంద్ర హోంశాఖ ఆదేశాలు జారీ చేసింది.

మరోవైపు దేశ సరిహద్దులకు 15 కిలోమీటర్ల పరిధిలో ఉన్న అక్రమ నిర్మాణాలన్నీ కూల్చివేయాలని, ఈ విషయంలో రాజీలేని విధానాన్ని కఠినంగా అమలు చేయాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధికారులను ఆదేశించారు. ప్రతి సరిహద్దు జిల్లాకు పౌరులు, ప్రభుత్వ యంత్రాంగం, భద్రతా సంస్థలతో కూడిన 360-డిగ్రీల భద్రతా కవచాన్ని ఏర్పాటు చేయాలని చెప్పారు. చొరబాట్లు, మాదకద్రవ్యాల స్మగ్లింగ్, ఆక్రమణలు, ఉగ్రవాదానికి నిధులు సమకూర్చడం, ఇతర సరిహద్దు నేరాల వంటి సమస్యలను పరిష్కరించడానికి బీఎస్ఎఫ్, సీబీడీటీ, ఎన్‌సీబీ, ప్రభుత్వ యంత్రాంగం భాగస్వామ్యంతో సరిహద్దు నిర్వహణకు సమన్వయ విధానం అవసరమన్నారు. ఈ సమావేశంలో సరిహద్దు గ్రామాల్లో అన్ని ప్రభుత్వ పథకాలు నూటికి నూరు శాతం అందేలా చూడాలని అమిత్ షా ఆదేశించారు. అలాగే సైబర్ నేరాలను ఎదుర్కోవడానికి '1930' నంబర్‌తో గల కాల్ సెంటర్‌ను సమర్థవంతంగా ఉపయోగించు కోవాలని పిలుపునిచ్చారు.

క్రాంతిదేవ్ మిత్ర
సీనియర్ జర్నలిస్ట్

స్ఫూర్తిప్రదాతలు– ‘మన తెలుగు దీపికలు’



మన తెలుగు దీపికలు
సంపాదకుడు: వి.ఎస్. రాఘవాచారి
పుటలు: 136, **వెల:** రూ.150
ప్రతులకు: కళాదీపిక
తిరుపతి
మొబైల్: 99088 37451

తెలుగునాట వివిధ రంగాలలో లబ్ధప్రతిష్ఠుల గురించి అనేక వ్యాసాలు, జీవిత చరిత్రలు, ఏకవిషయక రచనలు (మోనోగ్రాఫ్స్) వచ్చాయి, వస్తాయి కూడా. అయితే వేటి ప్రత్యేకత వాటిదే. ఒక రచనకు మించి మరో రచనలో అదనపు విశేషాలు, ఆసక్తికర అంశాలు చోటు చేసుకుంటుంటాయి. ఈ ‘మన తెలుగు దీపికలు’ సంపుటిలోని వ్యాసాలను చదివితే, ‘రామాయణ కల్పవృక్షం’ ప్రష్ట కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ చేసిన నుఁవ్యాఖ్య న్ఫురిస్తుంది. ‘వాల్మీకి విరచిత శ్రీమద్రామాయణ కావ్యం మాతృకగా ఎందరో కవులు వివిధ కోణాలలో రామకథను ఆవిష్కరించినప్పుడు, మరో కావ్యం అవసరమా?’ అని ఆయన వద్ద కొందరు ప్రస్తావించగా, ‘మరల నిదేల రామాయణంబన్న ఈ ప్రపంచమెల్ల నెల్లవేళల తినుచున్న అన్నమే తినుచున్నదెపుడును, తన రుచి బ్రతుకులు తనవికాన, చేసిన నంసారమే చేయుచున్నది తనదైన అనూభూతి తనదికాన, తలచిన రామునే తలచెద నేనును నా భక్తి రచనలు నావిగాన’ అని వ్యాఖ్యానించారు. ప్రముఖులపై ఎవరెన్ని రచనలు చేసినా కొత్త సమాచారం చోటుచేసుకుంటూనే ఉంటుంది.

ముఖ్యంగా అలనాటి ప్రముఖులు, స్ఫూర్తి ప్రదాతల జీవిత విశేషాలను, విజయాలను నేటి తరానికి .... విశేషించి యువతరానికి తెలియచెప్పే ప్రయత్నమే ‘మన తెలుగు దీపికలు’ వ్యాససంపుటి ఉద్దేశ్యం. పాత్రికేయుడు, రంగస్థల నటుడు వీరవల్లి శ్రీనివాస రాఘవాచారి నిర్వహణంలోని ‘కళాదీపిక’ సౌజన్యంతో ఈ వ్యాస సంపుటి పాఠకుల ముందుకు వచ్చింది. వివిధ రంగాలకు సంబంధించి ఎందరో మహనీయులు ఉన్నా, గ్రంథ పరిమితి దృష్ట్యా స్థాలీపులాక న్యాయంగా ఆయా రంగాలకు చెందిన కొందరిని పరిచయం చేసినట్టుగా భావించాలి.అలా ఈ అయిదు పదుల ఈ వ్యాస సంపుటిలో కందుకూరి వీరేశలింగం పంతులు, గురజాడ అప్పారావు, పానుగంటి లక్ష్మీనరసింహారావు, రఘుపతి వేంకటరత్నం నాయుడు (సంఘ సంస్కర్తలు), కొక్కొండ వేంకటరత్నంపంతులు, గిడుగు రామమూర్తి, చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి, విశ్వనాథ సత్యనారాయణ, గుర్రం జాషువా, కట్టమంచి రామలింగారెడ్డి, చిలకమర్తి లక్ష్మీనరసింహం, మాడపాటి హనుమంతరావు, కొమర్రాజు లక్ష్మణరావు, రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ మల్లంవల్లి సోమశేఖరరావు, చిలుకూరి నారాయణరావు, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, (విద్యా, సాహితీవేత్తలు) కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు, ముట్నూరి కృష్ణారావు, సురవరం ప్రతాపరెడ్డి, (పాత్రికేయ ప్రముఖులు), ధర్మవరం రామకృష్ణమాచార్యులు, బళ్లారి రాఘవాచార్యులు, ఆదిభట్ల నారాయణ దాసు, ద్వారం వేంకటస్వామి నాయుడు, దామెర్ల రామారావు, (కళారంగం) టంగుటూరి ప్రకాశం పంతులు, పింగళి వెంకయ్య, భోగరాజు పట్టాభి సీతారామయ్య, అయ్యదేవర కాళేశ్వరరావు, బూర్గుల రామకృష్ణారావు, కల్లూరు సుబ్బారావు, తెన్నేటి విశ్వనాథం (రాజకీయ దిగ్గజాలు), డొక్కా సీతమ్మ, దువ్వూరి సుబ్బమ్మ, కందుకూరి రాజ్యలక్ష్మి, బండారు అచ్చమాంబ (మహిళారత్నాలు) తదితరుల గురించి ఉన్నాయి. ఈ వ్యాసాలు ఆయా ప్రముఖుల గురించి సమగ్ర అధ్యయనం చేసేందుకు స్ఫూర్తి నిస్తాయనడంలో సందేహంలేదు.

కొందరు ప్రముఖుల గురించి వ్యాసారంభంలో ఇచ్చిన పరిచయ పూర్వక పంక్తులు పాఠకునిలో ఆసక్తిని కలిగించేలా ఉన్నాయి.

‘సంఘసంస్కార కలవాలంగా మారి/వైధవ్యం మహమ్మారి గుండెచీరి/
దురాచార పంచితలకు దిద్దెను/నవ జీవన తిలకం కందుకూరి’; ‘తెలుగు జాతికి పరుపు/ప్రజల భాషకు ఎరువు గురజాడ...’;‘వెయ్యేళ్ల స్త్రీ చరిత్ర కథనహేల/అబలా సచ్చరిత్ర రత్నమాల/సంస్కర్త బందారు అచ్చమాంబ/మహిళాభ్యుదల చైతన్యజ్వాల’; ‘కోడి రామమూర్తి యనగ/కొండంత బలాఢ్యుడు/ఖ్యాతి గాంచె నతడు/ఖండాతరములయదు’ అందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

ప్రముఖులు గుంటూరు శేషేంద్రశర్మ (ధర్మవరం, పానుగంటి), అక్కిరాజు రమాపతిరావు, దామెర వేంకట సూర్యారావు (కందుకూరి రాజ్యలక్ష్మి), అడపా రామకృష్ణ (ముట్నూరి, సురవరం), వీఆర్ రాసాని (బళ్లారి), డాక్టర్ కేఐ వరప్రసాద్‌రెడ్డి (డా.ఎల్లప్రగడ సుబ్బారావు) వ్యాసాలతో పాటు పేరెన్నికగన్న రచయితల వ్యాసాలు ఇందులో చోటు చేసుకున్నాయి. అదే సమయంలో కొన్ని వ్యాసకర్తలు పేర్లు తెలియక పోవడం వల్ల పేర్కొనలేదని రచయిత నిజాయతీగా చెప్పారు. సాహిత్యాభిమానుల వితరణతో ఈ సంకలనం వెలువరించడాన్ని బట్టే, నాటి మహనీయుల ఉన్నతిని నేటి తరానికి తెలియచెప్పాలన్న సంపాదకుడి తపన వ్యక్తమవుతోంది.

అసంఖ్యాక ప్రాణకోటికి అన్నం జీవనాధారం. ‘అన్నం పరబ్రహ్మ స్వరూపం’ అని వేదవాక్కు. అంత పవిత్రమైన అన్నదానానికి ఆధునిక యుగంలో చిరునామాగా నిలిచిన డొక్కా సీతమ్మ వ్యాసంతోనే వ్యాస సంపుటి ప్రారంభం కావడం యాదృచ్ఛికం కావచ్చు. అంతేకాకుండా జీర్ణావస్థలో లభించిన ఆమె అరుదైన చిత్రానికి మెరుగులు దిద్ది అసలు చిత్రాన్ని అందించే ప్రయత్నం చేశారు.

ఈ వ్యాసాలు కొన్ని పుస్తకాల నుంచి, మరికొన్ని అంతర్జాలం,బ్లాగులు ,వికీపీడియా, వికీసోర్స్, ఫేస్‌బుక్, వాట్సాప్ గ్రూపులు, ఇతర మాధ్యమాల నుంచి ‘సేకరించినవే’ అంటూ సంకలనకర్త ‘కృతజ్ఞతా కుసుమాంజలులు’ సమర్పించడం అభినందనీయం. తమ సంస్థ ‘కళాదీపిక’ హితైషి, సాహితీవేత్త నల్లమిల్లి సూర్రెడ్డికి ఈ పుస్తకాన్ని అంకితమిచ్చారు.

సమీక్ష: డా॥ ఆరవేల్లి జగన్నాథస్వామి

జీవనయానంలో ప్రేమే పునాది

నాటి సమాజంలో "ప్రేమ" అనేది ఎంతో పవిత్రమైన భావనగా ఉండేది. ప్రేమ అంటే పరస్పర గౌరవం, బాధ్యత, త్యాగం, నమ్మకం, కుటుంబ బంధాల పరిరక్షణ. కానీ ఆధునిక కాలంలో ప్రేమకు కొత్త నిర్వచనాలు వచ్చాయి. ముఖ్యంగా సోషల్ మీడియా, వెబ్ సిరీస్, సినిమాలు, రీల్స్ ప్రభావంతో 'ట్రెండింగ్ రిలేషన్‌షిప్స్' అనే సంస్కృతి యువతలో వేగంగా పెరుగుతోంది. ఈ ప్రభావం కొన్నిసార్లు వ్యక్తిగత జీవితాలను, కుటుంబ వ్యవస్థను, పిల్లల భవిష్యత్తును తీవ్రంగా దెబ్బతీస్తోంది.

ఈ రోజు ఒకవైపు భార్యాభర్తలు తమ చిన్న చిన్న అసంతృప్తులను పెద్ద సమస్యలుగా మార్చుకుని కుటుంబాలను విడిచిపెడుతున్నారు. మరొకవైపు, ఇరవై సంవత్సరాలకుపైగా కలిసి జీవించిన దాంపత్య బంధాలను మధ్యలోనే తెంచుకొని, టీనేజ్ పిల్లలను అనాథలుగా మిగిల్చే ఘటనలు పెరుగుతున్నాయి. ఇది కేవలం వ్యక్తిగత నిర్ణయం మాత్రమే కాదు; సమాజపు విలువల పతనానికి సంకేతం.

ప్రస్తుతం సోషల్ మీడియా ఒక మాయ ప్రపంచాన్ని సృష్టిస్తోంది. రీల్స్‌లో కనిపించే ప్రేమ కథలు, సినిమాల్లో చూపించే స్వేచ్ఛా సంబంధాలు, "నువ్వు నీ హ్యాపీనెస్ కోసం జీవించు" అనే సందేశాలు చాలా మందిని ఆకర్షిస్తున్నాయి. కానీ ఆ కథల్లో చూపించని విషయం, మనిషిగా మన బాధ్యత. నిజ జీవితంలో ఒక నిర్ణయం, గెలుపు వెనుక పిల్లల కన్నీళ్లు ఉంటాయి, వృద్ధ తల్లిదండ్రుల బాధ ఉంటుంది, జీవిత భాగస్వామి మనోవేదన ఉంటుంది.

"రీల్ లైఫ్"లో రెండు నిమిషాల ప్రేమ కథ అందంగా కనిపించవచ్చు. కానీ "రియల్ లైఫ్"లో కుటుంబం అనేది కేవలం ఇద్దరి మధ్య బంధం కాదు; అది అనేక హృదయాల అనుబంధం. ఒక తల్లి తన పిల్లలను వదిలి మరొకరి వెంట వెళ్లిపోతే, ఆ పిల్లల మనసుల్లో ఏర్పడే గాయం జీవితాంతం మానదు. అలాగే, ఇరవై సంవత్సరాల దాంపత్యం తర్వాత ఒక తండ్రి కుటుంబాన్ని వదిలి వెళ్లిపోతే, టీనేజ్ పిల్లలలో తండ్రి అనే భావనపైనే నమ్మకం దెబ్బతింటుంది.

ఇటీవల సమాజంలో 'పర్సనల్ ఫ్రీడమ్' అనే భావనను చాలామంది తప్పుగా అర్థం చేసుకుంటున్నారు. స్వేచ్ఛ అంటే బాధ్యతల నుంచి పారిపోవడం కాదు. ఒక కుటుంబాన్ని నిర్మించుకున్న తర్వాత, పిల్లలకు తల్లిదండ్రులుగా మారిన తర్వాత, వ్యక్తిగత నిర్ణయాలు కేవలం వ్యక్తిగతంగా మిగలవు. అవి కుటుంబ భవిష్యత్తును ప్రభావితం చేస్తాయి.

ముఖ్యంగా టీనేజ్ పిల్లలు ఈ పరిస్థితుల్లో ఎక్కువగా నష్టపోతున్నారు. ఆ వయసులో వారికి తల్లిదండ్రుల ప్రేమ, మార్గదర్శకత్వం, మానసిక బలం అత్యంత అవసరం. కానీ కుటుంబ విభేదాలు, విడాకులు వంటివి వారి మనసుల్లో ఒంటరితనం, అసహనం, కోపం పెంచుతున్నాయి. కొంతమంది పిల్లలు డిప్రెషన్‌కు గురవుతున్నారు. మరికొందరు సంబంధాలపైనే నమ్మకం కోల్పోతున్నారు. వారి ముందున్న జీవితం అగమ్యగోచరంగా మారుతోంది.

ఇది కేవలం పట్టణాల సమస్య కాదు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా సోషల్ మీడియా ప్రభావం వేగంగా వ్యాపిస్తోంది. కుటుంబ విలువలు, పెద్దల మాట, సంస్కారం వంటి అంశాలు 'పాత ఆలోచనలు'గా కొందరు చూడటం ఆందోళనకరం. ఒకప్పుడు కుటుంబాన్ని కాపాడటానికి రాజీ పడేవారు. ఇప్పుడు చిన్న విభేదాలకే విడిపోవడం సులభమైపోయింది.

సమాజంలో ఎందరో పురుషులు తమ బాధ్యతలను విస్మరించి, వ్యసనాలకు లోనై భార్యా పిల్లలను గాలికి వదిలేసిన పరిస్థితులను మనం ఎన్నో చూస్తున్నాం. ఈనాటి ప్రపంచంలో బాహ్య ప్రలోభాలకు లోనై తప్పుడు నిర్ణయాలతో, క్షణికావేశంలో భర్త పిల్లలను వదిలి ప్రియుడితో జీవించడానికోసం గడపదాటుతోంది. తప్పు తెలుసుకొని తిరిగి భర్త, పిల్లల కోసం వెన్నక్కివస్తే ఆమెను కుటుంబం, సమాజం వెలివేస్తోంది. మగవాడికి ఇచ్చిన స్వేచ్ఛ ఆడదానికి లేదు. కానీ, మారుతున్న సమయంతో పాటు ఆడవారిని క్షమించగలిగితే, ప్రాయశ్చిత్తం చేసుకోవడానికి అవకాశం దొరుకుతుంది.

అయితే, ఈ సమస్యకు పరిష్కారం కచ్చితంగా ఉంది. మనమందరం సోషల్ మీడియా, కనీసం ఫోన్ కూడా లేని రోజుల్లో ఎంతో సంతోషంగా జీవించారు.

మొదటిగా, కుటుంబ వ్యవస్థలో సంభాషణ పెరగాలి. భార్యాభర్తలు ఒకరినొకరు అర్థంచేసుకుంటూ గౌరవంతో జీవించాలి. సమస్యలను బయట సంబంధాల్లో కాదు, పరస్పర చర్చల్లో పరిష్కరించుకోవాలి. పిల్లల ముందు గొడవలు తగ్గించాలి.

కుటుంబంలో చిన్న చిన్న కోపతాపాలకు వెంటనే స్పందిస్తాము, కానీ మెచ్చుకోవడానికి మాత్రం అవకాశాలు వెతకము. దీని ప్రభావం వల్ల ఎన్నో మనస్తాపాలు, అపార్థాలు చోటుచేసుకుంటాయి.

రెండవది, సోషల్ మీడియాను వినోదంగా మాత్రమే చూడాలి. రీల్స్‌లో కనిపించే ప్రతి సంబంధం నిజజీవితానికి ఆదర్శం కాదు. సినిమాల్లో రెండు గంటల్లో ముగిసే కథలు, నిజ జీవితంలో జీవితాంతం బాధను మిగల్చవచ్చు.

మూడవది, పిల్లలకు చిన్నప్పటి నుంచే కుటుంబ విలువలు, బాధ్యత, నిబద్ధత గురించి

సమాజం

చెప్పాలి. ప్రేమ అంటే కేవలం ఆకర్షణ కాదని, అది బాధ్యతతో కూడిన అనుబంధమని వారికి అర్థమయ్యేలా చేయాలి. పిల్లలపైన అనవసర పోటీ ప్రపంచంలో ఒత్తిడికి బలిచేయకూడదు.

నాలుగవది, సమాజం కూడా తీర్పు చెప్పడం కంటే మార్గనిర్దేశనం చేయాలి. కొన్నిసార్లు ఒంటరితనం, మానసిక ఒత్తిడి, భావోద్వేగ లోపం వల్ల కూడా వ్యక్తులు తప్పు నిర్ణయాలు తీసుకుంటారు. అలాంటి సందర్భాల్లో కుటుంబ సభ్యులు, స్నేహితులు, కౌన్సిలర్లు సహాయం చేయాలి.

మన భారతీయ సంస్కృతి కుటుంబ వ్యవస్థపై నిర్మించబడింది. తల్లిదండ్రుల త్యాగం, పిల్లల బాధ్యత, దాంపత్య బంధం, ఇవే మన సమాజానికి బలమైన ఆధారాలు. ఈ విలువలు క్రమంగా కనుమరుగైతే, భవిష్యత్ తరాలు భావోద్వేగంగా బలహీనపడే ప్రమాదం ఉంది.

ప్రేమ తప్పు కాదు. కొత్త సంబంధాలు కూడా తప్పు కావు. కానీ బాధ్యతలను మరిచి, పిల్లల జీవితాలను పణంగా పెట్టి తీసుకునే నిర్ణయాలు మాత్రం సమాజాన్ని విచ్ఛిన్నం చేస్తాయి. నిజమైన ప్రేమ ఎప్పుడూ నిర్మిస్తుంది; ధ్వంసం చేయదు. నిజమైన సంబంధం బాధ్యతను పెంచుతుంది; బాధ్యత నుంచి పారిపోదు.

ఈ తరానికి అత్యంత అవసరమైనది "విలువలతో కూడిన స్వేచ్ఛ". మనసుకు నచ్చినట్లు జీవించడం కంటే, మన వల్ల ఇంకెంత మంది జీవితం ప్రభావితమవుతుందో ఆలోచించే పరిపక్వత అవసరం. రీల్స్ ముగిసిన తర్వాత కూడా జీవితం కొనసాగుతుంది. కానీ ఒక తప్పు నిర్ణయం వల్ల పగిలిన కుటుంబం, ఏడ్చే పిల్లలు, ఒంటరైన జీవితాలు మాత్రం సులభంగా మళ్లీ కలవవు.

కాబట్టి, ప్రేమను గౌరవిద్దాం. కుటుంబాన్ని కాపాడుదాం. బాధ్యతతో కూడిన సంబంధాలను నిర్మిద్దాం. ఎందుకంటే సమాజాన్ని నిలబెట్టేది కేవలం ట్రెండ్స్ కాదు, మనిషిని చివరిదాకా కాపాడే విలువలు.

డా॥ జె.పి. భారతి కాజా

పర్యావరణం

ప్రపంచవ్యాప్తంగా ప్రతికూల వాతావరణ మార్పులు చోటుచేసుకుంటున్నాయి. వాతావరణ ప్రతికూల మార్పులతో ఉష్ణోగ్రతలు పెరగడం, కరువుకాటకాలు, అకాల వర్షం, వడగళ్లు పడటం, వరదలు రావడం, తుఫాన్లు రావడం, భూతాపం, కార్బన్ ఉద్గారాల ప్రభావాలు తీవ్రమవుతాయి. తీవ్ర వేడి గాలులు వీయడం, నీటి ఎద్దడి దుస్థితులు రావడం, సముద్ర మట్టాలు పెరగడం, మానవాళి ఆహార అభద్రత కోరల్లో చిక్కడంగా పరిణమిస్తుంది. పర్యావరణ కాలుష్యం పెరగడం, మానవ వలసలు పెరగడం, జీవ వైవిధ్యానికి విఘాతం వాటిల్లడం, వర్షపాతాల్లో హెచ్చుతగ్గులు బయటపడడం లాంటి పలు దుష్ఫలితాలు సంభవిస్తున్నాయి. ప్రతికూల వాతావరణ మార్పులను అరికట్టకపోతే ప్రపంచ మానవాళి బతుకులు తీవ్ర సంక్షోభంలో పడడం ఖాయమని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

'సూపర్ ఎల్ దుష్ప్రభావం

భూగోళంపై ఈ ఏడాది అతి బలమైన ఎల్ నినో ఏర్పడవచ్చనే చేదు విషయాన్ని స్కైమెట్ తాజా నివేదిక బహిర్గతం చేసింది. పసిఫిక్ మహా సముద్రంలో జలాలు సాధారణం కన్న అధికంగా వేడెక్కడాన్ని 'ఎల్ నినో' అంటారు. సాధారణం కన్న 2.5 డిగ్రీల ఎక్కువగా సముద్ర నీటి ఉష్ణోగ్రతలు పెరడాన్ని 'సూపర్ ఎల్ నినో' అని పిలుస్తున్నారు. ఎల్ నినో వల్ల జూన్ 2026 నుంచి వాతావరణ

జన్మ సార్థకత

ఆధ్యాత్మిక ప్రయాణాన్ని గురించి చెప్పుకునేప్పుడు మనం సులువుగా మనకు అర్థం కాని ఈ పదాలను మనం అర్థంచేసుకోవాలి. భక్తి, ముక్తి, రక్తి, అనురక్తి, విరక్తి, విముక్తి అనే ఆరు పదాలు ప్రాపంచిక బంధాల నుండి దైవత్వం వైపు నడిపే పరిణామానికి ప్రతీకలు.

మానవ జీవన ప్రయాణంలో ఈ ఆరూ మైలురాళ్లు.

మానవుడు సంసార చక్రం నుండి ఎలా విముక్తి పొందాలో ఈ ఆరు సూత్రాల ద్వారా తెలుసుకోవచ్చు. ఒక్కో దానినీ దాటుకుంటూ ఒక్కోమైలురాయిని అధిగమిస్తూ వెళ్లడం తేలికైన మార్గం.

మొదటిది - రక్తి

రక్తి అంటే అనురక్తి, ప్రేమాతిశయం అనవచ్చు. మానవ జీవితం 'రక్తి'తో ప్రారంభమవుతుంది. రక్తి అంటే ఇంకా ఇలా చెప్పుకోవచ్చు. బాహ్య ప్రపంచంపై, భోగభాగ్యాలపై, ప్రాపంచిక విషయాలపై ఉండే మోహం లేదా ఆకర్షణ. ఆహారము, దుస్తులు, ధనము, నగలు, అధికారము సుఖసంతోషాలపై ఆసక్తితో మానవుడు సంసారంలో, భౌతిక సుఖాలలో మునిగితేలడాన్ని ఇది సూచిస్తుంది. అయితే ఇది కేవలం తాత్కాలికమైన ఆనందాన్ని మాత్రమే ఇస్తుంది. ఆ విషయం మానవుడు గ్రహించాలి. ఆ గ్రహింపే అతడిని మొదటి మైలురాయిని దాటిస్తుంది.

రెండవది అనురక్తి -

అంటే ఇష్టము, అనురాగము, అభిమానము.

భౌతిక వస్తువులపై ఉండే రక్తి అంటే మోహం, క్రమంగా ఈ భావన దేవుని వైపు తిరిగినప్పుడు అది 'అనురక్తి'గా మారుతుంది. అంటే దైవం పట్ల పుట్టే గాఢమైన ప్రేమ ఇంకా అనుబంధం. ప్రాపంచిక విషయాల కంటే భగవంతుడే మిన్న అనే భావన ఇక్కడే మొదలవుతుంది.

నినో, చూడనున్నామా!

ప్రతికూల మార్పులు జరగవచ్చని, ఉష్ణోగ్రతలు భారీగా పెరిగి అసాధారణ రుతుపవనాల గమనం జరుగుతుందని నివేదిక రూపంలో స్పష్టం చేశారు. ఎల్ నినో ప్రభావంతో గాలుల దిశ మారిపోయి ప్రతికూల వాతావరణ మార్పులకు ఆజ్యం పోయవచ్చని అంచనా వేశారు. మే మాసంలో ఏర్పడే ఎల్ నినో ఆగష్టు నాటికి బలపడి సూపర్ ఎల్ నినో ఏర్పడే అవకాశం ఉందని తెలుస్తున్నది. ఎల్ నినో ప్రభావంతో అధిక ఉష్ణోగ్రతలు, వర్షపాతంలో ప్రతికూల మార్పులు, సముద్ర తుఫాన్లు, కరువు కాటకాలు లాంటి దుష్ప్రభావాలు రావచ్చని గమనించాలి.

స్కైమెట్ వాతావరణ సంస్థ తాజా నివేదిక ప్రకారం, 2026లో భారత దేశంలో రుతుపవనాలు సాధారణం కన్న తక్కువగా ఉండవచ్చని అంచనా వేసింది. ఈ ఏడాది జూన్-సెప్టెంబర్ 2026 సీజన్‌లో సాధారణం కంటే 6 శాతం (దీర్ఘకాల సగటులో 94 శాతం వర్షపాతం) వర్షపాతం నమోదు కావచ్చని స్పష్టం చేసింది. ఎల్ నినో ప్రభావంతో రెండో సీజన్‌లో జూలై-సెప్టెంబర్ 2026లో రుతుపవనాలు బలహీనపడవచ్చని సంస్థ అధ్యయనం వెల్లడించింది.

జూన్‌లో సాధారణ వర్షాలు పడినప్పటికీ రెండవ సీజన్‌లో వర్షాలు బలహీనపడతాయని నిపుణులు అంచనా వేశారు. ఈ వేసవిలో వాయవ్య, మధ్య, తూర్పు భారతంలో సాధారణం కంటే అధిక వేడి ఉంటుందని తేల్చారు. 2026లో నాలుగు నెలల కాలంలో రుతుపవన వర్షపాతం సగటున 817 మి.మీ ఉంటుందని అంచనా. దీని వల్ల దేశంలో 30 శాతం కరువు రావచ్చని అంటున్నారు. జూన్ మాసంలో సాధారణ వర్షపాతం నమోదు అయ్యే అవకాశం ఉన్నప్పటికీ జూలై, ఆగష్టు, సెప్టెంబర్లలో తక్కువ వర్షాలు పడతాయని నివేదికలో వెల్లడించారు.

ఇప్పటికే సూర్యుడు సుర్రుమంటున్నాడు. అకాల వర్షాలు అన్నదాత రోదనలకు కారణమవుతున్నాయి. చేతికి వచ్చిన పంట నేలపై వాలి పోయింది. ఆరుగాలం కష్టపడిన రైతన్న కంట కన్నీటి వరదలు పారుతున్నాయి. అతివృష్టి, అనావృష్టి, అకాల వర్షాలు, వడగళ్ల వానలతో హలధారి విలవిల్లాడు తున్నాడు. పుండు మీద కారం చల్లినట్లు రానున్న రోజుల్లో సూపర్ ఎల్ నినో బలపడితే కరువు కరాళ నృత్యం చేయవచ్చు. ఆహార భద్రత ప్రమాదంలో పడవచ్చు. ప్రతికూల కారణాలను తెలుసుకొని, అరికట్టే ప్రయత్నాలు చేయని పక్షంలో విశ్వ మానవాళి సంక్షోభ సంకెళ్లలో పడి హాహాకారాలతో ఆఖరి శ్వాస తీసుకోవచ్చు. రాబోయే కరువులను ఎదుర్కొనే చర్యలను నేటి నుండే మొదలు పెడదాం, రేపటి ఆరోగ్యకర వాతావరణానికి నేటి నుంచే హారతి పడదాం.

డా. బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

మూడవది భక్తి

అనురక్తి పరిణతి చెందినప్పుడు అది 'భక్తి'గా రూపాంతరం చెందుతుంది. భక్తి అంటే కేవలం పూజలు చేయడం కాదు, కొబ్బరికాయలు కొట్టడం, నైవేద్యాలు పెట్టడంకాదు. భగవంతుడిని సంపూర్ణంగా నమ్మడం, సర్వస్వం ఆయనదే అని భావించడం. నిస్వార్థమైన ప్రేమే భక్తి. సృష్టిలోని ప్రతి జీవిలోనూ దైవాన్ని చూడటమే నిజమైన భక్తి. సర్వకార్యాలు భగవంతునివే అనిచేయడం. ఎట్టి షరతులూ లేకుండా, అంటే వందకొబ్బరికాయలు కొడితే ప్రమోషన్ లేకపోతే ఉద్యోగంలో షరతులు లేకుండా విశ్వాసంతో మన పనులు చేసుకోడం. ప్రతిఫలాపేక్ష లేకుండా అన్ని పనులూ నిర్వహించడం.

నాలుగవది విరక్తి -

అంటే విరాగము, వైరాగ్యము

భక్తి హృదయంలో స్థిరపడినప్పుడు, ప్రాపంచిక సుఖాలపై ఉన్న వ్యామోహం దానంతట అదే తొలగిపోతుంది. దీనినే 'విరక్తి' లేదా వైరాగ్యం అంటారు. లౌకిక విషయాలు శాశ్వతం కావనే సత్యాన్ని గ్రహించి, వాటిపై ఆశను తగ్గించుకుంటూ క్రమేపీ వదిలి పెట్టడం. "వైరాగ్యం అంటే అడవులకు వెళ్లడం కాదు, సంసారంలో ఉంటూనే దేనికీ బందీ కాకుండా ఉండటం".

ఐదవది విముక్తి

విరక్తి కలిగిన సాధకుడికి లౌకిక బంధాల నుండి, అరిషడ్వర్గాలైన కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాల నుండి విడుదల లభిస్తుంది. దీనినే 'విముక్తి' అంటారు. అంటే భ్రమల నుండి, అజ్ఞానం నుండి మనస్సు విముక్తం కావడం.

చివరిది ముక్తి

ఈ ఆధ్యాత్మిక ప్రయాణంలో ఆఖరి మెట్టు 'ముక్తి' లేదా మోక్షం. ముక్తి అంటే జనన మరణ చక్రం నుండి శాశ్వత విడుదల పొంది, జీవాత్మ పరమాత్మలో లీనమవడం. తాను వేరు, దేవుడు వేరు కాదనే "అద్వైత" స్థితిని – అహం బ్రహ్మాస్మి– అనే భావనను అనుభూతి చెందడమే ముక్తి.

మానవుడు 'రక్తి'– భోగం–తో జీవితాన్ని వృథా చేసుకోకుండా, 'అనురక్తి', 'భక్తి' మార్గాల ద్వారా 'విరక్తి'ని సాధించి, తద్వారా 'విముక్తి'ని పొంది, చివరకు 'ముక్తి' అనే పరమార్థాన్ని చేరుకోవాలి. ఇదే మానవ జన్మకు సార్థకత.

ఆదూరి హైమవతీ శ్రీనివాసరావు
పుట్టపర్తి

రైల్వేలో కీలకం కాజీపే

తెలంగాణ ప్రజల దశాబ్దాల ఆకాంక్ష, వరంగల్ ప్రాంత ప్రజల చిరకాల డిమాండ్, రైల్వే ఉద్యోగుల నిరంతర పోరాటం, బీజేపీ నాయకుల పట్టుదల ఫలితంగా కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ స్వప్నం సాకారమైంది. ఇప్పటివరకు కేవలం రైల్వే జంక్షన్‌గా గుర్తింపు పొందిన కాజీపేట, ఇప్పుడు దేశ రైల్వే తయారీ రంగంలో కీలక కేంద్రంగా అవతరించబోతోంది. అత్యాధునిక రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌కు నెలవుగా మారనుంది. రూ.716 కోట్ల వ్యయంతో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైల్వే రోలింగ్ స్టాక్ తయారీ యూనిట్, రాష్ట్ర పారిశ్రామిక చరిత్రలో మైలురాయిగా నిలవనుంది.

కాజీపేట పేరు వినగానే ముందుగా గుర్తుకు వచ్చేది రైల్వే. ఇది బ్రిటిష్ కాలం నుంచే దక్షిణ మధ్య రైల్వే జోన్‌లో అత్యంత కీలకమైన కూడలి. (రైల్వే జంక్షన్). దేశంలోని ఉత్తర, దక్షిణ, తూర్పు, పశ్చిమ ప్రాంతాలను కలిపే రైల్వే మార్గాల మధ్యలో ఉంది. హైదరాబాద్–విజయవాడ, ఢిల్లీ–చెన్నై, నాగ్‌పూర్–కాజీపేట వంటి ప్రధాన మార్గాలన్నీ ఈ కూడలి మీదుగానే వెళతాయి. ఫలితంగా లాజిస్టిక్స్ పరంగా ఇది అనువైన స్థానం. ముడిసరుకు రవాణా మొదలుకొని, తయారైన రైళ్లను పంపిణీ చేయడం వరకు అన్ని విషయాల్లోనూ కాజీపేట అనుకూలమైన భౌగోళిక స్థానంలో ఉంది. ఇక్కడి రైల్వే వర్క్‌షాప్ దాదాపు 150 సంవత్సరాల చరిత్ర కలిగి ఉంది. రైల్వే నిర్వహణ, మరమ్మతులు, సాంకేతిక పనుల్లో కాజీపేటకు దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు ఉంది. ఇలాంటి ప్రాంతంలో రైల్వే తయారీ యూనిట్ ఏర్పాటు చేయడం వెనుక వ్యూహాత్మక ఆలోచన ఉంది. ముడిసరుకు రవాణా, తయారైన రైళ్ల పంపిణీ, సాంకేతిక నిపుణుల లభ్యత, రైల్వే మౌలిక వసతులు.. అన్నీ ఒకే చోట అందుబాటులో ఉండటం కాజీపేటకు ప్రత్యేక బలం.

కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ డిమాండ్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నాటి నుంచే ఈ వినిపిస్తోంది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ కాలంలో ఈ డిమాండ్ మరింత బలంగా ముందుకు వచ్చింది. రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ఈ అంశం చర్చల్లో నిలిచి, పార్లమెంట్‌లో పలుమార్లు ప్రస్తావనకు వచ్చింది. అయితే, అప్పటి కేంద్ర ప్రభుత్వం ఈ డిమాండ్‌ను పెద్దగా పట్టించుకోలేదు.

కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించడం విషయం కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ విషయంలో స్పష్టంగా కనిపిస్తోంది. రూ.716 కోట్లు కేటాయించడం మాత్రమే కాదు...ఈ యూనిట్‌కు దేశవ్యాప్తంగా సరఫరా చేయాల్సిన 200 ఇంటర్‌సిటీ రైళ్ల తయారీ బాధ్యత అప్పగించడం అంటే.. తెలంగాణకు లభించిన అసాధారణ గౌరవంగా చెప్పుకోవచ్చు అంటున్నారు రాజకీయ విశ్లేషకులు. రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్, రైల్వే శాఖ సహాయ మంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టు ఉన్నతాధికారులతో కలిసి కాజీపేట యూనిట్ నిర్మాణ పురోగతిపై నేరుగా సమీక్ష నిర్వహించారు. ఈ యూనిట్‌ను రైల్వే శాఖ దేశంలోని అత్యాధునిక తయారీ కేంద్రాల్లో ఒకటిగా అభివర్ణిస్తోంది.

అత్యాధునిక సాంకేతికత

కాజీపేటలో తయారయ్యే ఇంటర్‌సిటీ రైళ్లు భారతీయ రైల్వే ఆధునికీకరణలో కీలక పాత్ర పోషించనున్నాయి. ఒక్కో రైలులో 20 కోచ్‌లు ఉంటాయి. గంటకు గరిష్ఠంగా 130 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే సామర్థ్యం కలిగి ఉంటాయి. దేశవ్యాప్తంగా 300 కిలోమీటర్లలోపు దూరాలను వేగంగా, సౌకర్యవంతంగా కలిపే లక్ష్యంతో ఈ రైళ్లను రూపొందిస్తారు. పట్టణాలు–నగరాల మధ్య షటిల్ సర్వీసుల మాదిరిగా పని చేస్తాయి. విద్యార్థులు, ఉద్యోగులు, ఆరోగ్య సేవల కోసం వెళ్లే సామాన్య ప్రజలకు, పండుగుల సమయంలో అధిక రద్దీని తట్టుకు నేందుకు ఇవి అత్యంత ఉపయుక్తంగా ఉంటాయి.
సాంకేతికంగా ఈ రైళ్లలో చాలా విశేషాలున్నాయి. ఆటోమేటిక్ డోర్ వ్యవస్థ అంటే.. రైలు కదులుతున్న సమయంలో తలుపులు స్వయంచాలకంగా మూసుకుపోతాయి. ఇది ప్రమాదాలను తగ్గిస్తుంది. తక్కువ కుదుపులు, తక్కువ శబ్దం, మెరుగైన వెంటిలేషన్‌తో ప్రయాణం మరింత సౌకర్యవంతంగా ఉంటుంది. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా భద్రతా వ్యవస్థలు అమర్చనున్నారు. ప్రతి కోచ్‌లో రెండు ఆధునిక మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తారు. ఈ రైళ్లలో డిజిటల్ సమాచార వ్యవస్థను అందుబాటులోకి తెస్తారు. ప్రయాణికులకు స్టేషన్లు, సమయాలు, ఇతర వివరాలు డిజిటల్ రూపంలో అందుబాటులో ఉంటాయి.

పర్యావరణ హితం

ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ అనుకూల రవాణా వ్యవస్థలకు ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో,కాజీపేటలో తయారయ్యే రైళ్లు కూడా

ట కూడలి

అదే దిశగా రూపుదిద్దుకుంటాయి. రీజెనరేటివ్ బ్రేకింగ్ సిస్టమ్ ద్వారా బ్రేకులు వేసిన సమయంలో ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ని తిరిగి గ్రిడ్‌కు పంపుతారు. ఈ విద్యుత్ ను తిరిగి వినియోగించుకోవచ్చు. ఫలితంగా విద్యుత్ వినియోగం, నిర్వహణ ఖర్చులు, కార్బన్ ఉద్గారాలు తగ్గి పర్యావరణానికి మేలు జరుగుతుంది. ఇది భారతీయ రైల్వే గ్రీన్ ట్రాన్స్‌పోర్ట్ లక్ష్యాలకు అనుగుణంగా ఉంటుంది.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతీయ రైల్వేలు గత కొన్నేళ్లుగా వేగంగా ఆధునికీకరణ దిశగా సాగుతున్నాయి. వందే భారత్, అమృత్ భారత్ స్టేషన్లు, ప్రత్యేక సరుకు రవాణా కారిడార్లు, హైస్పీడ్ రైలు ప్రాజెక్టులు వంటి కార్యక్రమాల సరసన ఇప్పుడు కాజీపేట రైల్వే తయారీ కేంద్రం కూడా చేరింది. ఈ యూనిట్‌లో రాబోయే ఐదేళ్లలో 200 ఆధునిక ఇంటర్‌సిటీ రైళ్లను తయారు చేయనున్నట్లు రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటించడం, కాజీపేటకు దేశీయ రైల్వే రంగంలో ఎంత కీలకమైన స్థానం లభించిందో స్పష్టం చేస్తోంది. ఇది కేవలం ఒక పరిశ్రమే కాదు... తెలంగాణ ఆర్థికాభివృద్ధి, ఉపాధి కల్పన, పారిశ్రామిక విస్తరణ, సాంకేతిక పురోగతి, ప్రాంతీయ సమతుల అభివృద్ధికి కేంద్రంగా మారబోయే ఒక మహత్తర ప్రాజెక్టు.

ఈ యూనిట్ విజయవంతమైతే భవిష్యత్తులో మరిన్ని విభాగాలు కూడా ఇక్కడ ఏర్పాటు చేసే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. కోచ్

అశ్వినీ వైష్ణవ్

ఆధునికీ కరణ కేంద్రాలు, హైస్పీడ్ రైలు భాగాల తయారీ, ఎలక్ట్రిక్ రైలు సాంకేతిక యూనిట్లు, పరిశోధన, అభివృద్ధి కేంద్రాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణ సంస్థలు స్థాపించేందుకు అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో కాజీపేట దేశంలోని ప్రముఖ రైల్వే పారిశ్రామిక నగరాల్లో ఒకటిగా ఎదిగేందుకు అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి.

ఇప్పటివరకు వరంగల్‌ను కాకతీయుల చరిత్ర, విద్యా కేంద్రం, సాంస్కృతిక వారసత్వం, వ్యవసాయ ప్రాంతంగా గుర్తించేవారు. కానీ.. రాబోయే రోజుల్లో.. దీనిని రైల్వే తయారీ కేంద్రం, ఇంజినీరింగ్ హబ్, పారిశ్రామిక పెట్టుబడుల కేంద్రం, సాంకేతిక నైపుణ్యాల అభివృద్ధి కేంద్రం వంటి కొత్త గుర్తింపులు కూడా జత కానున్నాయి.

రాష్ట్ర ఆర్థిక రంగానికి ఊతం

కాజీపేట రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ కేవలం రైళ్లు తయారు చేయడానికి మాత్రమే పరిమితం కాదు. స్థానికులకు, అలాగే, నిపుణులకు ప్రత్యక్ష ఉపాధి లభిస్తుంది. ఇంజినీర్లు, టెక్నీషియన్లు, వెల్డర్లు, మెకానికల్ సిబ్బంది, పరిపాలనా ఉద్యోగులు వంటి వందలాది మందికి ప్రత్యక్ష ఉపాధి లభిస్తుంది. అంతేకాకుండా, అనుబంధ పరిశ్రమలు, ట్రాన్స్‌పోర్ట్, లాజిస్టిక్స్, హోటళ్లు, సేవా రంగాలు అభివృద్ధి చెందడంతో వేలాది మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు కలుగుతాయి. రైల్వే భాగాలు, ఎలక్ట్రికల్ పరికరాలు, లోహ ఉత్పత్తులు, సాఫ్ట్‌వేర్ సేవలు అందించే చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు పెద్ద మార్కెట్ లభిస్తుంది. చిన్న పరిశ్రమలకు ప్రోత్సాహం లభిస్తుంది.ప్రాంతీయ అభివృద్ధి కూడా సాధ్యమవుతుంది. వరంగల్ – హన్మకొండ – కాజీపేట ట్రైసిటీ ప్రాంతం కొత్త పారిశ్రామిక కారిడార్‌గా అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయి. రాష్ట్ర అభివృద్ధి చరిత్రలో, వరంగల్ ప్రాంత ఆర్థిక పురోగతిలో, భారతీయ రైల్వే ఆధునికీకరణలో కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ ఒక చారిత్రక మైలురాయిగా నిలిచిపోనుంది.

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి హర్షం

కాజీపేట రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌కు ఏర్పాటు శుభవార్తపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ యూనిట్‌కు 200 ఇంటర్‌సిటీ రైళ్ల తయారీ బాధ్యత అప్పగించడం తెలంగాణకు గొప్ప గౌరవమని సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ, ప్రధాని నరేంద్ర మోదీ, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

జూ'రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం నిరంతరం సహకారం అందిస్తుంది. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ కేవలం ఒక పరిశ్రమ మాత్రమే కాదు. అది తెలంగాణ ప్రజల దశాబ్దాల ఆకాంక్షకు ప్రతీక. కేంద్ర ప్రభుత్వం అందించిన ఈ అద్భుతమైన అవకాశం, తెలంగాణను జాతీయ రైల్వే తయారీ మ్యాప్‌లో శాశ్వతంగా నిలిపే చారిత్రక మైలురాయి' అని కిషన్ రెడ్డి అభివర్ణించారు.

సుజాత గోపగోని
సీనియర్ జర్నలిస్ట్, 6302164068

కథ

పేరుకు తగ్గట్టు ఊరికి మూలగా ముప్పై ఇళ్లున్న ఒక చిన్న పేట మూలపేట. ఊరికి తెల్లారాలంటే ముందుగా ఆ పేటలో జనం లేవాలి. కొందరు మరుగుదొడ్లు శుభ్రం చేస్తే మరికొందరు ఇళ్ల ముందున్న కాల్వల్లోని మురుగునీరుని తోడితే, ఇంకొందరు ఇళ్లలోని వాళ్లు రోడ్లపై పడేసిన చెత్తాచెదారం ఎత్తుతారు. ఒక మనిషి వ్యర్థాలని వేరొక మనిషి శుభ్రం చెయ్యడం చాలా హేయమైనది. అయినా పాపం ఆ పేట ప్రజలు అందుకు వెనుకాడేవారు కాదు. ఎప్పుడైనా ఎవరైనా టీ తాగడానికని రెండు రూపాయలిస్తే మురిసిపోయేవారు. ఏ ఇంటావిడయినా పాత చీర ఇచ్చినా, ఇళ్లలోని పిల్లల బట్టలు పొట్టయి పోయాయని ఇచ్చినా,పండక్కి పబ్బాలకి కొంచెం పులిహోర, బూరెలు పెట్టినా చాలా సంతోషించేవారు.చేసే పనిబట్టీ వాళ్లని ఊరి ప్రజలు దూరంగా ఉంచేవారు, కానీ వాళ్లల్లో కూడా కన్నుముక్కు తీరుగా ఉన్నవాళ్లెందరో. పక్షుల కంటే ముందే లేచే ఆ జనాలు పొద్దుగూకుతూనే నులక మంచాలెక్కేస్తారు.

* * *

అర్ధరాత్రి పేటలో కొంచెం అలికిడి కావడంతో పేట మొత్తం లేచింది. కిరోసిన్ దీపాలలో ఆ పేట పెద్ద అప్పారావు, వీరిగాణ్ణి పట్టుకుని 'తాగుబోతు నాయాల... ఆ మాట చెప్పడం తప్పనిపించలేదురా... నోటికొచ్చినట్టు పేలుతావా?...' అంటూ తిడుతూంటే అందరూ పేట మధ్యలో గుమ్మిగూడి 'ఏం జరిగింది' అని ప్రశ్నించేటప్పటికి 'దేవుల్లాటి' మన పంతులుగారు సచ్చిపోనారని వాగుతున్నాడు... ఎదవ' అనేసరికి అందరూ వీరిగాణ్ణి తిడుతూ "ఆ మగానుబావుడు గూర్చి అలా మాటాడ్డం తప్పురా ఈరిగా.నువ్వు తాగుతున్నావని, నిన్ను మంచిగా మార్చాలని ఆయన నిన్ను తిట్టినందుకు, అలా మాటాడ్డం తప్పురా?" అంటూ అందరూ వీరిగాణ్ణి తిట్టడం మొదలెట్టారు.

పక్కనే ఉన్న కిట్టిగాడు కల్పించుకొని అప్పారావు వైపు తిరిగి "లేదు మావా, వీరిగాడు సెప్పింది నిజమే. మేమిద్దరం రెండో ఆట సినిమాకెళ్లి వత్తూంటే పంతులుగారి ఇంటికాడ జనాలు మూగున్నారు. ఏటయ్యిందని పంతులుగారి అబ్బాయినడిగితే, ఆ బాబే సెప్పాడు మావా" అంటూంటే, వీరిగాడు "అవును మావ... నేను పంతులుగారు తిట్టిన కాణ్ణుండి ఈరోజు వరకు మందెయ్యలేదు తెలుసా! సూడు కావాలంటే" అని అప్పారావు దగ్గరగా వీరిగాడు నోటి వాసన చూపిస్తూంటే అప్పారావుకి మందు వాసన వెయ్యలేదు.

అయితే వీరిగాడు చెప్పింది నిజమేనన్నమాట అని పేటంతా నమ్మారు. కానీ వారి పేటకు దేవుడులాంటి పంతులుగారు చనిపోయారని తెలిసి పేటంతా కన్నీరు మున్నీరై కుమిలిపోయారు.

* * *

బిక్కవిల్లి సూర్యనారాయణ శాస్త్రి ఆ ఊళ్లోని బ్రాహ్మణుల్లో ఒకరు. ఆయన్ని ఎరిగినవారు 'బుచ్చిబాబుగారు' అని కూడా పిలిచేవారు. ఆ ఊరి శివాలయంలో ఐదారుగురు పూజారుల్లో ఆయనొకరు. వృత్తిరీత్యా ఎవరే పని చేసినా మనుషులంతా ఒక్కటే అని నమ్మే సామ్యవాది. ఒకించుక ముక్కోపి. మూలపేటలోని వాళ్లు చేసుకునే అక్షరాభ్యాసాలు, అన్నప్రాశన, పూజలకి, పెళ్లిళ్లకి మిగతా వాళ్లు వెళ్లకపోయినా ఆ పేట జనాలకి ఆయనే పౌరోహిత్యం చేసేవారు. తెల్లగా పొడుగ్గా ఉండేవారు. పంచె కట్టుకొని పెద్దపెద్ద అంగలు వేసుకుంటూ నడిచేవారు. జనాలిచ్చే స్వయంపాకాలు పట్టుకెళ్లడానికి వీలుగా ఉంటుందని ప్లాస్టిక్ బకెట్, గుడ్డ సంచి పట్టుకెళుతూండడంతో వీధిలోని ఆకతాయి కుర్రాళ్లు ఆయన్ని బకెట్ పంతులు అని పిలిచేవారు. సాటివారు అతన్ని నీచంగాను, నిర్లక్ష్యంగాను చూసినా తాను చేసేది తప్పుకాదని, పౌరుల హితం కోరేవాడే పురోహితుడని, అందరి లోనూ ఉన్నది ఆ భగవంతుడేనని అర్థం చెప్పి అన్ని విధాలుగా వాళ్లకి అండగా ఉంటానని తెగేసి చెప్పి తలెత్తుకుని తిరిగేవారు. ఆయన ఆ పేటకి పౌరోహిత్యమే కాదు... వాళ్ల బాగోగులు చూసే పెద్ద దిక్కు కూడా. ఆ పేట వాళ్లని శుభ్రంగా ఉండమని, మగ పిల్లల్ని, ఆడపిల్లల్ని చదువుకోమని ప్రోత్సహించేవారు. అప్పుడప్పుడు సాయంత్రం వేళ వాళ్ల స్థాయికి దిగి పురాణాలలోని కథలు చెప్పేవారు. ఆ పేటలోని సూరయ్యని చదివించి మున్సిపల్ ఆఫీసులో గుమస్తాగా



పంతులుగారి పేట

భారతీ రాసజ్ఞా



ఉద్యోగం ఇప్పించారు.

* * *

కొంతకాలానికి పేటలోని రెండవ తరం పిల్లల వేషభాషల్లో చాలా మార్పు వచ్చింది. ఆడ మగా చదువుకోవడం, అన్నింటా ఫస్ట్ మార్కులు తెచ్చు కోవడం, పోటీ పరీక్షల్లో ఏ విధమైన మినహా యింపులు పొందకుండా అగ్రస్థానాల్లో నిలవడం ఆయన చలవే.

* * *

అంతటి మంచి వ్యక్తి ఇకలేరని తెలిసిన వెంటనే పేటలోని వాళ్లందరికీ ఏం చెయ్యాలో తోచలేదు. అందరూ కన్నీళ్లు పెట్టుకున్నారు.రాత్రికిరాత్రే పేటపేటంతా కదిలి బుచ్చిబాబుగారింటి వీధి చివర నిలబడ్డారు. వాళ్లు విన్న వార్త నిజమేనని తెలిసి పేటకి పెద్దదిక్కు, తమ బతుకులకు మార్గదర్శనం చేసే వ్యక్తి కోల్పోయి నందుకు తమలోతాము మాట్లాడుకుంటూ ఎంతగానో కుమిలిపోయారు.

* * *

తెల్లవారింది. పిల్లలు, బంధువులు వెంట నడుస్తుంటే పంతులుగారి అంతిమ యాత్ర ఉదయం తొమ్మిది గంటలకి మొదలయ్యింది. ఆయన శవానికి కొద్ది దూరంలో నడుస్తూ పేట జనమంతా శ్మశానం వరకు వెళ్లి తమ పెద్ద దిక్కుకు నివాళులర్పించి వెనుదిరిగారు.

* * *

పంతులుగారి చేతుల మీద చేయించిన ఆఖరి పెళ్లి అప్పారావు కూతురిది. కొద్ది రోజుల తరువాత అప్పారావుకి మనవరాలు పుట్టింది. ఇప్పుడు ఆ పిల్లకి బారసాల చేయించవలసి ఉంది. ఇప్పుడు అదే పెద్ద సమస్య. పంతులుగారు కాలం చేసేక వాళ్లకి పూజలు, పునస్కారాలు, శుభకార్యాలు చేయించే దిక్కు కరవైపోయింది. సలహా కోసం పంతులుగారి అబ్బాయిని వెళ్లి కలిశాడు అప్పారావు. పంతులుగారి చిన్న కొడుకులిద్దరూ వేరే ఉద్యోగాలు చేసు కుంటుండడం వల్ల వాళ్లు కూడా ఏమి సలహా ఇవ్వలేకపోయారు. కానీ పెద్దబ్బాయి రవి సోమనాథ శర్మ పంచాంగం చూసి ఒక మంచి రోజున ముహూర్తం నిర్ణయించాడు.

* * *

పదిహేను రోజులు పోయిన తరువాత ఆరోజు రానే వచ్చింది. ఏం చెయ్యాలో ఎవ్వరికి తోచలేదు. పంతులుగారున్నప్పుడు "మనలో మనకి సంబంధాలు కుదర్చడం, పెళ్లిళ్లు చేయించడం, సీమంతాలకి ముహూర్తం పెట్టడం, నక్షత్ర దోషాలేమైనా ఉంటే చెప్పడం, పిల్లలకి ఏ పేరుపెట్టాలో చెప్పేవారు. ఫలానా అక్షరాలతో మొదలయ్యే పేరుపెట్టండి అని సలహా ఇచ్చినప్పుడు, ఎవరైనా ఎదురు ప్రశ్న వేస్తే కోపంగా 'నా పేరు పెట్టండర్రా...నా పేరు పెట్టండి" అని కోప్పడేవారు. పిల్లలకి అక్షరాభ్యాసాలు చేయించేవారు. వినాయకచవితి నవరాత్రుల్లో వినాయకుణ్ణి నిలబెట్టి రోజు పూజలు చేయించే వారు." అంటూ ఆ రోజు పేటలో పంతులుగారిని తలుచుకోని వారు లేరు. కార్యక్రమం ఎలా జరుగుతుందోనని ఆందోళన పడుతూంటే పంతులుగారిని పోలిన రవిబాబు పంచె కట్టుకొని, తండ్రిలాగే చేతిలో సంచీ పట్టుకొని వచ్చి తన తండ్రికి, ఆ పేటకు వారసుడిగా నిలబడి తనకి తెలిసిన విధంగా కార్యక్రమం జరిపించాడు. ఆ రోజునుండి ఆ పేటకి పెద్ద దిక్కుగా నిలబడ్డాడు.

★



భాగ్యనగర్ : 'ఏ దేశమైనా అభివృద్ధి చెందాలంటే ప్రజల ఐక్యత, శాంతి ద్వారానే సాధ్యమని సర్దార్ పటేల్ బలంగా ఆకాంక్షించారు. ప్రధాని నరేంద్రమోదీ కూడా ఆయన చూపిన మార్గంలోనే పయనిస్తూ దేశాన్ని ఐక్యంగా ముందుకు తీసుకెళ్తున్నారు' అని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ తెలిపారు. భారత భారతి సంస్థ ఆధ్వర్యంలో 'ఏక్ భారత్ – శ్రేష్ఠ భారత్' పేరిట మే 31న నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో భారత మాజీ ఉపప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి మహోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన గజేంద్రసింగ్ మాట్లాడుతూ 'భారత్‌లో భాగ్యనగరం హబ్‌గా అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. రాష్ట్ర భాజపా అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు మాట్లాడుతూ తెలంగాణ ప్రజలు భారతీయులమని సగర్వంగా చెప్పుకొంటున్నారంటే నాడు సర్దార్ పటేల్ చేసిన ఆపరేషన్ పోలోనే కారణమని తెలిపారు. ఈ సందర్భంగా దేశంలో వివిధ రంగాల్లో విశేష సేవలందిస్తున్న 11మందికి పురస్కారాలు ప్రదానం చేశారు. అందులో , ఆర్ఎస్ఎస్ దక్షిణ మధ్య క్షేత్ర ప్రచార్‌ప్రముఖ్ నడింపల్లి ఆయుష్‌కు (హైదరాబాద్) leadership in technology, entrepreneurship & nation building రంగంలో పురస్కారం లభించింది.

భాగ్యనగర్ : దీర్ఘకాలిక భావజాల పోరాటం ద్వారా సాంప్రదాయ సంస్థలను, కుటుంబ వ్యవస్థలను, సాంస్కృతిక విలువలను బలహీనపరచడమే 'కల్చరల్ మార్క్సిజం లక్ష్యం' అని సీనియర్ జర్నలిస్టు వేదుల నరసింహం పేర్కొన్నారు.

మే 30న హైదరాబాద్‌లో జరిగిన "కల్చరల్ మార్క్సిజం : ది వార్ ఆన్ ఇంటెలెక్చువల్ డిస్క్రిప్షన్" తెలుగు అనువాదం పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశాడు. డా.నిరంజన్ బి. పూజార్ రచించిన ఈ పుస్తకాన్ని సంవిత్ ప్రకాశన్ ప్రచురించింది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సామాజిక కార్యకర్త కందుకూరి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ సమాజం, సంస్కృతి, భావజాలాలకు సంబంధించిన అంశాలపై మేధోపరమైన చర్చలు జరగడం అవసరమని అన్నారు. సంవిత్ ప్రకాశన్ డైరెక్టర్ శైలజ మాట్లాడుతూ సమాజానికి ఎదురవుతున్న భావజాలపరమైన సవాళ్లను ఈ పుస్తకం విశ్లేషిస్తుందని ఆమె తెలిపారు.

మేధావులు, సామాజిక కార్యకర్తలు, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొని పుస్తకంలో చర్చించిన అంశాలపై అభిప్రాయాలను పంచుకున్నారు.

భాగ్యనగర్ : బాలానగర్‌లో నిర్వహించిన హిందూ సమ్మేళనంలో మహాసహ‌ప్రావధాని డా॥ గరికపాటి నరసింహారావు, ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంత సహకార్యవాహ ఉప్పలంచ మల్లికార్జున్ పాల్గొన్నారు. 4800 హిందూ బంధువులు పాల్గొన్నారు.

భారత, విశ్వక్రికెట్ అభిమానులను గత ఎనిమిది వారాలుగా అలరించిన ఐపీఎల్ 19వ సీజన్ సమరానికి అహ్మదాబాద్ వేదికగా తెరపడింది. గతేడాది విజేత బెంగళూరు రాయల్ చాలెంజర్స్ వరుసగా రెండోసారి విజేతగా నిలవటం ద్వారా తనకు తానే సాటిగా నిలిచింది.

సూర్యవంశీ 'వైభం'.... బెంగళూరు విజయం!

ప్రపంచంలోనే అత్యంత భాగ్యవంతమైన టీ-20 లీగ్ ఐపీఎల్ పరంపరలో భాగంగా 2026 (19వ) సీజన్ పోటీలు సరికొత్త రికార్డులతో.. పరుగుల సునామీలా నిలిచాయి.

దేశంలోని పలురకాల వేదికల్లో రెండు మాసాల పాటు సాగిన ఈ మహాసమరంలో దిగ్గజ (ముంబై, చెన్నై, కోల్‌కతా) జట్లు వెలవెలపోతే... మాజీ చాంపియన్లు రాజస్థాన్ రాయల్స్, గుజరాత్ టైటాన్స్, హైదరాబాద్ సన్ రైజర్స్‌తో పాటు గతేడాది విజేత బెంగళూరు రాయల్ చాలెంజర్స్ కళకళలాడాయి.

బెంగళూరు వరుసగా రెండోసారి....

ఐపీఎల్‌లో తొలి టైటిల్ కోసం 17 సంవత్సరాల సుదీర్ఘకాలం నిరీక్షించిన కింగ్ కొహ్లీజట్టు బెంగళూరు రాయల్ చాలెంజర్స్ అంచనాలకు మించి రాణించడం ద్వారా వరుసగా రెండోసారి విజేతగా నిలిచి చెన్నై, ముంబై లాంటి హేమాహేమీజట్ల సరసన నిలిచింది. లీగ్ దశ తొలి రౌండ్ నుంచి నాకౌట్ టైటిల్ సమరం వరకూ నిలకడగా రాణిస్తూ వచ్చిన బెంగళూరు జట్టు బ్యాటింగ్, బౌలింగ్ విభాగాలలో విశ్వరూపమే ప్రదర్శించింది. లీగ్ టేబుల్ టాపర్‌గా తొలి క్వాలిఫైయర్స్ పోరులో చిత్తు చేసిన గుజరాత్ టైటాన్స్ జట్టునే టైటిల్ సమరంలోరూ బెంగళూరు అధిగమించడం విశేషం.

అహ్మదాబాద్ నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా జరిగిన ఫైనల్స్‌లో స్కోరింగ్‌గా సాగడం అభిమానుల ఉత్సాహం పైన నీళ్లు చల్లింది. ఆతిథ్య గుజరాత్ జట్టు తన ముందు ఉంచిన 156 పరుగుల లక్ష్యాన్ని కేవలం 5 వికెట్ల నష్టానికే సాధించడం ద్వారా బెంగళూరు విజేతగా నిలిచింది. 2025 సీజన్‌లో సాధించిన టైటిల్‌ను 2026 సీజన్‌లో సైతం నిలుపుకోగలిగింది. 2010, 2011 సీజన్‌లలో ధోనీ నాయకత్వంలోని చెన్నై, రోహిత్‌శర్మ సారథ్యంలోని ముంబై 2019, 2020 సీజన్‌లో వరుసగా రెండేసి టైటిల్స్ సాధిస్తే.. ఇప్పుడు రజత్ పాటీదార్ కెప్టెన్సీలో బెంగళూరు రాయల్ చాలెంజర్స్ సైతం 2025, 2026 సీజన్‌లో తిరుగులేని విజేతగా నిలువ గలిగింది.

బెంగళూరు విజయమంత్రం...

కేవలం ఒకరిద్దరు ఆటగాళ్ల ప్రతిభతో టీ-20 లీగ్‌ల్లో విజయవంతం కాలేమని, జట్టు సమష్టిగా, నిలకడగా రాణించగలిగితేనే విజేతగా నిలువగలమని బెంగళూరు రాయల్ చాలెంజర్స్ నిరూపించింది. బ్యాటింగ్‌లో దిగ్గజ ఆటగాడు విరాట్ కొహ్లీ, దేవదత్ పడిక్కల్, రజత్ పాటీదార్, కృణాల్ పాండ్యా, టిమ్ డేవిడ్, బౌలింగ్‌లో భువనేశ్వర్ కుమార్, జోష్ హేజిల్‌వుడ్, రసిక్ సలామ్, కృణాల్ పాండ్యా అత్యుత్తమంగా రాణించడం ద్వారా బెంగళూరును వరుసగా రెండోసారి విజేతగా నిలుపగలిగారు. విజేత బెంగళూరుకు ట్రోఫీతో పాటు రూ.20 కోట్లు, రన్నరప్ గుజరాత్ టైటాన్స్‌కు రూ.12.50 కోట్లు, మూడోస్థానంలో నిలిచిన రాజస్థాన్ రాయల్స్‌కు రూ.7 కోట్లు, నాలుగో స్థానం పొందిన హైదరాబాద్ సన్ రైజర్స్‌కు రూ.6.50 కోట్లు నజరానాగా దక్కాయి.

వైభవ్ సూర్యవంశీ విశ్వరూపం...

ఈ ఐపీఎలలో బెంగళూరు విజేతగా నిలిచినా అసలు సిసలు విజేతగా మాత్రం రాజస్థాన్ రాయల్స్ చిచ్చర పిడుగు 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశి అందరి దృష్టిని ఆకట్టుకోగలిగాడు. వయసుకు మించిన ప్రతిభతో పరుగుల సునామీనే సృష్టించాడు. ఓ శతకం సహా మొత్తం 776 పరుగులు సాధించడం ద్వారా ఆరెంజ్ క్యాప్ గౌరవాన్ని అందుకోగలిగాడు. 2026 ఐపీఎల్ సీజన్ అత్యుత్తమ, అత్యంత విలువైన బ్యాటర్ అవార్డులు అందుకొన్నాడు.

అత్యధిక వికెట్లు సాధించిన అత్యుత్తమ బౌలర్ ఘనత (పర్పుల్ క్యాప్)ను గుజరాత్ టైటాన్స్ ఫాస్ట్ బౌలర్ కిగిసో రబడ సాధించాడు. రబడ 29 వికెట్లతో అత్యంత విజయవంతమైన బౌలర్‌గా నిలిచాడు. గుజరాత్‌కే చెందిన మహ్మద్ సిరాజ్ 172 డాట్ బాల్స్ (ఒక్క పరుగు ఇవ్వకుండా) వేసిన బౌలర్‌గా రికార్డు నెలకొల్పాడు. అత్యధిక ఫోర్లు (75) ఘనతను గుజరాత్ ఓపెనర్ సాయి సుదర్శన్, అత్యధిక సిక్సర్లు (72) బాదిన బ్యాటర్ రికార్డును రాజస్థాన్ రాయల్స్ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ సాధించారు. 237.3 స్ట్రయిక్ రేట్‌తో సూర్యవంశీ సూపర్ స్ట్రయికర్ అవార్డును సైతం అందుకొన్నాడు.

పలు అరుదైన రికార్డులు....

ఒకే వేదికగా. రెండు ఐపీఎల్ టైటిల్స్ సాధించిన జట్ల వరుసలో బెంగళూరు నిలిచింది. అహ్మదాబాద్ వేదికగానే జరిగిన 2025, 2026 ఐపీఎల్ ఫైనల్స్‌లో బెంగళూరు తిరుగులేని విజయాలు సాధించింది. గతంలో ఇదే ఘనతను ముంబై (2013, 2015-కోల్‌కతా, 2017, 2019 హైదరాబాద్), కోల్‌కతా (2012, 2024- చెన్నై) సాధించిన జట్లలో ఉన్నాయి.

2008 నుంచి 2026 ఐపీఎల్ వరకూ జరిగిన మొత్తం 19 టోర్నీలలో ముంబై, చెన్నై చెరో ఐదుసార్లు, కోల్‌కతా మూడుసార్లు విజేతలుగా నిలువగా..బెంగళూరు రెండుసార్లు విన్నర్‌గా నిలిచిన జట్టుగా రికార్డుల్లో చేరింది. అత్యధిక ఐపీఎల్ ఫైనల్స్ ఆడిన ఆటగాళ్లలో రోహిత్ శర్మ (6), అంబటి రాయుడు (6), ధోనీ, కీరాన్ పోలార్డ్, హార్థిక్ పాండ్యా, కృణాల్ పాండ్యా (5) ఉన్నారు.

కృష్ణారావు చాప్పరపు
సీనియర్ జర్నలిస్ట్, 84668 64969

పెహల్గామ్ ఉగ్రదాడిలో పాక్ బ్యాంకు లింకు

పెహల్గామ్ ఉగ్రదాడి కేసు దర్యాప్తులో సంచలన అంశాలు వెలుగు చూస్తున్నాయి. దాడికి సంబంధించి మొత్తం కథంతా పాకిస్థాన్ నుంచే నడిచిందని జాతీయ దర్యాప్తు సంస్థ నిర్ధారించింది. పెహల్గామ్ దాడిలో వినియోగించిన రెండు ఫోన్ ల కొనుగోలుకు కరాచీలోని ఓ బ్యాంకు ఫైనాన్స్ చేసినట్టు ఎన్ఐఏ దర్యాప్తులో తేలింది. దాడిలో పాల్గొన్న ఉగ్రవాదులు వాడిన రెండు షావోమీ ఫోన్లను దర్యాప్తు బృందాలు స్వాధీనం చేసుకుని, వాటి మూలాలను నిగ్గు తేల్చాయి.

ఉగ్రవాదులు రెండు ఫోన్లు వాడగా..ఒక ఫోన్‌ను కరాచీ నగరంలోని క్లిఫ్టన్ రోడ్ లోని సిరాత్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో కొనుగోలు చేశారు. గతేడాది జూలై 28న జమ్మూ-కశ్మీర్ లోని దచీగామ్ అడవుల్లో జరిగిన భారీ ఎన్ కౌంటర్లో పెహల్గామ్ ఉగ్రదాడిలో పాల్గొన్నముగ్గురు ఉగ్రవాదులను భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. ఎదురుకాల్పుల తర్వాత ఉగ్రవాదుల నుంచి ఆయుధాలు సహా రెండు షావోమీ రెడ్ మీ ఫోన్లను బలగాలు స్వాధీనం చేసుకుని ఎన్ఐఏకు అప్పగించాయి. దీంతో పెహల్గామ్ దాడి కేసు దర్యాప్తు వేగవంతమైంది.

ఫైసల్ బ్యాంక్ లిమిటెడ్ అనేక ప్రముఖ బ్యాంకు షావోమీ ఫోన్ కొనుగోలుకు 2021లో లోన్ ఇచ్చినట్టు తేలింది. లష్కర్ ఏ తొయిబా ఉగ్రవాదులకు ఫైసల్ బ్యాంక్ లిమిటెడ్ లోన్ మంజూరు చేసింది. 2021లో ఫోన్ కొనుగోలు చేసినా..పెహల్గామ్ దాడి వరకూ... సదరు ఫోన్ ను స్విచ్ ఆన్ చేయలేదు. ఉగ్రవాదులు దాడికి పథక రచన చాలా ముందే చేసినట్టు దర్యాప్తు బృందాలు గుర్తించాయి.

లష్కర్ ఏ తొయిబా, లజ్మత్ అల్ దవా సంస్థలకు ఫైసల్ బ్యాంకు అనేక మార్లు లోన్లు ఇచ్చినట్టు 2007లోనే న్యూయార్క్ టైమ్స్ పత్రిక ప్రత్యేక కథనం రాసింది. దాడిలో వాడిన మరో రెడ్ ఫోన్‌ను లాహోర్‌లోని ఎయిర్ లింక్ కమ్యూనికేషన్స్ దుకాణంలో కొనుగోలు చేశారు. రెండో ఫోన్ సైతం పహెల్గాం దాడికి కొద్ది గంటల ముందు స్విచ్ ఆన్ చేసినట్టు దర్యాప్తు తేలింది. అంతేకాదు, దాడికి కొద్ది రోజుల ముందే బైసరణ్ లోయలో ఉగ్రవాదులు టెంట్ వేసుకుని మకాం ఉన్నట్టు ఎన్ఐఏ గుర్తించింది. బైసరణ్ లోయకు ముందే చేరుకున్న ఉగ్రవాదులు పెహల్గామ్‌లో పర్యాటకుల రద్దీ ఎప్పుడు ఉంటుందో గుర్తించిన తర్వాతే దాడి చేసినట్టు తేలింది. దాడి చేసిన తర్వాత ట్రెక్కింగ్ చేస్తూ పారిపోయినట్టు అధికారులు తేల్చారు. పెహల్గామ్ దాడి బాధ్యతలను ఎవరికి, ఎప్పుడు అప్పగించాలో నిర్ణయించిన తర్వాత వారికి ఫోన్లు అప్పగించారు. అందుకే దాడిలో వినియోగించిన రెండు ఫోన్లు దాడికి ముందు వాడి

తర్వాత వెంటనే స్విచ్ ఆఫ్ చేశారని ఎన్ఐఏ అధికారి ఒకరు తెలిపారు.

భారతీయ రైల్వేలో విప్లవాత్మక మార్పులు

శిలాజ ఇంధన వాడకంపై కేంద్రం వినూత్నంగా ఆలోచిస్తోంది. ప్రత్యామ్నాయాలపై దృష్టిసారిస్తోంది. బొగ్గుతో నడిచే రైళ్ల స్థానంలో డిజిల్ ఇంజన్లు వచ్చాయి. ఆ తర్వాత విద్యుత్ ఆధారిత రైళ్లు ఇపుడు నడుస్తున్నాయి. ఇకపై హైడ్రోజన్ రైళ్లు పట్టాలపై పరుగులు తీయనున్నాయి. విద్యుత్ ఆధారిత రైళ్లతో పోలిస్తే వీటి నిర్వహణ, ఇంధన ఖర్చు చాలా తక్కువ. పైగా వీటి వల్ల పర్యావరణానికి ఎలాంటి ఇబ్బందీ లేదని చెప్తున్నారు. మన దేశ తొలి బాహుబలి ఇంజిన్ హైడ్రోజన్ రైలు అతి త్వరలో పరుగులు తీయడానికి సిద్ధమైంది. వీటి రాక రైల్వే గతిని మార్చేస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

మేడిన్ ఇండియా తొలి హైడ్రోజన్ రైలు కార్యకలాపాల ప్రారంభానికి రైల్వే ఆమోదం తెలిపింది. పైలట్ ప్రాజెక్టులో భాగంగా ఈ రైలు హర్యానాలోని జింద్ నుంచి సోనీపథ్ మధ్య పరుగులు తీయనుంది. పది బోగీలు కలిగిన రైలు గరిష్ఠ వేగం గంటకు 110కిలో మీటర్లు. మన హైడ్రోజన్ రైలింజన్ సామర్థ్యం 2,400 కిలోవాట్లు. ఇది ఇతర దేశాల్లో నడుస్తున్న హైడ్రోజన్ రైళ్లతో పోలిస్తే బాహుబలి ఇంజిన్ అని చెప్పుకోవచ్చు. హైడ్రోజన్ ఫ్యూయెల్ సెల్ ప్రొపల్షన్ వ్యవస్థ సాయంతో పనిచేసే ఈ రైళ్లు ప్రస్తుతం జర్మనీ, ఫ్రాన్స్, జపాన్, చైనా, అమెరికాల్లో సేవలు అందిస్తున్నాయి.

'దేశ సమగ్రతను దెబ్బతీస్తే హింస అనివార్యం'

అహింస మానవ జీవన వేదమన్నారు ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్. అయితే దేశ సమగ్రత, సార్వభౌమాధికారాలకు ప్రమాదం వాటిల్లితే అనివార్యంగా హింసను ఆశ్రయించాల్సిందే అన్నారు యోగి. 'అహింసో పరమో ధర్మః - ధర్మహింస తదైవచ" సూక్తిని ఉల్లేఖించిన యోగి ఆదిత్యనాథ్ సామాజిక జీవితానికి భంగం ఏర్పడితే, దేశ భద్రతకు ప్రమాదంగా మారితే తప్పని స్థితిలో హింసా మార్గాన్ని ఆచరించాల్సిందే అన్నారు. లక్నో నగరంలో 'నౌసేన శౌర్య వాటిక'ను ప్రారంభించిన యోగి ఆదిత్యనాథ్ సైనిక బలగాల త్యాగాలను కొనియాడారు.

దేశం బలంగా ఉంటేనే ప్రపంచం మన ముందు మోకరిల్లుతుందని, బలహీనంగా మారితే ఎవరూ పట్టించుకోరంటూ ఉదహరించారు. భారతదేశ సాయుధ బలగాలు శత్రుదేశాల సైన్యంతో వ్యవహరించాల్సి వచ్చినప్పుడు కటువైన హింసామార్గాన్నే ఆశ్రయించడం సహజమన్నారు. అభివృద్ధి, భద్రత

సౌర, పవన విద్యుత్ రంగాల విస్తరణ

దేశ వ్యాప్తంగా గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులు అతి వేగంగా విస్తరిస్తున్నాయి. శిలాజ ఇంధన వాడకం పరిమితంగా ఉండాలని కేంద్రం ఇటీవలే పేర్కొంది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు-పశ్చిమాసియా యుద్ధాల నేపథ్యంలో ఇంధన రంగంలో గందరగోళం నెలకొంది. దీంతో కేంద్రం గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులకు ఊతమిస్తూ విధాన నిర్ణయాలు తీసుకుంటోంది. సౌర, పవన విద్యుత్ రంగాలకు ప్రోత్సాహకాలు కల్పిస్తోంది. 2030 నాటికి సుమారు లక్షా పాతిక వేల కోట్ల పెట్టుబడులు సౌర, పవన విద్యుత్ రంగంలో రావచ్చని కేంద్రం అంచనా వేసింది.

దేశంలో గతేడాది నాటికి పునరుత్పాదక ఇంధన సామర్థ్యం 221గిగావాట్లుగా ఉంది. 2030 నాటికి 300గిగావాట్ల సౌర,పవన విద్యుత్ ఉత్పత్తే లక్ష్యంగా కేంద్రం విధాన నిర్ణయాలు తీసుకున్నది. ఈ ప్రాజెక్టులకు దేశ వ్యాప్తంగా సుమారు 7లక్షల ఎకరాల భూమి అవసరమవుతోందని కేంద్ర ప్రభుత్వం తేల్చింది. కేవలం సౌర విద్యుత్ ప్లాంట్లకే ఆరున్నర లక్షల ఎకరాలు అవసరమవుతుంది. ప్రత్యామ్నాయ ఇంధన వనరుల లభ్యత పెరిగితే విభిన్న రంగాల్లో అభివృద్ధి వేగవంతమవుతుంది.

పవన విద్యుత్ ప్రాజెక్టులకు 15వేల ఎకరాలు అవసరమవుతుంది. అంతే కాదు కేంద్రం ప్రయోగాత్మకంగా భారతీయ రైల్వేలో సౌర విద్యుత్ ఉత్పత్తి చేయాలని నిర్ణయించింది. రైటు పట్టాల మధ్యలో సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేయడం ద్వారా ప్రత్యామ్నాయ ఇంధన ఉత్పత్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా ప్రయోగాత్మకంగా వారణాసిలో బెనారస్ లోకోమోటివ్ వర్క్స్ కు వెళ్లే రైల్వే ట్రాక్ మీద సుమారు 70 మీటర్ల పొడవునా 28 సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసింది. దీంతో రోజుకు 67 యూనిట్లు ఉత్పత్తి చేస్తోంది. ఈ ప్రయోగం విజయవంతమైతే దేశ వ్యాప్తంగా ఉన్న సుమారు లక్షా 35వేల కి.మీ రైల్వే లైన్లపై సౌర విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చు.

ఎండలు మండుతున్నయ్.. జాగ్రత్త

దేశవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రధాని మోదీ కోరారు. మన్ కీ బాత్ రేడియో ప్రసంగం 134వ ఎపిసోడ్లో భాగంగా ప్రధాని మోదీ అనేక విషయాలపై విస్తారంగా మాట్లాడారు. దేశ వ్యాప్తంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు మొదలు ఖగోళ శాస్త్రం వరకు విభిన్న అంశాలను ప్రధాని మోదీ ప్రస్తావించారు. శరీరంలో నీటి శాతం తగ్గకుండా చూసుకోవాలని, ఒకవేళ ఎండలోకి వెళ్లవలసి వస్తే, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వేసవిలో మామిడి పండ్ల గురించి మాట్లాడుకోని ఇల్లు దాదాపు ఉండదన్నారు ప్రధాని. ఉత్తరప్రదేశ్‌కు చెందిన దసేరి, కాశీకి చెందిన లంగ్డా, బిహార్‌కు చెందిన మామిడి పండ్ల సువాసనను దూరం నుంచే ఆస్వాదించవచ్చన్నారు. చౌసా, మాల్దా పేరుతోనూ మామిడితో ప్రజల జ్ఞాపకాలు ముడిపడి ఉన్నాయి' అంటూ ప్రస్తావించారు. దక్షిణాదిలో బంగినపల్లి, తోతాపురి, నీలం, మల్గోవా వంటి ఇతర రకాలు ఉంటాయన్నారు. బెంగాల్లో హిమసాగర్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్లలో సువర్ణరేఖ వంటివి కనిపిస్తాయన్నారు.

ఆస్ట్రానమీ తరతరాలుగా భారతీయులను ఎంతగానో ఆకర్షించిందని ప్రధాని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఈ విషయాన్ని ప్రాచుర్యంలోకి తెచ్చేందుకు బెంగళూరు ఆస్ట్రానమికల్ సొసైటీ ప్రయత్నిస్తోందన్నారు. రాజ్‌కోట్‌కు చెందిన బిగ్ బ్యాంగ్ ఆస్ట్రానమీ క్లబ్ గిర్ అడవుల నుంచి కచ్ రణ్ వరకు అనేక ఖగోళ ఈవెంట్లను నిర్వహించింది" అని మోదీ వివరించారు. తమిళనాడుకు చెందిన విద్యావేత్త గిరిజ అమ్మ గురించి కూడా మోదీ ప్రస్తావించారు. ఆమె చెన్నైలోని జైగోపాల్ గరోడియా హిందూ విద్యాలయం సహా 15 స్కూళ్లను నడుపుతున్నారు. "మన్ కీ బాత్ స్ఫూర్తితో, సైనికుల కోసం రోజూ ఒక రూపాయి విరాళం ఇవ్వాలని పిల్లలను కోరారు. ఈ చిన్న విరాళాలతో దాదాపు రూ.40 లక్షలు అయ్యాయని చెప్పారు. ఆ మొత్తాన్ని గిరిజ అమ్మ సైన్యానికి అందజేశారని మోదీ చెప్పారు. ★

పరస్పర ఆధారితాలన్నారు యోగి. 2017కు ముందు ఉత్తరప్రదేశ్‌లో నిత్యం ఏదో ఒక ప్రాంతంలో అందోళనలు, కర్ఫ్యూ, మాఫియా అరాచకాలు రాజ్యమేలాయన్నారు. సామాన్యులు అనేక ఇబ్బందులు ఎదుర్కొనేవారని గుర్తు చేశారు. ప్రస్తుతం యూపీలో పారిశ్రామిక అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. దేశ భద్రత అనేది కేవలం త్రివిధ దళాలకే పరిమితమైన పనికాదని..ప్రతి పౌరుడూ.. దేశ భద్రత, సమగ్రతలను కాపాడాలని పిలుపునిచ్చారు.

దేశం కోసం సరిహద్దుల్లో పోరాడుతున్న సైనికులను గౌరవించడం దేశ ప్రజల బాధ్యత అని గుర్తు చేశారు. యుద్ధంలో ఉపయోగించే ప్రతి ఆయుధం, యుద్ధనౌకలు స్మారకాలుగా ప్రజల ముందుండాలన్నారు. మోహరింపు నుంచి ఉపసంహరించిన ఐఎన్ఎస్ గోమతి యుద్ధనౌకను గుర్తు చేశారు. దేశ నిర్మాణంలో, సమగ్రత పరిరక్షణలో భారత నౌకాదళం సేవలను ప్రజలు తెలుసుకోవాలని కోరారు.

పులి - మేకపిల్ల | కథ

ఒక మేకలమందలో బుజ్జి మేకపిల్లొకటి ఉండేది. వయసులో చిన్నదైనా తెలివితేటల్లో పెద్దవాళ్లకు ఏ మాత్రం తీసిపోయేది కాదు. ఒకరోజు యజమాని మేకలను కొండ దిగువకి మేత కోసం తోలుకెళ్లాడు. ఆ కొండపైన ఒక పెద్ద అడవి ఉంది. మేకపిల్ల అటూ ఇటూ గెంతుతూ మంద నుండి దూరంగా అడవి వైపు వెళ్లిపోయింది. తన తప్పు తెలుసుకుని వెనుకకు తిరిగి రాబోతుంటే పులి ఎదురుపడింది.పులిని చూడగానే మేకపిల్ల మొదట గజగజా వణికిపోయింది. ఎలాగోలా ధైర్యం తెచ్చుకొని పులి ముందు నిలబడింది.

పులి మేకపిల్ల మీద దూకడానికి సిద్ధం కాగానే "పులిరాజా! ఒక్క నిమిషం ఆగండి. మీకు నేను మూడు నిజాలు చెప్తాను. అవి నిజమని మీరు ఒప్పుకుంటే నన్ను తినకుండా వదిలేయాలి" అంది మేకపిల్ల.

మేకపిల్ల మాటలు ఆసక్తిగా అనిపించడంతో "సరే చెప్పు" అంది పులి కుతూహలంగా.

'ఈ రోజు నాకో మేకపిల్ల ఎదురుపడింది. అయినా చంపకుండా వదిలేశానూ అని "నువ్వు మిగతా పులులతో చెబితే అవి నమ్మవు నిజమేనా?"

"నిజమే!" అని తలూపింది పులి.

"అలాగే నేనూ మా మేకలతో నన్ను ఒక పులి తినకుండా వదిలేసింది అని చెబితే అవి కూడా నమ్మవు. నిజమేనా?" అంది మేకపిల్ల. పులి అవునని తలూపింది.

"ఇక మూడో నిజం. చాలాసేపటి నుండి నేను నీ ముందు నిలబడి ఉన్నాను. నువ్వు నన్ను చంపకుండా నిలబడి మాట్లాడుతున్నావు. నువ్వు ఇంతకు ముందే తిన్నావు కాబట్టి నీకు ఆకలి లేదు నిజమే కదూ!" అంది మేకపిల్ల. అంత చిన్నపిల్ల తనముందు నిలబడి అంత ధైర్యంగా మాట్లాడటం చూసి పులికి ముచ్చటేసింది.

"నిజమే. నువ్వు చాలా తెలివైన దానివి. నిన్ను వదిలేస్తున్నాను పో" అంది.

మంచిమాట

చేసే పని మంచిదైతే చాలు, అదే నిన్ను గొప్పవాడిని చేస్తుంది

మెదడుకు మేత

అరచేతిలో 60 నక్షత్రాలు.. ఏమిటది?

ప్రశ్న : ఉమాజ

పద్యం

ఊరక సజ్జనుండొబిగి యుండిననైన దురాత్ముకుండు ని
ష్కారణ మోర్వలేక అపకారము చేయుట వాని విద్యగా
చీరలు నూరుటంకములు చేసెడివైనను పెట్టెనుండగా
చేరి చినింగిపో గొరుకు చిమ్మట కేమి ఫలంబు? భాస్కరా!

భావం : భాస్కరా! ఎంతో విలువైన బట్టలు పెట్టెలో ఉండగా చిమ్మట పురుగు వాటిని కొరికి పాడుచేస్తుంది. దానివల్ల ఆ దానికి ఏమి లాభం లేదు. కానీ పాడు చేయడం ఒక స్వభావం. అలాగే ఎవ్వరినీ పల్లెత్తు మాట అనకుండా తన ఇంట తానున్న సజ్జనుడిని దుర్జనుడు నిష్కారణంగా బాధిస్తాడు. దానివల్ల ఆతనికి కలిగే ప్రయోజనమూ లేదు. అది చెడ్డవాని గుణం.

శ్లోకం

శాంతి తుల్యం తపోనాస్తి
న సంతోషాత్పరం సుఖం
న తృష్ణాయాః పరో వ్యాధిః
నచో ధర్మో దయాపరః

భావం: శాంతితో సమానమైన గొప్ప తపస్సు, తృప్తికి మించిన అధిక సంతోషం, ఆశను మించిన తీవ్రమైన వ్యాధి, దయను మించిన గొప్ప ధర్మం లేవు.

జతపరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

సీవీ రామన్	అణు శక్తి పరిశోధనలు
జగదీశ్ చంద్రబోస్	రామన్ ఎఫెక్ట్
అబ్దుల్ కలాం	వైర్‌లెస్ కమ్యూనికేషన్
హోమీ జె. బాబా	గణిత శాస్త్రం
శ్రీనివాస రామానుజన్	క్షిపణి సాంకేతికత

ప్రశ్నలు : ఉమాజ

నిర్వహణ : నయనశ్రీ

శాస్త్రవేత్తలు

ఐజాక్ న్యూటన్



ఐజాక్ న్యూటన్ ప్రపంచ చరిత్రలోనే అత్యంత ప్రభావవంతమైన గణిత, భౌతిక, ఖగోళ శాస్త్రవేత్తలలో ఒకరు. ప్రకృతిలోని అనేక రహస్యాలను శాస్త్రీయంగా వివరించి, ఆధునిక విజ్ఞాన శాస్త్రానికి బలమైన పునాది వేశారు. ఈయన రూపొందించిన చలన నియమాలు (Laws of Motion). గురుత్వాకర్షణ సిద్ధాంతం (Law of Gravitation) భౌతికశాస్త్రాన్ని పూర్తిగా మార్చివేశాయి. చెట్టు నుండి ఆపిల్ పడటం గమనించి గురుత్వాకర్షణ శక్తిపై ఆలోచించడం ప్రపంచ ప్రసిద్ధ సంఘటనగా నిలిచింది. అందుకే న్యూటన్‌ను గణిత-భౌతిక శాస్త్ర పితామహుడిగా గౌరవిస్తారు.

జనరల్ నాలెడ్జ్

1. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహించే నియోజకవర్గం ఏది?
2. మేఘాలయా రాష్ట్ర రాజధాని?
3. పక్షుల్ని అధ్యయనం చేసే శాస్త్రాన్ని ఏమంటారు?

సమాధానాలు : 1. కొడంగల్; 2. షిల్లాంగ్, 3. ఆర్నిథాలజీ

భక్తాగ్రేసరులు

రుద్రమదేవి



కాకతీయ రాణి రుద్రమదేవి ఎంతటి పరాక్రమవంతురాలో అంతటి పరమ భక్తురాలు. స్వమత రక్షణతో పాటు పరమతాల, వర్గాల పట్ల అపార సహనం చూపేవారు. మత, ధార్మికపర కార్యక్రమాల్లో భాగంగా ఎన్నో దానధర్మాలు చేశారు. కృష్ణాతీరంలోని మందరం అనే గ్రామం అలా దానం చేసిన వాటిలో ఒకటి. అక్కడ శివాలయం, దాని పరిసరాల్లో ధర్మసత్రాలు, విద్యా వైద్య సంస్థలు నిర్మించారు. తండ్రి గణపతిదేవుడు పెద్ద కుమార్తె రుద్రమదేవి (చిన్న కూతురు గణపాంబ)కు విద్యాబుద్ధులతో పాటు రాజ్యపాలనకు సంబంధించిన అన్ని అంశాల్లో శిక్షణ ఇప్పించాడు. తండ్రి మరణానంతరం ఆమె పాలనాబాధ్యతలు స్వీకరించారు. ఆ వెంటనే దక్షిణ ప్రాంతంలోని కొందరు రుద్రమదేవిపై తిరుగుబాటు చేయగా, ఆమె దానిని విజయవంతంగా అణచివేశారు. తన పాలనలో ప్రజాసంక్షేమానికి, ముఖ్యంగా వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం ఇచ్చారు. చెరువులు, బావులు, కాలువలు తవ్వించారు. మరోవంక వాణిజ్యాన్ని ప్రోత్సహించారు. ఆమె పాలనలో వర్తక వాణిజ్యాలు మూడు పూవులు, ఆరు కాయలుగా వర్ధిల్లాయని, ఆమె రాజ్యం మీదుగా ప్రయాణించిన వెనీస్ యాత్రికుడు మార్కో పోలో తమ రచనలో పేర్కొన్నాడు.

వారఫలాలు

08-14 జూన్, 2026

సింహంభట్ల సుబ్బారావు
6300674054

మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

విద్యార్థులు గతం కంటే మెరుగైన ఫలితాలు సాధిస్తారు. కీర్తిప్రతిష్ఠలు, సుఖ సంతోషాలతో మరింత ఉత్సాహంగా గడుపుతారు. వ్యాపారాలను నిర్విఘ్నంగా కొనసాగించి సకాలంలో పెట్టుబడులను సమీకరిస్తారు. ఉద్యోగాలలో ఎనలేని గౌరవం, పొందుతారు. పారిశ్రామికవేత్తలు, రచయితలకు అనూహ్యమైన అవకాశాలు. 13,14 తేదీల్లో దూరప్రయాణాలు. అనవసర ఖర్చులు. సుబ్రహ్మణ్యాష్టకం పఠించండి.

వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు

మీ మంచితనమే శ్రీరామరక్షగా నిలిచి విజయానికి కారణమవుతాయి. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తారు. తీర్థయాత్రలు చేస్తారు. వ్యాపారాలలో మరింత ఉన్నతి కనిపిస్తుంది. అత్యంత చాకచక్యంగా లాభాలు ఆర్జిస్తారు. ఉద్యోగాలలో కొన్ని మార్పులు జరిగినా మీకు అనుకూలంగానే ఉండడం విశేషం. రాజకీయ వేత్తలు, కళాకారులకు ఊహించని పిలుపు రావచ్చు. 11,12 తేదీల్లో వ్యయప్రయాసలు. బాధ్యతలు పెరుగుతాయి. దేవీస్తుతి మంచిది.

మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

చిన్ననాటి స్నేహితులతో ముఖ్య విషయాలపై చర్చిస్తారు. వాహనాలు, ఖరీదైన ఆభరణాలు కొంటారు. వ్యాపారాలలో కొంత పుంజుకుని లాభాల బాటలో నడుస్తారు. ఉద్యోగాలలో మీ పనితనాన్ని ఉన్నతస్థాయి వారు గుర్తిస్తారు. పారిశ్రామికవేత్తలు, సాంకేతిక నిపుణులు కొత్త సంస్థల ఏర్పాటును వేగవంతంగా చేస్తారు. 13,14 తేదీల్లో ధనవ్యయం. మానసిక అశాంతి. కుటుంబంలో ఒత్తిడులు. శివాష్టకం పఠించండి.

కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష

విద్యార్థులకు శుభదాయకమైన కాలం. ఇబ్బందులు, కష్టాలు తొలగి ఊపిరిపీల్చుకుంటారు. వ్యాపారాలు మరింత లాభించి మరో వ్యాపారానికి శ్రీకారం చూడతారు. ఉద్యోగాలలో ఎంతోకాలంగా పెండింగ్లో ఉన్న బకాయిలు అందే సూచనలు. శాస్త్ర, పరిశోధనారంగాల వారికి విశేష కీర్తి దక్కుతుంది. రచయితల యత్నాలు సఫలం. 8,9 తేదీల్లో ఆరోగ్య భంగం. శ్రమాధిక్యం. మిత్రులతో కలహాలు. నవగ్రహస్తోత్రాలు పఠించండి.

సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

క్లిష్టమైన సమస్యలు సైతం నేర్పుగా పరిష్కరించుకుంటారు. వ్యాపారాలలో నెలకొన్న స్తబ్ధత తొలగి లాభాలు అందుకుంటారు. ఉద్యోగాలలో కొన్ని బాధ్యతల నుంచి విముక్తి లభిస్తుంది. క్రీడాకారులు, కళాకారులు తీసుకునే నిర్ణయాలు ఎంతగానో ఉపకరిస్తాయి. మునుపటి వైభవం దక్కుతుంది. 10,11 తేదీలలో దూరప్రయాణాలు. ఒప్పందాలు వాయిదా. కనకధారా స్తోత్రాలు పఠించండి.

కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు

వాహనాలు, భూములు కొనుగోలు. ఉద్యోగాలలో అదనపు బాధ్యతలు, విధుల నుండి విముక్తి పొందుతారు. పారిశ్రామికవేత్తలు, సాంకేతిక నిపుణులు ఇంతకాలం పడిన కష్టం ఫలిస్తుంది. క్రీడాకారులు, కళాకారులు అత్యున్నత పురస్కారాలు అందుకుంటారు. 12,13 తేదీల్లో అదనపు ఖర్చులు. ప్రయాణాలలో మార్పులు. ఒత్తిడులు పెరుగుతాయి. గణేశాష్టకం పఠించండి.

తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు

పరిచయాలు మరింత పెరిగి సంతోషంగా గడుపుతారు. విద్యార్థులు అనుకూల ఫలితాలు సాధిస్తారు. వ్యాపారాలు మీ అంచనాలకు తగినట్లుగా నడుస్తాయి. ఉద్యోగాలలో కొత్త బాధ్యతలను చేపడతారు. శాస్త్రసాంకేతిక రంగాల వారికి కొత్త అవకాశాలు. కళాకారులు తమ ప్రతిభను మరింత నిరూపించుకుంటారు. 9,10 తేదీల్లో రుణయత్నాలు, విష్ణుసహస్రనామ పారాయణ చేయండి.

వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ

తండ్రి లేదా జ్ఞాతుల ద్వారా ఆస్తిలాభాలు ఉండవచ్చు. ఉద్యోగులకు పైస్థాయి వారితో మరింత సమన్వయం ఏర్పడి విధులు సజావుగా నిర్వర్తిస్తారు. పారిశ్రామికవర్గాలు, రచయితలు, శాస్త్రసాంకేతిక రంగాల వారు సమర్థతతో విజయాలు సాధిస్తారు. 9,10 తేదీల్లో ఆరోగ్యం ఇబ్బంది కలిగిస్తుంది. మిత్రులతో కలహాలు. అంగారక స్తోత్రాలు పఠించండి.

ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

ఉద్యోగులు మరింత ఉత్సాహంగా విధులు నిర్వర్తించి పైస్థాయి నుండి గుర్తింపు పొందుతారు. కళాకారులు, సాంకేతిక నిపుణులకు మునుపటి కంటే కొంత అనుకూలమనే చెప్పాలి. క్రీడాకారులు సత్తా చాటుకుని ముందడుగు వేస్తారు. 11,12 తేదీల్లో దుబారా ఖర్చులు. మనశ్శాంతి లోపిస్తుంది. మిత్రులతో మాటపట్టింపులు. దేవీఖడ్గమాల పఠించండి.

మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఉద్యోగాలలో ఊహించని విధులు నిర్వర్తించడం ద్వారా ఆందోళన చెందుతారు. అయితే మనోబలంతో ముందుకు సాగడం ఉత్తమం. పారిశ్రామిక వర్గాలు, శాస్త్రసాంకేతిక రంగాల వారికి పరీక్షగా ఉంటుంది. కళాకారులు ఎంత ప్రయత్నించినా అనుకున్న అవకాశాలు సాధించడం కష్టమే. 10.11 తేదీలలో శుభవార్తలు. వాహనయోగం. చర్చలు సఫలం. గణేశాష్టకం పఠించండి.

కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు

వ్యాపారాలు పుంజుకుని లాభాల దిశలో పయనిస్తారు. ఉద్యోగాలలో వ్యిధి నిర్వహణలో కొన్ని మెలకువలు పాటిస్తూ ముందుకు సాగుతారు. పారిశ్రామికవర్గాలు, రచయితలకు మరింత ప్రోత్సాహం అందుతుంది. కళాకారులు అవకాశాల ఎంపికలో సంయమనం పాటిస్తారు. 13.14 తేదీల్లో ఆరోగ్య సమస్యలు. చిత్రమైన సంఘటనలు. ధనవ్యయం. ఆంజనేయ దండకం పఠించండి.

మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

విద్యార్థులకు అనూహ్యమైన అవకాశాలు లభిస్తాయి. వ్యాపారాలు ఇంతకాలం వెనుకబడ్డా ఇప్పుడు చురుగ్గా సాగుతాయి. తగిన మొత్తాలు అందుతాయి. ఉద్యోగుల శ్రమ ఫలిస్తుంది. పైఅధికారుల మన్ననలు పొందే సూచనలు. కళాకారులు, రాజకీయవేత్తలు కొన్ని ముఖ్యనిర్ణయాలు తీసుకుంటారు. 8,9 తేదీ లలో శ్రమాధిక్యం. పనుల్లో తొందరపాటు. ఆస్తి వివాదాలు. ఇంటాబయటా సమస్యలు. శివాష్టకం పఠించండి.

పదరసం-567



ఆధారాలు

అడ్డం

1. చతుర్ముఖుడు (3)
4. కలకలం (4)
6. అవధి, ఎల్ల..అటు నుంచి (2)
7. ప్రవచనం, బోధనం (4)
9. భోజనం, తిండి (2)
10. దుఃఖం, విచారం (3)
12. రత్నం, మిన్న (3)
14. పుబ్బకు ముందు.... పదో నక్షత్రం (2)
15. తరువాత, అనంతరం (3)
16. బాలచంద్రుడు, చంద్రవంక (4)
18. పొడి, చూర్ణం ..అటు నుంచి (2)
21. ప్రదేశం, ఊరు (2)
22. వృక్షాలే (4)
23. ఆసక్తి, మోజు (2)
24. స్వర్గం (2)
25. వాటా, వంతు (2)
26. హస్తం, చేయి (2)
28. యవనిక, పరదా (2)
30. కలకత్తా దేవత (3)
31. కలపను కోసే సాధనం (2)
32. అన్నమాచార్య సతి, కవయిత్రి (3)

నిలువు

1.అధికం, ఎక్కువ (3)
2. ఉన్మాదం, పిచ్చి (2)
3. దయ (2)
4. బొక్కసం, ఇల్లు (2)
5. ఇంద్రజాలం (5)
7. సేతు నిర్మాణంలో సాయపడిన ప్రాణి (3)
8. ఆలయం (3)
10. స్వచ్ఛం, మనోహరం (4)
11. వలరాజు (4)
13. నిలుపు 11లోని వాని సతి (2)
15. లోభి,పినాసి (4)
17. కుంభం...(3)
19. పాపం, దుష్కృతం (3)
20. కపోతం (3)
23. యజ్ఞం లాంటిదే (2)
24. దీనికి నరం ఉండదని సామెత (3)
25. అలనాటి సాహిత్య పత్రిక, వాగ్దేవి (3)
26. ఆట, పరిహాసం (2)
27. పట్టణం (2)
29. నక్షత్రం, బిందువు (2)

పదరసం - 566 సమాధానాలు

1 య	ము	2 న		3 గో	4 మ	తి		5 వం	6 గ
ము		7 గ	8 ని		మ		9 సు	ద	తి
10 డు	11 ము	వు	లు		12 త	13 వ్వ		నం	
	క్క		14 వు	15 గో		16 గు	17 రు		18 క
19 జ	లు	20 బు		21 దా	22 ది		23 ష్ఠి	24 కా	రు
ల		25 డా	26 బా		27 నా	మం		28 జా	వ
29 గ	30 ది		31 కా	32 ప	రి		33 ఎ		
	34 వ	క్త		రి		35 ప్ర	ల్ల	36 ద	37 ము
38 మా	సం		39 ఉ	మ		తి		40 గా	ద
నం		41 న	ష	ళం		42 మ	థం		ము

యాక్షన్ మోడ్‌లో బ్లాస్ట్ జోన్ లో

కన్నడ సీనియర్ నటుడు అర్జున్ సర్జాకు జాతీయ స్థాయిలో గుర్తింపు ఉంది. శంకర్ తెరకెక్కించిన 'జంటిల్‌మేన్', 'ఒకే ఒక్కడు' చిత్రాలు దక్షిణాదిలో ఘన విజయం సాధించినా, వాటి హిందీ రీమేక్ కారణంగా అర్జున్ పేరు ఉత్తరాది వారికీ సుపరిచితం అయ్యింది. ఇందులో 'జంటిల్ మేన్' హిందీ రీమేక్‌లో చిరంజీవి, 'ఒకే ఒక్కడు' రీమేక్‌లో అనిల్ కపూర్ హీరోలుగా నటించారు. అయితే ఈ యేడాది ప్రారంభంలో అర్జున్ సర్జా తన కుమార్తె ఐశ్వర్యను హీరోయిన్‌గా పరిచయం చేస్తూ, తాను కీలక పాత్ర పోషించి, స్వీయ దర్శకత్వంలో 'సీతా పయనం' పేరుతో తెలుగులో ఓ సినిమా నిర్మించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట వేసిన ఈ సినిమా కమర్షియల్‌గా నక్సెస్ కాలేదు. అయితే... తాజాగా ఆయన నటించిన తమిళ చిత్రం 'బ్లాస్ట్' చక్కని విజయాన్ని నమోదు చేసుకుంటోంది. ఈ సినిమాను తెలుగులో 'బ్లాస్ట్ జోన్' పేరుతో డబ్ చేసి, సితార ఎంటర్‌టైన్ మెంట్స్ సంస్థ విడుదల చేసింది.

అర్జున్ కొన్నేళ్లుగా తెలుగులో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గానే రాణిస్తున్నారు. అయితే ఇప్పుడీ 'బ్లాస్ట్' మూవీలో ఆయనే హీరో. ఆయన సరసన అభిరామి హీరోయిన్‌గా నటించింది. దాదాపు పాతికేళ్ల తర్వాత వీళ్లు ఈ సినిమాలో కలిసి నటించారు. వీరి కుమార్తెగా 'కన్నప్ప' ఫేమ్ ప్రీతి ముకుందన్ యాక్ట్ చేసింది. ఇక కథ విషయానికి వస్తే... ఎవరు ఇబ్బందుల్లో ఉన్నా, వారికి సహాయం చేయాలనే మనస్తత్వం రాజారాం (అర్జున్ సర్జా)ది. అతనో కరాటే ట్రైనర్. యుక్త వయసులో తనను కరాటే పోటీలో ఓడించిన నీలవేణి (అభిరామి) అనే అమ్మాయినే పెళ్లి చేసుకుంటాడు. వారి కూతురు నీల (ప్రియా ముకుందన్)ను తన ఆదర్శాలకు తగ్గట్టుగా పెంచి పెద్ద చేస్తాడు రాజారాం. అతని తమ్ముడు (వివేక్ ప్రసన్న) అవివాహితుడిగా అన్నతోనే ఉంటూ మెడికల్ షాప్ నడుపుతుంటాడు. ఇదిలా ఉంటే... టెక్సాస్ మైనింగ్ కంపెనీ అధినేత వరుణ్ దయాలన్ (జాన్ కొక్కెన్) రూ. 7000 కోట్ల విలువ చేసే ఓ ప్రాజెక్ట్‌ను దక్కించుకోవాలని చూస్తాడు. అందుకోసం మంత్రికి వెయ్యి కోట్లు లంచం ఇవ్వడానికి సిద్ధపడతాడు. అయితే రాజారాం ఫ్యామిలీ ఈ వ్యవహారంలో తమకు తెలియకుండానే చిక్కుకుంటుంది. దాని లోంచి వారు ఎలా బయటపడ్డారు? తన ప్రాజెక్ట్‌కు ఆటంకం కలిగించిన రాజారాం ఫ్యామిలీని వరుణ్ దయాలన్ ఏం చేశాడు? అనేది మిగతా సినిమా.

వాస్తవంగా చెప్పుకోవాలంటే ఇదేమీ కొత్త కథ కాదు. కోట్లకు పడగలెత్తిన పారిశ్రామికవేత్తలు తమ సంస్థల విస్తరణలో భాగంగా అక్రమాలకు పాల్పడటం, అందుకోసం అమాయకుల భూములను సైతం కబ్జా చేయడం, దానిని అడ్డుకోవడానికి ఎవరో ఒకరు రావడం అనేదే చాలా సినిమాలలో చూస్తేనే ఉన్నాం. అయితే ఇలాంటి సినిమాల్లో ఆ భూమి తోనూ, ఆ ప్రాంతంతోనే అనుబంధం ఉన్నవారు పోరాడతారు. కానీ ఇందులో తమకు సంబంధమే లేని ఓ ఊరిని కాపాడటానికి హీరో కుటుంబం ప్రాణత్యాగానికి సైతం సిద్ధపడుతుంది. మంచిని నిలబెట్టడం కోసం ఎంత దూరమైనా వెళ్లే కుటుంబ సభ్యులుగా అర్జున్, అభిరామి, ప్రీతి ముకుందన్ నటించారు. అదే ఇందులోని యూనిక్ పాయింట్. కాకపోతే.. హీరో తన ఇంటికి వచ్చిన ఆరేడు మందిని తమ ప్రాణాలను కాపాడుకోవడం కోసం చంపేసి, పెరట్లో కప్పి పెట్టేయడం లాంటి సీన్స్ మరీ హాస్యాస్పదంగా ఉన్నాయి. ఇవాళ కాకపోతే రేపైనా ఏదో సందర్భంలో ఆ హత్యల విషయం కచ్చితంగా బయటకు వస్తుంది. కానీ పర్యవసానాల గురించి ఆలోచన చేయకుండా దర్శకుడు ఈ సీన్స్ ను చాలా కాజువల్‌గా తీసేశాడు. సినిమా అంటే అంటేనే ఇల్లాజికల్.దానిని అందరూ అంగీకరిస్తారు. కానీ ఇలాంటి సన్నివేశాలు ఓ పట్టాన మింగుడు పడవు. సినిమా ప్రారంభం నుంచి ముగింపు వరకూ ఇలాంటి సన్నివేశాలు చాలానే ఉన్నాయి. అయితే దర్శకుడు సుభాష్ కె రాజన్ అదృష్టం కొద్ది ప్రేక్షకులు ఈ లూప్ హోల్స్ మీద అంత దృష్టి పెట్టారు. సినిమా ఎంగేజింగ్‌గా ఉందా? లేదా? అని చూసినప్పుడు దీనికి పాస్ మార్కులు పడిపోతాయి.మహిళలు తమ కాళ్లమీద తాము నిలబడాలని, సహాయం చేయడం కోసం ఎవరి కోసమో ఎదురు చూడటం సరైనది కాదని తెలియచెప్పే ప్రయత్నం చేయడం అభినందించదగ్గది.

నటీనటుల విషయానికి వస్తే... అర్జున్ నాలుగున్నర దశాబ్దాల క్రితం కెరీర్‌ను బాల నటుడిగా ప్రారంభించాడు. అప్పట్లోనే యాక్షన్ రోల్స్ అనేకం చేశాడు. ఇది అలాంటిదే. అయితే ఈ వయసులోనూ చాలా సులువుగా యాక్షన్ సీన్స్ చేసేశాడు. ఒకప్పటి హీరోయిన్ అభిరామి ఈ వయసులో యాక్షన్ సీన్స్ చేయడం గ్రేట్. అలానే వీరి కూతురుగా నటించిన ప్రీతి ముకుందన్ సైతం యాక్షన్ సన్నివేశాలు ఈజీగా చేసేసింది. ఇతర ప్రధాన పాత్రలను జాన్ కొక్కెన్, పవన్ కృష్ణ, అర్జున్ చిదంబరమ్, వివేక్ ప్రసన్న, దిలీపన్, బాల హాసన్, వినోద్ సాగర్ తదితరులు చేశారు. రవి బస్రూర్ నేపథ్య సంగీతం బాగుంది. నేపథ్య గీతాల విషయంలో ఇంకాస్తంత జాగ్రత్త పడి ఉండాల్సింది. అవేవీ చెవిని సోకేలా లేవు.ఈ సినిమా కథలో కొత్తదనం లేకపోయినా... కథనం ఆసక్తి కరంగా ఉండటం కలిసొచ్చే అంశం. అయితే ఇవాళ అర్జున్ లాంటి సీనియర్ హీరోల సినిమాలు చూడటా నికి ప్రేక్షకులు పెద్దంత ఆసక్తి చూపడం లేదు. ఆ కారణంగా ఈ సినిమా థియేటర్లలో సందడి చేయడం కష్టమే. కాకపోతే ఓటీటీలో వచ్చినప్పుడు మిస్ కాకుండా చూడొచ్చు. దర్శకుడు సుభాష్ కె రాజ్ తన మీద ఏజీవన్ సంస్థ పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయలేదు.

– అరుణ, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్

స్వరాజ్య
సీమరానికి పునాది
ఆ నెత్తుటి
తర్పణకు నూరేళ్లు
RSS స్ఫూర్తితో
ఈ గ్రామం చేసిన
అద్భుతం ఇది
శివాజీ విగ్రహావిష్కరణకు
రాకుండా నెహ్రూని
అడ్డుకోవాలనుకుం
గురూజీ చేసిందేదో
అమ్మ భాషకు
ఆదరణ
ఎంత?
జానకిరాముల
పరిణయం
ఆధ్యాత్మికతతోనే
ఆరోగ్యం
ఉగాది సారం
జాగృతి
TV
చేరండి
మిమ్మల్ని ఆలోచింపజేసే ఇంటర్వ్యూలు,
ఆసక్తిని రేకెత్తించే సామాజిక, సాంస్కృతిక అంశాలను
జాగృతి ఇప్పుడు యూట్యూబ్ ద్వారా అందిస్తోంది.
జాతీయ దృష్టికోణంతో వివిధ అంశాలపై
మంచి ఆలోచనలు మన ముందుంచుతోంది.
రండి, జాగృతి యూట్యూబ్ ఛానల్‌ను చూడండి, సబ్‌స్క్రైబ్
చేయండి, మీ అభిప్రాయాలు అందరితో పంచుకోండి.
www.youtube.com/@Jagrititv
చెప్పండి
మెచ్చండి
పంచండి

From: **JAGRITI Telugu Weekly**
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 78 Issue : 34

Posting at BPC-IV Patrika Channel, Nampally, Hyd-01